శనివారం
01-10-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 101
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

తెలంగాణ ధర్మతేజం ధర్మభిక్షం 7లో

వామపక్ష ప్రభుత్వాల చుక్కాని

త్యాగధనుల చరిత్ర లాహోర్ కుట్రకేసు

హరీశ్ వ్యాఖ్యలపై
మండిపాటు

- జగన్‌ను తిడితే.. ఊరుకోం !
- ఏపీ మంత్రుల హెచ్చరిక
- కేసీఆర్‌ను తిట్టాలని కోరుకుంటున్నావా అని ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'అక్కడ జగన్‌ను తిడితే...ఇక్కడ మేం కేసీఆర్‌ను తిడతాం..తస్మాత్ జాగ్రత్త' అంటూ రాష్ట్ర మంత్రులు హెచ్చరించారు. ఉపాధ్యాయులపై జగన్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని తెలంగాణ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీనిపై వైసీపీ, టీఆర్ఎస్ మధ్య మాటలయుద్ధం కొనసాగుతోంది. హరీశ్‌రావు వ్యాఖ్యలపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మొదలుకొని..ఇతర మంత్రులు ఘాటుగా స్పందించారు. ఈ పరిణామాలతో కేసీఆర్, జగన్ మధ్య ఉన్న దౌత్యం చెడిందా?, లేక ప్రజలను పక్కదారి పట్టించేందుకు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇటీవల తెలంగాణ ఉపాధ్యాయుల సంఘం సమావేశంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై జగన్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తున్నదని ఘాటుగా విమర్శించారు. ఆయన వ్యాఖ్యలకు ప్రతిగా మంత్రి బొత్స స్పందిస్తూ ఏపీకి వచ్చి చూస్తే ఉపాధ్యాయులకు జగన్ చేస్తున్న సంక్షేమాలేమిటో అర్థమవుతాయని హరీశ్‌రావుకు సూచించారు. ఏపీ, తెలంగాణలో ఇచ్చిన పీఆర్సీలలో తేడా చూస్తే తెలుస్తుందన్నారు. కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారన్న హరీశ్‌రావు వ్యాఖ్యలను బొత్స ఖండించారు. పరిశ్రమలు, ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సైతం హరీశ్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు మధ్య వివాదాలుంటే అక్కడ చూసుకోవాలని, ఆంధ్రప్రదేశ్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. తెలంగాణకు సీఎంగా ఎనిమిదేళ్లపాటు ఉన్న కేసీఆర్ ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. తమ సీఎం జగన్‌ను హరీశ్‌రావు తిడితే తాము ఇక్కడ కేసీఆర్‌ను తిడతామని, దానిని చూసి హరీశ్‌రావు ఆనందంగా ఉండాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను, టీఆర్ఎస్‌ను చూసి నేర్చుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి తమకు లేదన్నారు. ఇటీవల కేటీఆర్ ఉదయం విమర్శించి, రాత్రికి వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు.

మీతో చెప్పించుకునే దుస్థితా: మేరుగు

తెలంగాణ నేతలతో చెప్పించుకునే దుస్థితి తమకు లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున స్పష్టం చేశారు. హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. తమ ప్రభుత్వంపైన, తమ నేత జగన్‌పైనా మాట్లాడే అర్హత లేదన్నారు. హరీశ్‌రావు దుష్టచతుష్టయం చెంతన చేరారని మండిపడ్డారు. అన్ని రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ వివాదం ఇంతటితో ఆగుతుందా?, లేక ముందుకు పోతుందా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది.

సమాఖ్య వ్యవస్థను
రక్షించుకుందాం

సెమినార్‌కు హాజరైన వారిలో ఒకభాగం

మాట్లాడుతున్న కోబాడ్ గాంధీ, వేదికపై కాంగో, రామకృష్ణ, మధు, వెంకటరెడ్డి

- సాంకేతికతతో నూతన సవాళ్లు: కోబాడ్ గాంధీ
- వామపక్షాలతోనే దేశ రక్షణ: కాంగో
- వామపక్షాల పునరేకీకరణ అవశ్యం
- విజయవాడ సదస్సులో వక్తలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలో సమాఖ్య వ్యవస్థను కాపాడాల్సిన అవసరముందనీ, ప్రజల భాగస్వామ్యంతో రాజకీయ పార్టీలు ఇందుకు ముందుకు రావాలని మార్క్సిస్టు మేధావి కోబాడ్ గాంధీ పిలుపునిచ్చారు. సీపీఐ 24వ జాతీయ మహాసభల సందర్భంగా ఆహ్వానసంఘం అధ్వర్యంలో 'వామపక్ష ఉద్యమం-ముందున్న సవాళ్లు' అంశంపై విజయవాడ దాసరిభవన్‌లో శుక్రవారం సెమినార్ జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఆహ్వానసంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షత వహించారు. కోబాడ్ గాంధీ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో నూతన సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. పారిశ్రామిక విప్లవంతో పరిశ్రమలు, కార్మికుల మధ్య గట్టి అనుబంధం ఏర్పడిందని గుర్తుచేశారు. కృత్రిమ రోబొటిక్స్ కారణంగా ఉద్యోగుల అవసరం తగ్గబోతోందని, తద్వారా నిరుద్యోగం పెరగవచ్చని, జొమాటో, స్విగ్గీ, ఉబర్, ఓలా తదితర సంస్థల రాకతో సేవా రంగంలోనూ మార్పులు వస్తున్నాయన్నారు. కార్మికులు, కార్మిక సంఘాలపై ప్రజల్లో భిన్నాభిప్రాయం వ్యక్తమవుతోందని, కార్మిక సంఘాల ఐక్యతను కొనసాగించడం కష్టతరంగా మారుతోందని, రానున్న రోజుల్లో కార్మికుల, ఉద్యోగుల అవసరం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆయన వివరించారు. దీంతో కార్మికవర్గం నూతన పరిష్కారాలు కనుగొనాల్సిన అవసరముందన్నారు. దేశంలో కుల వ్యవస్థ, ఆర్థిక అసమానతలు పెద్ద సమస్యగా మారుతున్నాయని, వాటిని అధిగమించడానికి కొత్త ఆలోచనలు చేయాలని, ఇది పెద్ద సవాలుగా మారనుందన్నారు. సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు బాలచంద్ర కాంగో మాట్లాడుతూ దేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాడేందుకు ప్రతిపక్షాలు ఏకం కావాల్సి ఉందన్నారు. దేశం మొత్తం కార్పొరేట్ల వశమవుతున్న దశలో ప్రతిపక్షాలన్నీ ఉమ్మడిగా పనిచేయాలని సూచించారు. సామాన్య ప్రజానీకానికి కావాల్సిన విద్య, వైద్య, ప్రజారవాణా తదితర అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దేశ బడ్జెట్‌లో అధికంగా విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు జరగాలని సూచించారు. దేశంలో అంబానీ, అదానీ వంటి

- మిగతా 2 లో

ఆరోగ్యశ్రీలోకి కొత్త చికిత్సలు

- 3,254కు చేరనున్న సంఖ్య
- మరో 432 కొత్త 104 వాహనాలు
- రోగుల డైట్ చార్జీల పెంపు
- వైద్యారోగ్యశాఖ సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీలోకి కొత్త చికిత్సలు చేర్చడంపై అధికారులు దృష్టి సారించాలని సీఎం జగన్ ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైద్యారోగ్యంపై సీఎం జగన్ సమీక్షించారు. జగన్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ, అనుబంధ సేవల కింద చేస్తున్న ఖర్చు

- మిగతా 2 లో

కూలిపోతున్న బతుకులు

పేదల సంక్షేమమే తమ ధ్యేయమని చెప్పే ప్రభుత్వాలు నిరుపేదలకు నిలువనీడ లేకుండా చేస్తున్నాయి. వారు రెక్కలు ముక్కలు చేసుకొని నిర్మించుకున్న నివాసాలను దురాక్రమణల నెపంతో కూల్చివేస్తూ బుల్డోజర్ల చక్రాల కింద వారి బతుకులను తొక్కించేస్తున్నాయి. ఢిల్లీలో ఏడాది కాలంలో 60వేలకుపైగా ఇళ్లు నేలమట్టం కాగా ఇవన్నీ పేదలవే కావడం గమనార్హం. ఈ పరిణామంతో మూడు లక్షల మందికిపై ప్రత్యక్షంగా ప్రభావం పడింది. జీవితాంతం కూడబెట్టి కట్టుకున్న గూడు కళ్ల ఎదుటే పేకల మేడలా కూలిపోతుంటే చూసి తట్టుకోలేక కొందరు ప్రాణాలను సైతం వదులుతుండటం ఈ అధ్వాన్న పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రత్యామ్నాయ నివాస వసతులు, ప్రభుత్వ ఆర్థిక సాయం అందక పేదలు తల్లడిల్లిపోతున్నారు. మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారు. రోగులుగా మారుతున్నారు. పసిపిల్లల మదిలో బుల్డోజర్ల చిత్రం వినాశకారిగా ముద్రించబడుతోంది.

- వేలాదిగా పేదల ఇళ్లు నేలమట్టం
- 3లక్షల మందిపై ప్రభావం
- ఆగని బుల్డోజర్ల విధ్వంసం

న్యూదిల్లీ: దేశమంతటా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదల ఇళ్లను కూల్చివేస్తూ వారికి మరింత పేదలుగా మారుస్తున్నాయి. ఓ వైపు సంక్షేమం, స్వయంసమృద్ధి, సాధికారత, అభివృద్ధి మాటలు కేవలం నీటిమూటలుగా పరిణమిస్తున్నాయి. 2021 జనవరి నుంచి 2022 మార్చి వరకు

- మిగతా 2 లో

ఆర్‌బీఐ షాక్

సామాన్యుడిపై
మరింత భారం

- పెరగనున్న ఈఎంఐలు
- నాలుగోసారి రెపో రేటు పెంపు
- 6.7శాతానికి ద్రవ్యోల్బణం అంచనా

ముంబై : దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, గ్లోబల్ మార్కెటింగ్ పతనం, రూపాయి క్షీణత మధ్య భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) శుక్రవారం 50 బేసిస్ పాయింట్ల పాలసీ రేటు పెంపును ప్రకటించింది. 2023 సంవత్సరానికిగాను ద్రవ్యోల్బణాన్ని 6.7శాతంగా అంచనా వేసింది. జనవరిలో ఇది అదుపులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. ఈ ఏడాది రెండో త్రైమాసికంలో 7.1 శాతం, మూడో త్రైమాసికంలో 6.5శాతం, నాలుగో త్రైమాసికంలో 5.8 శాతం ఉంటుందని ద్రవ్యోల్బణాన్ని ఆర్‌బీఐ అంచనా వేసింది. 2023-24 తొలి త్రైమాసికంలో 5.9 శాతంగా ఉంటుందని పేర్కొంది. రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది ఏప్రిల్‌లో 7.79 శాతం గరిష్టానికి చేరినప్పటికీ.. మేలో 7.04 శాతానికి; జూన్‌లో 7.01 శాతానికి; జులైలో 6.71 శాతానికి తగ్గింది. పారిశ్రామికోత్పత్తి వృద్ధి సూచీ జులైలో 2.4 శాతానికి పరిమితమైంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ మరోసారి పెంచింది. రెపో రేటును 0.50 శాతం పెంచి 5.90 శాతానికి చేర్చింది. ఈ మేరకు ఈనెల 28-29 తేదీల్లో జరిగిన ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నరు శక్తికాంత దాస్ శుక్రవారం వెల్లడించారు. మేలో 0.40శాతం; జూన్, ఆగస్టులో 0.50 శాతం చొప్పున, తాజాగా మరో 0.50 శాతం పెంచడంతో 4 నెలల వ్యవధిలోనే రెపోరేటు (బ్యాంకులకు ఇచ్చే రుణాలపై

- మిగతా 2 లో

ఇదీ లోకం!

పాపం, మన గడపకు వచ్చి ఎంత టైమయిందో?

కాంగ్రెస్ అధ్యక్ష బరిలో
ఖర్గే, థరూర్, త్రిపాఠి

న్యూదిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష రేసులో ముగ్గురు అభ్యర్థులు మల్లికార్జున్ ఖర్గే, శశి థరూర్, కేఎన్ త్రిపాఠి నిలిచారు. శుక్రవారం నామినేషన్ల పర్వం ముగియగా, కర్ణాటక నుంచి అనుభవజ్ఞుడైన ఖర్గే స్పష్టమైన అధిష్ఠానం ఎంపికగా భావిస్తున్నారు. 80 ఏళ్ల ఖర్గే... కాంగ్రెస్ అగ్ర నాయకులు ఆనంద్ శర్మ, పృథ్వీరాజ్ చవాన్, మనీశ్ తివారీ, భూపిందర్ హుడాలతో కూడిన జీ23 గ్రూపు సభ్యులతో సహా అనేక సెట్ల నామినేషన్ పత్రాలను ప్రతిపాదకులతో దాఖలు చేశారు. జీ23 గ్రూప్‌లో భాగమైన థరూర్ ఐదు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా, జార్ఖండ్ మాజీ మంత్రి త్రిపాఠి కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల మండలి చైర్మన్ మధుసూదన్ మిస్త్రీకి ఒకే సెట్ ఎన్నికల పత్రాలను దాఖలు చేశారు. ఇక్కడ ఏఐసీసీ ప్రధాన

- మిగతా 2 లో

మునిగిన పంటలు

నిలిచిన రాకపోకలు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా జిల్లాలో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటలు నీట మునిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాల్లో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరింది. ముఖ్యంగా జిల్లాలో హోళగుంద, కోసిగి, ఆలూరు, పెద్దకడుబూరు, ఆళ్లగడ్డ, చాగళ్లమర్రి, ఆళ్లగడ్డ, అవుకు, కొలిమిగుండ్ల, డోన్ ప్రాంతంలో భారీ వర్షం నమోదైంది. పెద్దకడుబూరు మండలంలో 75.2 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. దీంతో అక్కడ పత్తి, మిరప పంటలు నీట మునిగాయి. గ్రామాలకు

- మిగతా 2 లో

కాబూల్‌లో పేలుడు: 100 మంది విద్యార్థుల మృతి

కాబూల్ : అఫ్గాన్ రాజధాని కాబూల్‌లో రక్తపుటేరులు పారాయి. దస్తే బార్చి ఏరియాలోని కాజ్ ఎడ్యుకేషన్ సెంటర్ వద్ద భారీ పేలుడు సంభవించింది. విద్యార్థులు యూనివర్సిటీ పరీక్షలు రాస్తుండగా ఈ పేలుడు సంభవించినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఈ పేలుళ్లపై స్థానిక జర్నలిస్ట్ బిలాల్ సర్వారీ ట్వీట్ చేశారు. ఈ భారీ పేలుడులో 100 మంది విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. తరగతి గది మొత్తం రక్తంతో నిండిపోయింది. యూనివర్సిటీ ఎంట్రెన్స్ మాక్ టెస్టు రాస్తుండగా పేలుడు సంభవించినట్లు జర్నలిస్టు పేర్కొన్నాడు. విద్యార్థుల శరీర భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయని తెలిపాడు. హజారా మైనార్టీ వర్గానికి చెందిన వాళ్లే ఆ స్టడీ సెంటర్ వద్ద ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు భావిస్తున్నారు.

కాన్వాయ్‌పై రష్యా దాడి 23 మంది మృతి

కీవ్: జాపోరిజియా నగరంలోని వాహన కాన్వాయ్‌పై రష్యా బాంబు దాడి చేయడంతో 23 మంది మరణించారు. 28 మంది గాయపడ్డారు. ఉక్రెయిన్‌లోని జపోరిజియాతో సహా నాలుగు ప్రాంతాలను రష్యాలో చేర్చడంపై ప్రజాభిప్రాయ సేకరణ జరగ్గా.. అవి అధికారికంగా రష్యాలో విలీనంకానున్న తరుణంలో ఈ ఘాతుకం జరిగింది. రష్యా ఆక్రమిత ప్రాంతానికి వెళుతున్న మానవతా కాన్వాయ్‌ను రష్యా బలగాలు లక్ష్యంగా చేసుకుని ఈ దాడులకు తెగబడ్డాయి. అయితే, బాంబు దాడి జరగడానికి కారణాలు తెలియరాలేదు. రష్యా ఆక్రమిత భూభాగంలోని తమ బంధువులను తీసుకురావడానికి పౌరులు వెళుతున్న సమయంలో ఈ దాడి జరిగింది. రష్యా ఇప్పటివరకు ఉక్రెయిన్‌లోని చాలా ప్రాంతాలను రష్యా ఆక్రమించింది. డొనెట్స్క్, లుహాన్స్క్ (తూర్పు ఉక్రెయిన్), ఖెర్సన్, జపోరిజ్జియా (దక్షిణ ఉక్రెయిన్) రష్యాలో విలీనం కానున్నాయి. ఈ నాలుగు ప్రాంతాలు ఉక్రెయిన్ భూభాగంలో 15శాతం ఉన్నాయి. శుక్రవారం నాలుగు ప్రాంతాలు రష్యాలో చేరుతాయని రష్యా పార్లమెంట్ ప్రధాన కార్యాలయం క్రెమ్లిన్ తెలిపింది. క్రెమ్లిన్‌లోని సెయింట్ జార్జ్ హాల్‌లో శుక్రవారం జరిగే వేడుకలో నాలుగు ప్రాంతాల అధిపతులు రష్యాలో చేరేందుకు ఒప్పందాలపై సంతకాలు చేస్తారని పెస్కోవ్ విలేకరులతో తెలిపారు.

సహకార ఒప్పందాలకు అమెరికా-పసిఫిక్ దేశాలు సిద్ధం

వాషింగ్టన్: వాతావరణ మార్పుకు "అత్యున్నత ప్రాధాన్యత" లక్ష్యంగా అమెరికా- పసిఫిక్ ద్వీపదేశాలు దీర్ఘకాల నూతన సహకార ఒడంబడికపై సంతకాలు చేశాయి. ఈ నేపథ్యంలో పసిఫిక్ దేశాలకు అమెరికా 810 మిలియన్ల ప్యాకేజీని ప్రకటించింది. పసిఫిక్ ప్రాంతంలో వాతావరణమార్పుల పరిష్కారం, ఆర్థిక సహాయం, మత్స్యసంపద, వాణిజ్యం, పెట్టుబడులు, ప్రజల జీవనోపాధి, భద్రత, శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యనిస్తామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య యుతమైన శాంతియుత వాతావరణానికి కట్టుబడిఉంటామని అమెరికా-పసిఫిక్ దేశాలు వాగ్దానం చేశాయి. శాంతి, భద్రత లోపిస్తున్న ప్రస్తుత తరుణంలో పెరుగుతున్న సవాళ్లనుపరిష్కారానికి నిజమైన భాగస్వామ్యంతో కలిసి పనిచేయాలని కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి. 14 పసిఫిక్ ద్వీప దేశాలు సంతకం చేసిన అమెరికా-పసిఫిక్ భాగస్వామ్యంపై రెండు రోజుల శిఖరాగ్ర సమావేశం వాషింగ్టన్‌లో జరిగింది. రానున్న సంవత్సరాల్లో ప్రజలకు ప్రయోజనం చేకూర్చే కీలక రంగాలలో మా సహకారాన్ని విస్తరించాము అని అమెరికా అధ్యక్షుడు బైడెన్ సమ్మిట్ ముగిసిన తర్వాత ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 11-పాయింట్ల డిక్లరేషన్‌లో ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, పసిఫిక్ దీవుల ఫోరమ్‌తో సంబంధాలను మరింతగా పెంచుకుంటామని పేర్కొన్నారు. ఈ డిక్లరేషన్‌ను ఆమోదించిన ప్రతినిధులలో సోలమన్ దీవుల ప్రధానమంత్రి ఉన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం దాదాపు 80 సంవత్సరాల క్రితం ముగిసింది, కానీ దాని ప్రభావం పసిఫిక్‌లో ఉన్నాయి అని ఈ డిక్లరేషన్ పేర్కొంది.

ఉక్రెయిన్ భూభాగాలు రష్యాలో విలీనం

మాస్కో : ఉక్రెయిన్‌లోని నాలుగు భూభాగాలు శుక్రవారం రష్యాలో విలీనమైనట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. క్రెమ్లిన్‌లోని సెయింట్ జార్జ్ హాల్‌లో జరిగిన వేడుకలో జపోరిజియా, ఖేర్సన్, లుహాన్స్క్, డెబెట్స్క్ నాలుగు స్వతంత్ర ప్రాంతాల అధిపతులు రష్యాలో విలీన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ.. ఇకపై నాలుగు ప్రాంతాలపై ఏదైనా దాడి జరిగినా.. అది రష్యాపైనే దాడిగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌కు చెందిన 15శాతం భూభాగం రష్యాలో కలిసిందని పుతిన్ పేర్కొన్నారు. మా భూభాగాలను కాపాడుకునేందుకు దేనికైనా సిద్ధమన్నారు.

కొత్త సీడీఎస్ చౌహాన్ బాధ్యతల స్వీకరణ

అన్ని సవాళ్లు-కష్టాలను కలిసి అధిగమిద్దామంటూ హామీ

న్యూఢిల్లీ : భారతదేశ నూతన సీడీఎస్‌గా జనరల్ అనిల్ చౌహాన్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. త్రివిధ దళాల అధిపతుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు జాతీయ యుద్ధస్మారకం వద్ద తన తండ్రి సురేంద్ర సింగ్ చౌహాన్‌తో కలిసి అమరవీరులకు నివాళు లర్పించారు. దిల్లీలోని సౌత్ బ్లాక్‌లోని రైసినా హిల్స్‌లో ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌధరి, నేవీ వైస్ చీఫ్ వైస్ అడ్మిరల్ ఎస్ఎన్ గోర్మడే సమక్షంలో సైనికుల గౌరవవందనాన్ని జనరల్ చౌహాన్ స్వీకరించారు. సతీమణి అనుపమాతో కలిసి సీడీఎస్ కార్యాలయానికి వెళ్లారు. బాధ్యతల స్వీకరించిన తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో మాట్లాడారు. ఇదే క్రమంలో విలేకరులతోనూ కొత్త సీడీఎస్ మాట్లాడారు. భారత సైనిక దళాల్లో ఉన్నతహోదా పొందడం గర్వంగా ఉందని, త్రివిధ దళాల ఆశయాల సాధనకు కట్టుబడతానని తెలిపారు. అన్ని సవాళ్లను, అవరోధాలను త్రివిధ దళాలతో కలిసి ఎదుర్కొంటామని అన్నారు. ఈయన 2021 మేలో పదవీ విమరణ పొందారు. అనంతరం జాతీయ భద్రతకు కీలకమైన అనేక అంశాల్లో తన సలహాలు అందించారు. సైన్యంలో అందించిన సేవలకుగానూ పరమ్ విశిష్ట్ సేవా పతకం, ఉత్తమ్ యుద్ధ సేవా పతకం, అతివిశిష్ట్ సేవా పతకం, సేనా పతకం, విశిష్ట్ సేవా పతకాన్ని అందుకున్నారు.

అనిల్ చౌహాన్ తన 40 ఏళ్ల సర్వీసులో సైన్యంలో వివిధ హోదాల్లో పనిచేశారు. తొలి సీడీఎస్ బిపిన్ రావత్ మరణానంతరం దాదాపు 9 నెలలుగా ఖాళీగా ఉన్న ఈ పదవిలో అనిల్ చౌహాన్‌ను ఎంపిక చేసినట్టు కేంద్ర హోంశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రక్షణశాఖ, సైనిక వ్యవహారాల కార్యదర్శిగానూ అనిల్ చౌహాన్ వ్యవహరిస్తారని పేర్కొంది. ఈయన చీఫ్ ఆఫ్ స్టాఫ్ కమిటీ (సీఓఎస్‌సీ)కి శాశ్వత చైర్మన్‌గా ఉంటారని కూడా రక్షణశాఖ వెల్లడించింది.

ఇక రాఘవ్ చడ్డా వంతు

ఆప్ నేతల అరెస్టులపై కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత రాఘవ్ చడ్డా అరెస్టుకు రంగం సిద్ధమవుతోందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం అన్నారు. ఆయనను ఆప్ గుజరాత్ రాజకీయ వ్యవహారాల సహ-ఇంచార్జిగా నియమించడమే ఇందుకు కారణంగా తెలిపారు. ఏ దర్యాప్తు సంస్థ నుంచి ఆరోపణలు - అరెస్టు ఎదురుకావచ్చో చెప్పలేదు. ఆప్ నేతలను అరెస్టు చేయించడం ద్వారా గుజరాత్‌లో ఓడించాలని బీజేపీ కోరుకుంటోందని ఢిల్లీ ఉప-ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఆరోపించారు. ఈసారి కేజ్రీవాల్‌కు అవకాశం ఇవ్వాలని గుజరాత్ ప్రజలు భావిస్తున్నారన్నారు. పంజాబ్ నుంచి రాజ్యసభ ఎంపీ చడ్డా ధైర్యంగా మాట్లాడారు. జైలుకు వెళ్లేందుకు వెనుకాడబోనని, మరణశిక్ష పడినా ఎదుర్కొనేందుకూ భయపడనని ఆయన తేల్చిచెప్పారు. గుజరాత్‌లో ఆప్ బలం పెరుగుతుండటంతో బీజేపీకి కంటిమీద కునుకు లేకుండా పోయిందన్నారు. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ గెలుపులో చడ్డా కీలక పాత్ర పోషించారు. ఆయనకు ఇటీవల గుజరాత్‌లో పార్టీ రాజకీయ వ్యవహారాల సహ ఇంచార్జిగా నియమించారు. కొత్త బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చడ్డా అరెస్టుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన గుజరాత్‌లో ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్నారని కేజ్రీవాల్ హిందీలో ట్వీట్ చేశారు. ఆయనను ఏ కేసులో ఇరికిస్తారో.. అరెస్టు చేస్తారు.. ఎలాంటి ఆరోపణలు చేస్తారో... వాళ్లు అవన్నీ ఆలోచించుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీ మీడియా ఇంచార్జి విజయ్ నాయర్‌ను సీబీఐ అరెస్టు క్రమంలో కేజ్రీవాల్ తాజా వ్యాఖ్యలు చేశారు.

సామాన్యుడిపై మరింత భారం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీ) 1.90 శాతం పెరిగింది. దీంతో ఇల్లు-కారు- విద్యా రుణాలు మరింత పెరగనున్నాయి. ఆదాయానికి తగ్గట్లు ఇచ్చే రుణం మొత్తం తగ్గుతుంది. దీంతో ఇల్లు, వాహనం, వ్యక్తిగత రుణాలు తీసుకున్నవారి ఈఎంఐ మరింత పెరుగుతుంది. ఇప్పటికే గృహ రుణం తీసుకున్న వారి ఈఎంఐ పెరగనుంది. కొన్ని చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను అక్టోబరు-డిసెంబరులో 10 బేసిస్ పాయింట్ల నుంచి 30 బేసిస్ పాయింట్లకు ఆర్థిక శాఖ పెంచింది. వరుసగా తొమ్మిది త్రైమాసికాల్లో వాటిని యథాతథంగా ఉంచిన తర్వాత తాజాగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. వివిధ పథకాలపై వడ్డీ రేట్లు 4 శాతం నుంచి 7.6 శాతం వరకు పెరగనున్నాయి. ద్రవ్యోల్బణ నియంత్రణ కోసమే ఈ చర్యలు అని ఆర్‌బీఐ తెలిపింది. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు, రుణ రికవరీపై ప్రభావం పడకుండా వడ్డీ రేట్లను పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఇదిలావుంటే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గందరగోళం ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ పునరుత్తేజం కొనసాగుతోందని శక్తికాంత దాస్ వెల్లడించారు. సర్దుబాటు విధాన వైఖరి ఉపసంహారణను ఆర్‌బీఐ కొనసాగిస్తుందన్నారు. దేశంలో ఆర్థిక కార్యకలాపాలు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. అంతర్జాతీయ ముడి చమురు ధరల్లో ఇటీవల వచ్చిన దిద్దుబాటు కొనసాగితే ద్రవ్యోల్బణం విషయంలో ఉపశమనం లభించే అవకాశం ఉందని ఆకాంక్షించారు. రెండో త్రైమాసిక గణాంకాలను పరిశీలిస్తే ఆర్థిక కార్యకలాపాలు బలంగా ఉన్నాయని, ప్రైవేటు వినియోగం పుంజుకుంటోందన్నారు. బహిర్గత కారణాల వల్ల వస్తువుల ఎగుమతిపై ప్రతికూల ప్రభావం పడిందని చెప్పారు. బ్యాంకుల రుణ వితరణ 16.2 శాతం వృద్ధితో వేగంగా పెరిగిందని అన్నారు. డాలర్‌కు అనుగుణంగానే రూపాయి విలువ కదలాడుతోందని, భారత విదేశీ మారక నిల్వలు 537.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని దాస్ చెప్పారు.

ఆరోగ్యశ్రీలోకి కొత్త చికిత్సలు

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వంతో పోలిస్తే ఏడాదికి మూడు రెట్లు పెరిగిందన్నారు. పెరిగిన ప్రొసీజర్లతో ఏడాదికి ఆరోగ్యశ్రీకి రూ.2,500 కోట్లు, ఆరోగ్య ఆసరా కోసం రూ.300 కోట్లు, 108, 104 కోసం మరో రూ.400 కోట్లు వెచ్చిస్తున్నామని వివరించారు. మొత్తంగా రూ.3200 కోట్ల వరకూ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, 108, 104 కోసం ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యంపై ఈ ప్రభుత్వం చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. వచ్చే డిసెంబరు నాటికి మరో 432 కొత్త 104 వాహనాలను అందుబాటులోకి తెస్తున్నామని ప్రకటించారు. ఇప్పటికే 676 వాహనాలు సేవలందిస్తున్నాయన్నారు. ఇప్పటివరకు 108 విభాగంలో భాగంగా 748 వాహనాలు సేవలందిస్తున్నాయని, వాటి నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. విలేజ్ క్లినిక్‌లలో 12 రకాల వ్యాధి నిర్ధారణ కిట్లు, 67 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నామని అధికారులు వివరించారు. దీనిపై సీఎం మాట్లాడుతూ కరోనా కిట్ కూడా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆస్పత్రుల స్థాయికు అనుగుణంగా సిబ్బందిని ఉంచాలని, దీనికోసం ప్రతినెలా ఆస్పత్రుల వారీగా ఆడిట్ చేయాలని, వాటి నివేదికలు అధికారులకు చేరాలన్నారు. ఎక్కడ ఖాళీ వచ్చినా వెంటనే మరొకర్ని నియమించే ప్రక్రియ నిరంతరం కొనసాగాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండేలా చూసేందుకు, నిరంతరం ఈ ప్రక్రియను పర్యవేక్షించి... తగిన చర్యలు తీసుకునేందుకు మెడికల్ రిక్రూట్‌మెంట్‌బోర్డు ఏర్పాటు ఆలోచన చేయాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు డైట్ చార్జీలు పెంచాలన్నారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్ పెంపుపైనా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నూతన వైద్య కళాశాలలపై సీఎం సమీక్షించారు. వైద్యకళాశాలల నిర్మాణంపై అధికారులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. అర్బన్‌హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నవంబర్ ఆఖరుకల్లా పూర్తవుతాయని అధికారులు సీఎంకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆయుష్మాన్ భారత్ అవార్డుల్లో ఆరు అవార్డులు ఏపీకి వచ్చాయని అధికారులు తెలిపారు. మొత్తం 10 అవార్డుల్లో 6 రాష్ట్రానికే వచ్చాయని, ఆరోగ్య రంగంలో సీఎం తీసుకుంటున్న చర్యలకు వచ్చిన గుర్తింపు అని చెప్పారు. సమీక్షా సమావేశంలో వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని, సీఎస్ సమీర్ శర్మ, వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శి(కోవిడ్ మేనేజిమెంట్ అండ్ వాక్సినేషన్) ముద్దాడ రవిచంద్ర, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్.గుల్జార్, ప్రత్యేక కార్యదర్శి జీఎస్ నవీన్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ, ఎండీ డి.మురళీధర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ వైద్య విధానపరిషత్ కమిషనర్ వి.వినోద్ కుమార్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈఓ ఎంఎన్ హరీంద్ర ప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ డీజీ (డ్రగ్స్) రవిశంకర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'కూలి'పోతున్న బతుకులు

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 60వేలకుపైగా పేదల ఇళ్లు నేలమట్టం కాగా మూడు లక్షల మంది ప్రజలు ప్రభావితమయ్యారు.

రెండు దశాబ్దాల కిందట ఆరేళ్ల రీనా స్కూలు నుంచి తిరిగి వచ్చే సరికి ఆమెకు తమ ఇల్లు కనిపించలేదు. దాదాపు అరగంట పాటు కంగారుగా వెతికితే తన తల్లి ఆమెకు కనిపించింది. తాను లేని సమయంలో ప్రభుత్వ అధికారులు వచ్చి వారి గుడిసెను శిథిలం చేశారు. ఇది దిల్లీ, మంగ్లాపురిలో జరిగింది. వీరిది సంచార తెగ గాడియా లోహార్ వర్గం. ఈ వర్గం అన్ని వేళలా యాంత్రాంగిక నిర్లక్ష్యానికి గురవుతూ వచ్చింది. తన ఇల్లు ఆకస్మికంగా కనుమరుగు కావడం నిలువ నీడ లేకుండా జీవితం రోడ్డు పాలు అవడాన్ని రీనా మర్చిపోలేకపోయింది. ఏళ్లు గడిచాయి. ఆమె పెరిగి పెద్దయ్యిందిగానీ ఆ బస్తీలో పరిస్థితిలో మార్పు రాలేదు. 2022, సెప్టెంబరు 20న ప్రభుత్వ అధికారులు అక్కడకు చేరుకొని ఆమెతో పాటు మరికొందరి ఇళ్లను కూల్చివేశారు. స్కూళ్లకు వెళ్లిన పిల్లలు తిరిగి వచ్చేసరికి రీనా తన చిన్ననాట అనుభవించిన భయం, అభద్రతా భావాన్నే వారూ అనుభవించారు. అక్కా. ఇక్కడ ఏం జరిగింది అంటూ రీనాను ప్రశ్నించారు. రెక్కలు ముక్కలు చేసుకొని పైసాపైసా కూడబెట్టి ఏర్పాటు చేసుకునే గూడును అధికారులు ఏ క్షణంలో కూల్చివేస్తారో అన్న భయం రీనా వర్గీయులను వెంటాడుతోంది. జీవనోపాధి, కష్టపడి సంపాదించుకున్నదంతా కోల్పోతామనే భయంతో వారు బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

2021 జనవరి నుంచి 2022 మార్చి వరకు కూల్చివేసిన ఇళ్లల్లో 60వేలకుపైగా తక్కువ ఆదాయ కుటుంబాలే ఉన్నాయి. ఫలితంగా మూడు లక్షల మంది రోడ్డున పడ్డారు అని గృహ-భూ హక్కుల నెట్వర్క్ (హెచ్ఎల్ఆర్ఎన్) నూతన నివేదిక వెల్లడించింది. ఈ కూల్చివేతలకు ఆక్రమణ-పర్యావరణ ప్రాజెక్టుల కోసం వంటి అనేక కారణాలు ఉన్నట్లు తెలిపింది. దేశంలో జరిగే కూల్చివేతలపై వెలువడిన ఐదవ నివేదిక ఇది కాగా ఐదేళ్లలో దాదాపు పది లక్షల మందిని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఖాళీ చేయించేశారు. ఇంటి భయానక పరిణామాలు కనిపిస్తున్నాగానీ భారత్‌లో కూల్చివేతలు ఆగడం లేదు.

'అక్రమ ఆక్రమణలు' నెపంతోనే 2021లో 14.31శాతం బలవంతపు తొలగింపులు జరిగాయి. పేదలపై భూ కబ్జాదారులు, దురాక్రమణదారులు అనే ముద్రను ప్రభుత్వ అధికారులు వేశారు. పొట్టకూటి కోసం దిల్లీ సహా ఇతర మెట్రోపాలిటన్ నగరాలకు వెళ్లే వందల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. బలవంతంగా ఇళ్లను కూల్చివేయడం మానవహక్కుల ఉల్లంఘనగా అంతర్జాతీయ సమాజం భావిస్తుంది. దీంతో భారతీయ న్యాయ వ్యవస్థ ఏకీభవిస్తుంది. ఇదే క్రమంలో అనేక తీర్పులు వెలువడ్డాయి. అసాధారణమైన పరిస్థితులలో చివరి ప్రయత్నంగా మాత్రమే కూల్చివేతలకు అనుమతి ఉంటుందని పేర్కొన్నాయి. 'సాధారణ పరిస్థితి ఉన్నా మహమ్మారి కాలంలోనైనా బలవంతపు తరలింపులు, కూల్చివేతలు మానవహక్కుల చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమే అవుతుంది' అని కోవిడ్ వేళలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి పేర్కొన్నారు. కోవిడ్ నుంచి ప్రపంచ దేశాలు కోలుకుంటుండే భారత్‌లో వేలాది కుటుంబాలు దారిద్ర రేఖ దిగువనకు చేరుకున్నాయి. తమ కుటుంబాల కోసం ఒక్క గదికి రూ.4వేలు లేదా రూ.5వేలు అద్దె చెల్లించే స్తోమత లేక కుంగిపోతున్నారు. మంగ్లాపురిలో సెప్టెంబరులో కూల్చివేతల అనంతరం గాడియా లోహార్ కుటుంబాలు రోడ్డున పడగా ప్రభుత్వ సాయం అందలేదు. 2021లో ఇలా కూల్చివేతలు జరిగి నిరాశ్రయులైన వారిలో 59శాతం మందికి పునరావాసం కల్పించలేదు. ఆర్థిక సాయం అందించలేదు. అలాంటి పరిస్థితుల్లో బాధితులు అవే వీధుల్లో లేక చుట్టుపక్కల ప్రాంతాల్లో దుర్భర జీవితాలు గడుపుతూ ఉంటారు. 'జుగ్గీ' మురికివాడలు / బస్తీలు 'నోటిఫైడ్ సెటిల్‌మెంట్లు' కాదని దిల్లీ మురికివాడ జేజే పునరావాస విధానం 2015 చెబుతోంది. దీంతో ఏ సమయంలోనైనా వీటిని తొలగించేయడమే కాకుండా ప్రత్యామ్నాయం గృహాలను కేటాయించాల్సిన అవసరం కూడా ప్రభుత్వాలకు ఉండదు.చాలా బస్తీల సర్వే జరగలేదని దిల్లీ హైకోర్టు ఈమధ్యనే గుర్తించింది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదం వల్ల పునరావస చర్యలు స్తంభించాయి. గతంలో కూల్చివేతల బాధితులకు కేటాయించిన ఇళ్లను ఇప్పుడు వలస కార్మికుల కోసం అద్దె సముదాయాల పథకానికి కేటాయించినట్లు దిల్లీ హైకోర్టు ఉత్తర్వుల్లో వెల్లడి అయింది.

'జహా ఝుగ్గీ వహీ మాకన్' అంటూ దిల్లీ పేదలకు కేంద్ర-దిల్లీ ప్రభుత్వాలు హామీనిచ్చాయిగానీ అధికార పోరు క్రమంలో ఇది ఆచరణకు నోచుకోని పరిస్థితి ఉంది. ఇళ్లు కల్పించాల్సిందిపోయి ఉన్న గూడు కూడా కూల్చివేస్తుండటంతో ప్రజలు అధ్వాన్న పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ముందుగా సమాచారం కూడా ఇవ్వకుండా కూల్చివేతలకు అధికారులు పూనుకుంటున్నారు.

బలవంతపు తొలగింపులు/ కూల్చివేతల నిషేధానికి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు పిలుపునిస్తున్నాయి. భారత్‌లో మాత్రం భిన్నపరిస్థితి ఉంది. కోవిడ్ కాలంలో కూల్చివేతలు వద్దు అని ప్రభుత్వాన్ని కోర్టులు ఆదేశించాల్సి వచ్చింది. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపునకు దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఇచ్చిన ఉత్తర్వులతో ఇప్పటికే అనేకమంది నిరాశ్రులయ్యారు. దేశవ్యాప్తంగా 1.5 కోట్ల మంది తొలగింపుల భయంతోనే జీవిస్తున్నారు. తాము కష్టపడి ఇల్లు కట్టుకుంటే అధికారులు కూల్చివేస్తారని, వాళ్లు కూలగొట్టడం.. తాము కట్టుకోవడం మామూలేనని 77ఏళ్ల వృద్ధురాలు అన్నారు. ఆమె మాటలు వేలాది కుటుంబాల ఆత్మఘోషను వినిపించాయి. పేదలపై బుల్డోజర్ విధ్వంసానికి అద్దంపట్టాయి.

మునిగిన పంటలు

(మొదటి పేజీ తరువాయి)

రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. కోసిగి మండలంలోనూ ఇదే పరిస్థితి. చాపవంక రావడంతో ఉరుకుందుకు రాకపోకలు నిలిచిపోయాయి. హోళగుంద మండలంలో 41 మిల్లీమీటర్లు వర్షం నమోదైంది. ఇక్కడ పెద్దఎత్తున పంటపొలాలు నీట మునిగాయి. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరింది. ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వేదవతి నది పొంగి పొర్లుతుండటంతో కర్ణాటకకు రాకపోకలు నిలిచిపోయాయి. కర్నూలు హంద్రీ నదికి భారీగా వరద నీరు వచ్చి చేరంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులు సూచించారు.

'బూటు కాలు దాడి' మరిచారా హరీశ్?

గొడవలు ఉంటే మీరు, మీరు చూసుకోండి

మాపై ఎందుకు పడుతున్నారు?

మిమ్మల్ని చూసి నేర్చుకోవాల్సిన పనిలేదు

మంత్రి అమర్‌నాథ్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్కడి ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తోందని తెలంగాణ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు ఏపీలో కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలోనే హరీశ్ రావు వ్యాఖ్యలపై ఏపీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. టీచర్లకు తాము ఏం చేశామో ఏపీకి వచ్చి చూడాలన్నారు. గతంలో దిల్లీలోని ఏపీభవన్‌లో ఏపీ ఉన్నతాధికారిని హరీశ్‌రావు బూటు కాలితో ఎలా తన్నారో అందరూ చూశారని గుర్తు చేశారు. హరీశ్‌రావుకు సీఎం కేసీఆర్‌కు గొడవలు ఉంటే వాళ్లు, వాళ్లు చూసుకోవాలని, ఏపీపై ఎందుకు పడుతున్నారని ప్రశ్నించారు. హరీశ్‌రావు కేసీఆర్ మనిషా? రామోజీరావు మనిషా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు జగన్‌ను తిడితే, మేంఇక్కడ కేసీఆర్‌ను తిడతామని, అది చూసి హరీశ్‌రావు హ్యాపీగా ఫీల్ అవుతారా? అని గుడివాడ ప్రశ్నించారు. ఎనిమిదేళ్లుగా సీఎంగా ఉన్న కేసీఆర్ తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. కేసీఆర్‌ను హరీశ్‌రావును చూసి తాము నేర్చుకోవాలిసిన అవసరం లేదన్నారు. ఏపీలో మూడేళ్లలో తాము ఏం చేశామో ప్రజలకు తెలుసన్నారు.

ఖర్గే, థరూర్, త్రిపాఠి

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో ఖర్గే కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల బరిలోకి దిగిన తరుణంలో ఆయన వెంట అనేక మంది నాయకులు ఉండటంతో ఖర్గేకు స్పష్టమైన అభిమానం కనిపిస్తోంది. 'ఎన్నికల్లో పోటీ చేయమని ముఖ్య రాష్ట్రాల నుంచి వచ్చిన నేతలు, పార్టీ కార్యకర్తలు, ప్రతినిధులు అందరూ నన్ను ప్రోత్సహించారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో నా పక్కన ఉన్న వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని ఖర్గే ఇక్కడ విలేకరులతో అన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో నేతలు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో గాంధీ కుటుంబానికి చెందిన వారు ఎవరూ లేరు. 'నేను ఎప్పుడూ ఈ పోరాటం చేస్తూనే ఉన్నాను. నా చిన్ననాటి నుంచి నేను అనుబంధంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆశయాలను నిలబెట్టడానికి మరింత పోరాడటానికి నేను ఆసక్తిగా ఉన్నాను' అని ఖర్గే అన్నారు. 66 ఏళ్ల శశి థరూర్ తన ఎన్నికల ప్రత్యర్థి ఖర్గేని పార్టీకి 'భీష్మ పితామహుడు'గా అభివర్ణించారు. నాయకుడిని ఎన్నుకునే బహిరంగ ప్రజాస్వామ్య ప్రక్రియతో భారతదేశంలోని ఏకైక పార్టీకి సేవ చేయడం విశేషం. ఇది జరగబోయే స్నేహపూర్వక పోటీ. మేము శత్రువులు లేదా ప్రత్యర్థులు కాదు. అతనికి అగౌరవం లేదు కానీ నేను నా ఆలోచనలకు ప్రాతినిధ్యం వహిస్తాను' అని తిరువనంతపురం నుంచి లోక్‌సభ సభ్యుడు అయిన థరూర్ తన నామినేషన్ పత్రాలను దాఖలు చేసిన తర్వాత విలేకరులతో అన్నారు. తన ఎన్నికల పోటీదారు మల్లికార్జున్ ఖర్గే 'కొనసాగింపు' అభ్యర్థి అని, పార్టీ మారాలని కోరుకునే వారు ఓటు వేయాలని అన్నారు. కొన్ని వర్గాలలో 'అధికారిక అభ్యర్థి' గురించి మాట్లాడుతున్నట్లు తనకు తెలుసునని, అయితే గాంధీ కుటుంబం 'ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా' ఎవరికీ మద్దతు ఇవ్వడం లేదని ఆయన పదేపదే చెప్పారు. 'మీరు పార్టీలో మార్పు, పురోగతిని కోరుకుంటే, ఆ మార్పు కోసం నేను నిలబడతానని ఆశిస్తున్నాను' అని థరూర్ అన్నారు. 'నాకు కాంగ్రెస్ పట్ల విజన్ ఉంది. నేను దానిని 9 వేల మంది ప్రతినిధులతో పంచుకుంటాను. వారి మద్దతును కోరతాను. నా నామినేషన్ పత్రాలు నాకు లభించిన విస్తృత మద్దతును ప్రతిబింబిస్తాయి. కశ్మీర్ నుంచి కేరళ వరకు, పంజాబ్ నుంచి నాగాలాండ్ వరకు డజను రాష్ట్రాల నుంచి పార్టీ కార్యకర్తల సంతకాలు నా వద్ద పొందుపరిచారు. కాంగ్రెస్‌ను బలోపేతం చేసి దేశాన్ని ముందుకు తీసుకువెళతామని ఆశిస్తున్నాము' అని తెలిపారు. థరూర్ కాంగ్రెస్ ప్రతినిధుల 50 మంది సంతకాలతో ఐదు ఫారమ్‌లను సమర్పించారు. కాగా నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి రోజు. అక్టోబర్ 17న జరిగే ఈ ఎన్నికల్లో 9,100 మంది ప్రతినిధులు ఓటు వేయడానికి అర్హులు. ఫలితాలను అక్టోబర్ 19న వెల్లడిస్తారు.

నేను పెద్ద మార్పు కోసం పోరాడుతున్నాను : ఖర్గే

పార్టీలో పెద్ద మార్పు కోసం తాను పోరాడుతున్నానని పార్టీ అధ్యక్ష పదవికి శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన ప్రముఖ కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే అన్నారు. అలాగే ప్రతినిధులందరూ తనకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఏఐసీసీ కార్యాలయంలో విలేకరులతో ఖర్గే మాట్లాడుతూ 'కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో నాకు మద్దతిచ్చినందుకు అన్ని రాష్ట్రాల సీనియర్ నేతలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను' అని తెలిపారు. ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ నేతలు అశోక్ గెహ్లోట్, దిగ్విజయ్ సింగ్, ప్రమోద్ తివారీ, పీఎల్ పునియా, ఏకే ఆంటోనీ, పవన్ కుమార్ బన్సాల్, ముకుల్ వాస్నిక్ ప్రతిపాదించారు. జీ23 నేతలు ఆనంద్ శర్మ, మనీశ్ తివారీ కూడా ఆయనకు మద్దతుగా నిలిచారు. పార్టీలో అత్యంత అనుభవం ఉన్న వ్యక్తుల్లో ఖర్గే ఒకరని, దళిత నేత కూడా అని తివారీ అన్నారు.

సమాఖ్య వ్యవస్థను రక్షించుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

బహుళజాతి సంస్థల ప్రాధాన్యత పెరుగుతున్న దృష్ట్యా దేశ ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత వామపక్షాలకు, ఇతర ప్రాంతీయ, జాతీయ పార్టీలకు ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన జాతీయ పార్టీగా కీలకభూమిక పోషించాలని, మరోపక్క టీఆర్ఎస్, ఇతర పార్టీలు కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేసేందుకు ఇష్టపడం లేదని చెప్పారు. మోదీ హిందుత్వ, ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ యేతర శక్తులన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. దేశ రాజకీయాలకు దిశ, దశ నిర్దేశించేలా సీపీఐ జాతీయ మహాసభలు కీలకంగా నిలవనున్నాయని కాంగో చెప్పారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు పి.మధు మాట్లాడుతూ సీపీఐ జాతీయ మహాసభలకు అన్ని విధాలా సహకరిస్తామని ప్రకటించారు. మహాసభల్లో వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల సంఘటనపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరముందని సూచించారు. నాడు సంపూర్ణ స్వాతంత్ర్య నినాదం లేవనెత్తింది... స్వాతంత్ర్య ఉద్యమంలో అగ్రభాగాన నిలిచింది కమ్యూనిస్టులేనని గుర్తుచేశారు. జాతీయోద్యమంలో కమ్యూనిస్టులు బలమైనశక్తిగా ఎదిగారన్నారు. సరళీకరణ ఆర్థిక విధానాలు కమ్యూనిస్టు ఉద్యమాన్ని దెబ్బతీశాయని సోదాహరణగా ఆయన విశ్లేషించారు. బీజేపీ ఎలాంటి ఉద్యమాలు చేయకుండా కేవలం భావజాలవాదంతో బలపడి, అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. పోరాటాల ద్వారానే వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల సంఘటన బలోపేతమవుతుందని స్పష్టం చేశారు.

సీపీఐ నేత కె.రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ జాతీయ మహాసభల్లో భాగంగా విజయవాడ, విశాఖపట్నంలలో సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. మోదీ హయాంలో రాజకీయాలు ప్రమాదంలో పడ్డాయని విమర్శించారు. మతతత్వ విధానాలతో ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్నారని, రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నారని దుయ్యబట్టారు. ఇందుకు ప్రధానంగా ఆర్టికల్-370, అయోధ్య తదితర అంశాలే నిదర్శనాలని వివరించారు. ప్రస్తుత లేదా గతంలో అధికారంలో ఉన్న పార్టీలన్నీ కార్పొరేటీకరణ విధానాలతోనే దేశాన్ని ముందుకు తీసుకెళుతున్నాయని, ఇది చాలా ప్రమాదకరమన్నారు. బీజేపీ-ఆరెస్సెస్ విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులతో కలిసి లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఉద్యమించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టుల ఉద్యమం పునరేకీకరణ జరగాల్సి ఉందని, ఆ దిశగా జాతీయ మహాసభల్లో సమగ్రంగా చర్చిస్తామన్నారు. దేశ రాజకీయాలకు కేంద్ర బిందువుగా ఈ మహాసభలు నిలవనున్నాయని పునరుద్ఘాటించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశం తిరోగమనంలో పయనిస్తోందని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ-ఆరెస్సెస్ పాత్ర లేదనీ, అయినా జాతీయ భావం పేరుతో ముందుకెళ్తున్నాయన్నారు. హిందూ, ముస్లింల మధ్య అసమానతలు సృష్టించి, రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్నాయని ధ్వజమెత్తారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నప్పటికీ దేశంలో పేదరికం తగ్గకపోగా, మరింత పెరిగిందన్నారు. ప్రధాని మోదీ అన్ని రంగాలను దెబ్బతీస్తున్నారని, ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారని విమర్శించారు. అంబానీ, అదానీ ఆస్తులు విపరీతంగా పెరిగిపోతున్నాయని వివరించారు.

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జాతీయ మహాసభల విజయవంతానికి తెలంగాణ నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. వామపక్ష ఉద్యమం-ముందున్న సవాళ్లపై విస్తృతంగా చర్చ జరగాల్సి ఉందని, ఉద్యమ బలోపేతంపైనా దృష్టి సారించాలని చెప్పారు. కమ్యూనిస్టుల వైపు ప్రజలు వచ్చేలా ప్రజా పోరాటాలు నిర్మించాల్సి ఉందన్నారు. సీపీఐ ఏపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి సదస్సుకు స్వాగతం పలుకుతూ మోదీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలు అవలంబిస్తోందన్నారు. హిందుత్వ అజెండాతో అధికారంలోకి వచ్చి ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని, వాటిని వామపక్ష ఉద్యమాలతో తిప్పికొట్టాలన్నారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రానాయక్, పెంచలయ్య, కోశాధికారి ఆర్.పిచ్చయ్య తదితరులు విప్లవ గీతాలు ఆలపించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సీపీఐ, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గసభ్యులు, పార్టీ నేతలు, ఆహ్వానసంఘం ప్రతినిధులు, వామపక్ష నేతలు పాల్గొన్నారు.

'కల్యాణమస్తు, షాదీ తోఫా'కు శ్రీకారం

- వెబ్‌సైట్ ప్రారంభించిన సీఎం జగన్
- నేటి నుంచి పథకాల అమలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పిల్లల చదువులను ప్రోత్సాహం, బాల్య వివాహాల నిరోధించేందుకే వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలకు శ్రీకారం చుట్టినట్లు సీఎం జగన్ వెల్లడించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో పథకాల వెబ్‌సైట్లను సీఎం ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, భవన నిర్మాణ కార్మికుల, పేద అమ్మాయిల వివాహాలకు వైఎస్సార్ కల్యాణమస్తును జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అర్హులైన ముస్లిం మైనార్టీ పేద అమ్మాయిల పెళ్లిళ్లకు వైఎస్సార్ షాదీ తోఫా కింద అందజేస్తారు. సీఎం మాట్లాడుతూ, మరో మంచి కార్యక్ర మానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఇప్పటివరకు ప్రభు త్వం, పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధపెట్టిందని, వారంతా కచ్చితంగా చదువుకోవాలని రకరకాల అడుగులు వేస్తున్నా మన్నారు. మూడేళ్లుగా విద్యారంగం మీద అత్యధిక శ్రద్ధ పెట్టామని, విద్యావ్యవస్థలో గొప్ప మార్పులు తీసుకువచ్చా మని వెల్లడించారు. పిల్లలను బడికి పంపిస్తున్న తల్లులను ప్రోత్సహించేందుకు అమ్మ ఒడి, సంపూర్ణ పోషణ, గోరుముద్ద, విద్యాకానుక, ఇంగ్లీషు మీడియం, సీబీఎస్ఈ సిలబస్, బైజూస్‌తో ఒప్పందం తీసుకొచ్చామన్నారు. నాడు-నేడుతో స్కూళ్ల రూపురేఖలు మారుస్తున్నామని, వాటి నిర్వాహణకోసం టీఎంఎఫ్, ఎస్ఎంఫ్ నిధులు ఏర్పాటు చేశామని వివరిం చారు. పెద్ద పిల్లల చదువులకోసం విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాలు చేపట్టామని, సిలబస్‌లో మార్పులు, ఆన్‌లైన్ వర్టికల్స్, జాబ్ ఓరియెంటెడ్‌గా పాఠ్యప్రణాళికలు తీసుకు వచ్చామన్నారు. పెళ్లి చేసుకుంటున్న ఇద్దరు పిల్లలు కూడా కచ్చితంగా పదోతరగతి పాసై ఉండాలన్న నిబంధన తీసుకు వస్తున్నామని, దీనివల్ల కచ్చితంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పదోతరగతి చదివిస్తారన్నారు. వైఎస్సార్ కల్యాణ మస్తు ద్వారా మంచి జరుగుతుందని, ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా మంచి జరిగే పరిస్థితి ఉంటుందని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వంలోనూ పెళ్లికానుక అని పథకాన్ని ప్రకటించి, 2018లో దాన్ని ఆపేశారని, అప్పట్లో ఎవ్వరూ కూడా పిల్లలు చదవాలని తాపత్రయపడి పెట్టిన పథకం కాదన్నారు. ఎన్నికలకు ఎలా ఉపయోగించుకోవాలన్న ఆలోచనతో పెట్టారని విమర్శిం చారు. ఈ పథకానికి పూర్తిగా ఎగనామం పెట్టారని, 17,709 మంది లబ్ధిదారులకు రూ.68.68కోట్లు వివాహ ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఎగ్గొట్టారని వివరించారు. గత ప్రభుత్వం ప్రకటించిన దానికన్నా.. ఇప్పుడు దాదాపుగా రెట్టింపు ప్రోత్సాహకం ఈ పథకం ద్వారా అందబోతోందన్నారు. ఈ పథకం నేటి నుంచి అమల్లోకి రానున్నదనీ, పెళ్లయిన 60 రోజుల్లో వారి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు అని చెప్పారు. వలంటీర్ల సహాయ సహకారాలు తీసుకుని దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. అర్హులైన వారికి ప్రతి మూడు నెలలకోసారి ఈ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. మ్యారేజ్ సర్టిఫికెట్‌నూ సచివాలయాల్లో జారీచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి జయలక్ష్మీ, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ సంచాలకులు ఎస్ఎస్ మోహన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

నరసింహారెడ్డిని గెలిపించుకుందాం

ఎస్‌టీయూ నేతలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: సుదీర్ఘ ఉద్యమ నేపథ్యం, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న కత్తి నరసింహారెడ్డిని తిరిగి ఎంఎల్‌సీగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి చెప్పారు. కడపలోని వీవీఆర్ ఎస్‌టీయూ భవన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో రఘునాథరెడ్డి శుక్రవారం మాట్లాడుతూ ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఫ్యాప్టో చైర్మన్‌గా, జేఏసీ కో-చైర్మన్‌గా పనిచేసిన విశేష అనుభవంతో పాటు నిత్యం విద్యాక్షేత్రం లోనే జీవితాన్ని గడిపే కత్తి నరసింహారెడ్డిని ఉపాధ్యాయులు మరోమారు ఆదరించాలన్నారు. కత్తి నరసింహారెడ్డి ఆమరణ నిరాహారదీక్ష ఫలితంగానే నాడు అమలులో ఉన్న అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేశారని గుర్తుచేశారు. ఎయిడెడ్, మునిసిపాలిటీ, మోడల్ స్కూళ్లు, గురుకులాలు, జూనియర్-డిగ్రీ కాలేజీలు, పాలిటెక్నిక్ కాలేజీలు, యూనివర్సిటీలలో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్లు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కత్తి నరసింహారెడ్డి శాసనమండలి లోపలా, బయటా కృషి చేశారన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో సహాయ, సహకారాలు కావాలంటే స్థానిక ఎస్‌టీయూ నాయకులను సంప్రదించాలన్నారు. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల ఎస్‌టీయూ నాయకులు బాలగంగిరెడ్డి, రమణారెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, సంగమేశ్వరరెడ్డి, నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ రంగాన్ని కాపాడాలి

- రేపు గాంధీ విగ్రహాల ఎదుట నిరసన
- ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భవన నిర్మాణ రంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ, అక్టోబర్ 2న గాంధీ విగ్రహాల వద్ద రాష్ట్రవ్యాప్తంగా నల్ల జెండాలతో నిరసన చేపట్టనున్నామని ఏపీ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్ల యూనియన్ (ఏఐటీయూసీ) పేర్కొంది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, కార్మికుల భవిష్యత్తు కోసం అనేక పోరాటాలు చేసి సంక్షేమ బోర్డు చట్టాన్ని సాధించుకున్నామన్నారు. ఫలితంగా ఆ బోర్డు ద్వారా అనేక సౌకర్యాలను కార్మికులు పొందుతూ ఉండే వారనీ, మూడున్నరేళ్లలో జగన్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఉపయోగ పడే ఏ ఒక్క పనీ చేయలేదన్నారు. సంక్షేమ బోర్డులో ఉన్న కార్మికులు వేల కోట్ల రూపాయలు నిధుల్ని పక్కదారి మళ్లించి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. ఇసుక కొరత వల్ల కరోనా కాలంలో పనులు లేక అల్లాడుతున్న కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నవించినా స్పందన లేదనీ పేర్కొన్నారు. చట్టాలు, కోర్టు తీర్పులు కార్మికులకు అనుకూలంగా ఉన్నప్పటికీ వాటిని కాలరాస్తోందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం-1996 పేరు చెప్పి నేటికీ యజమానుల నుంచి సెస్, సంక్షేమ సభ్యుడి పేరు మీద అక్రమ వసూళ్లకు పాల్పడుతోందన్నారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం పోరాటం తప్ప, వేరే మార్గం లేదని పేర్కొన్నారు.

596వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న దీక్షలు 596వ రోజుకు చేరుకున్నాయి. ఎఫ్ఎండి, ఈఆన్ అండ్ ఎండి, ఎస్ఎస్‌డి, ప్లాంట్ డిజైన్, విభాగం కార్మికులు ఈ దీక్షలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, గంధం వెంకట్రావు, కారు రమణ, గుమ్మడి నరేంద్ర, దాసరి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసే వరకు వివిధ రకాలుగా ఉద్యమాలు జరుగుతాయన్నారు. దీనిలో భాగంగా అక్టోబర్ రెండో తేదీన విశాఖ సముద్రతీరంలో పార్క్ హోటల్ నుండి రామకృష్ణ బీచ్ వరకు ఉక్కు సత్యాగ్రహ పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో నగరంలో ఉన్న వివిధ పరిశ్రమల కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, విద్యార్థి, యువజనసంఘాలు, మహిళాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. విశాఖ నగరానికి ఉక్కు కర్మాగారం తలమానికమని విశాఖ నగర అభివృద్ధికి స్టీల్ ప్లాంట్ ప్రధాన కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ వెంకట్రావు, వరసాల బాలకృష్ణ, డి.మధు, పిసి, దొర, వి.రాజేశ్వరరావు, డి.రమణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆహార భద్రత

- చురుగ్గా ప్రభుత్వ కార్యక్రమాలు
- చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాతీయ ఆహార భద్రత చట్టం-2013 ప్రకారం అర్హులైన అందరికీ ఆహార భద్రత కల్పించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ చురుకుగా పనిచేస్తోందని చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. విజయవాడ అశోక్‌నగర్‌లోని ఆహార కమిషన్ కార్యాలయంలో శు క్రవారం జాతీయ ఆహార భద్రత చట్టం-2013 పరిధిలోని సంక్షేమ పథకాలకు చెందిన సమాచారాన్ని ప్రజలు, అధికారులకు అవగాహన నిమిత్తం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, తాను ఈ ఏడాది మార్చి 28న బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటివరకూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 15 జిల్లాల్లో 273 క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టామని, మరో 11 జిల్లాల్లో డిసెంబర్ నాటికి పూర్తిచేస్తామని వివరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, మహిళ, శిశు అభివృద్ధి సంస్థ ద్వారా లభించే ప్రయోజనాలు, మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థుల వసతులు, ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం(పీఎంఎంవీవై) పథకాల ద్వారా ఆహార భద్రత చట్టం-2013 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు వివిధ ఆహార పథకాల ద్వారా అందిస్తున్న లబ్ధిపై ఆరా తీస్తున్నామన్నారు. ఈ సంక్షేమ పథకాలకు సంబం ధించి ఎలాంటి ఫిర్యాదులున్నా వాట్సాప్ నంబరు-9490551117కి గానీ, టోల్ ఫ్రీ నంబరు 155235 కి గానీ ఫిర్యాదు చేస్తే, తక్షణమే చర్యలు తీసుకుంటామ న్నారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమంతో చిన్న పిల్లలు చాలా ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. ఏడు జిల్లాల్లో ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తున్నారని, కొంత మంది అవగాహనాలోపంతో ప్లాస్టిక్ రైస్ కలుపుతున్నారని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ పి. సురేష్, అకౌంట్స్ ఆఫీసర్ కేవీఎస్ శర్మ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.వాణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఎస్‌లో చెరకు గానుగ నిలిపివేత

- సంకిలి ఈఐడీకి బాధ్యతల అప్పగింత
- కమిషనర్ వెంకటరావు ఉత్తర్వులు

విశాలాంధ్ర-సీతానగరం/పార్వతీపురం: మన్యం జిల్లా లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారంలో 2022-2023 క్రషింగ్ సీజన్‌లో చెరకు గానుగని నిలిపివేస్తూ రాష్ట్ర డైరెక్టర్, చెరకు కమిషనర్ వి. వెంకటరావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. దీని బాధ్యతను పక్క జిల్లాలో గల సంకిలి ఈఐడీ(ప్యారీ)కీ అప్పగించారు. గతేడాది ఇక్కడ చెరకు క్రషింగును నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ కర్మాగారంపై గతనెల 25న విశాలాంధ్ర దినపత్రికలో 'భీమసింగి, లచ్చయ్యపేటలో క్రషింగ్ కష్టమే-సంకిలికి అప్పగింత' అని ముందుగా ప్రచురించిన సంగతి తెలిసిందే. కర్మాగారంలో రైతులు, కార్మికులపై యాజమాన్యం దోపిడీ, ఎన్‌సీఎల్‌టీ సంస్థ గురించి...క్రషింగ్ విధానం, రైతుల కష్టాలు, కార్మికుల బకాయిలు, విద్యుత్ బకాయిలు, చెరకుసాగు విస్తీర్ణం, పక్కనే గల సంకిలి ప్యారీ కర్మాగారానికి అప్పగింత తదితర అంశాలపై విశాలాంధ్ర సవివరంగా ఇంతకుముందు ప్రచురించింది. కర్మాగారంలో ఎన్‌సీఎస్ యాజమాన్యం 2019-20, 2020-21 గానుగ సీజన్‌లో చెరకు రైతులకు రూ.3.74కోట్ల బకాయిలు ఉండటంతో పాటు జులై 22న యాజమాన్యంతో అమరావతిలో రాష్ట్ర చెరకు డైరెక్టర్ నిర్వహించిన సమావేశంలో ఆగస్టు 31లోగా ఈ ఏడాది గానుగ వేయాలంటే 10 కోట్ల రూపాయలు ముందుగా డిపాజిట్ చేయాలని షరతులు పెట్టినా ఇంతవరకు దాన్ని యాజమాన్యం అమలు చేయలేదు. దీంతో పాటు సెప్టెంబరు 19న కూడా మరోసారి ఎన్‌సీఎస్ యాజమాన్యంతో, సంకిలి ఈఐడీ(ప్యారీ)తో, ఎన్‌సీఎల్‌టీ (చెన్నై) అధికారులతో అమరావతిలో కమిషనర్ సమావేశం నిర్వహించారు. షరతుల అంగీకారానికి ఎన్‌సీఎస్ యాజమాన్యంతోపాటు ఎన్‌సీఎల్‌టీ అధికారులు సెప్టెంబరు 30లోగా స్పందించకపోవడంతో శ్రీకాకుళం జిల్లాలోని సంకిలిలోగల ఈఐడీ(ప్యారీ)లో 2022-23 సీజన్‌లో గానుగ వేయడానికి అనుమతిస్తూ కమిషనర్ వెంకటరావు ఉత్తర్వులు జారీచేశారు. చెరకు గానుగకు అన్నివిధాలుగా యాజమాన్యం ప్యారీకి సహకారం అందించాలని, ఎన్‌సీఎస్ పరిధిలో కొనుగోలు కేంద్రాల ద్వారా చెరకు సరఫరా చేయాలని సూచించారు.

అబార్షన్ హక్కులపై

సుప్రీం తీర్పు హర్షణీయం

ఏపీ మహిళా సమాఖ్య

విశాలాంధ్ర-విజయవాడ: అబార్షన్ హక్కులపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు వీ జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పెన్మత్స దుర్గాభవాని తెలిపారు. సమాఖ్య కార్యాలయం దాసరి భవనంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ... గర్భం ఉంచుకోవాలా, పిల్లల్ని కనాలా వద్దా అనేది స్త్రీల హక్కుల్లో అంతర్భాగం అన్నారు. శరీరంపై మహిళకు సంపూర్ణ హక్కు ఉండాలని కోర్టు తీర్పు తేటతెల్లం చేసిందని చెప్పారు. అవసరం లేని అవాంఛిత గర్భాలను తొలగించు కోవడానికి ఈ తీర్పు ఒక ముందడుగు అవుతుందని తెలిపారు. వివాహ బంధంలో కూడా బలవంతపు లైంగిక చర్యను అత్యాచారం గానే పరిగణిస్తూ తీర్పులో పేర్కొ నటం జరిగిందన్నారు. లైంగిక విద్య, గర్భ నిరోధక సాధనాల యెడల సరైన అవగాహన, గర్భ స్రావం పొందే హక్కులు స్త్రీలకు కల్పించడం రాజ్యాంగంలో ఆర్టికల్ 21 లో భాగమని పేర్కొనడం శుభ పరిణామం అన్నారు. దేశంలో వైద్య పర్యవేక్షణ లేని అబార్షన్‌ల వల్ల మరణాలు సంభవిస్తున్నా యని, 2002నుంచి 2011 వరకు జరిగిన అబార్షన్‌లలో 67 శాతం ఇటువంటివేనని దుర్గాభవాని వివరించారు.

వినియోగదారు ధరల సూచిక సంఖ్య ఖరారు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కనీస వేతనాల చట్టం కింద వినియోగదారు ధరల సూచిక సంఖ్యను ఖరారు చేశారు. ఈ మేరకు కార్మిక శాఖ ప్రత్యేక కమిషనర్ కార్తికేయ మిశ్రా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కనీస వేతనాల చట్టం 1948 ప్రకారం వివిధ షెడ్యూల్డు ఉద్యోగాలలో పనిచేసే ఉద్యోగుల డియర్నెస్ అలవెన్స్‌ను అక్టోబరు 1వ తేదీ నుంచి మార్చి 31, 2023 వరకు గణించే నిమిత్తం సగటు వినియోగదారు ధరల సూచిక సంఖ్యలను ప్రకటించారు. 2022 జూన్‌తో మొదటి అర్ధ సంవత్సరం ముగిసే నాటికి పార్టు-1 క్రింద పారిశ్రామిక కార్మికులకు సగటు వినియోగదారు ధరల సూచిక సంఖ్యలను 1614 పాయింట్లుగా (బేస్ ఇయర్ 1982 100 సిరీస్)పార్టు-2 కింద వ్యవసాయ కార్మికులకు 1260 పాయింట్లుగా (బేస్ ఇయర్ 1986-100 సిరీస్) ఖరారు చేశారు.

సలహాదారు పదవికి మురళి రాజీనామా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాఠశాల విద్యాశాఖలో మౌలిక సదుపాయాల సలహాదారు ఎ.మురళీ తన పదవికి రాజీనామా చేశారు. తెలంగాణలో విద్య, వైద్యం పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, అక్కడ విద్య బలోపేతం కోసం ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం జగన్‌కు ఆయన లేఖ రాశారు. మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వంలో పాఠశాల విద్యాశాఖ సలహాదారునిగా పనిచేయడం గొప్ప అనుభూతి అని పేర్కొన్నారు. సొంత రాష్ట్రమైన తెలంగాణలో విద్య, వైద్యం పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని విమర్శించారు. ఇక నుంచి తన సేవలు తెలంగాణలో విద్యాభివృద్ధికి అందిస్తానని తెలిపారు.

లౌకిక ప్రజాస్వామ్యవాది జైపాల్‌రెడ్డి

సీపీఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి

విశాలాంధ్ర-అమనగల్లు: కేంద్ర మాజీమంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ దివంగత జైపాల్‌రెడ్డి... లౌకిక ప్రజాస్వామ్యవాది అని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కొనియాడారు. జైపాల్ రెడ్డి స్వగ్రామం రంగారెడ్డి జిల్లా మాడ్గులలో ఏర్పాటు చేసిన జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని శుక్రవారం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాషణ్ రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తదితరులతో కలిసి ఏచూరి ఆవిష్కరించారు. అనంతరం పీసీసీ కార్యదర్శి రాం రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ... జైపాల్ రెడ్డి మంచి ప్రజాస్వామ్య విలువలు ఉన్న వ్యక్తి అన్నారు. ప్రస్తుత రాజకీయాలలో ఆ విలువలు దిగజారి పోతున్నాయని, ప్రజాస్వామ్యం దాడికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులంటే నిత్యం ప్రజలకు సేవ చేసే వారిగా ఉండాలని జైపాల్ రెడ్డి చెబుతుండేవారన్నారు. అవకాశవాద రాజకీయాలకు దూరంగా, సిద్ధాం తాలకు కట్టుబడి రాజకీయాలకు వన్నె తెచ్చిన మహోన్నీయుడు జైపాల్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. మారు మూల గ్రామం నుండి ఢిల్లీ దాకా ఎదిగిన గొప్ప రాజకీయ నేత, అజాత శత్రువు, అందరి వాడైన జైపాల్ రెడ్డి జీవితాన్ని నేటి రాజకీయ నాయకులు, యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగినపుడే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని ఏచూరి చెప్పారు. సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ... జైపాల్ రెడ్డి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగితే ప్రజాస్వామ్యం నాలుగు కాలాల పాటు కొనసాగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో జైపాల్ పాత్ర మరువలేనిదని కొనియాడారు. నూతన పార్లమెంటు భవన ప్రాం గణంలో జైపాల్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తా నని చెప్పారు. అంతకుముందు సభలో ప్రజాప్రతి నిధులు, నాయకులు మాట్లాడుతూ... కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ సృష్టికర్త జైపాల్ రెడ్డి విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయాలని, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు జైపాల్ రెడ్డి పేరు పెట్టాలని కోరారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథం , నాగర్ కర్నూల్ ఎంపీ రాములు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎంపీలు అజీజ్ పాషా, మల్లు రవి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, అనేకమంది ప్రజాప్రతినిధులు, నాయకులు దివంగత జైపాల్ రెడ్డి సతీమణి లక్ష్మమ్మ, కుమారులు అరవింద్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.

టెట్ ఫలితాల్లో ప్రతిభ విద్యార్థిని భవానీ టాప్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత (ఏపీ టెట్)-2022 ఫలితాల్లో విజయవాడ ప్రతిభ కోచింగ్ సెంటరుకు చెందిన విద్యార్థిని కేవీడీ భవానీ (హాల్ టిక్కెట్ నంబరు-టెట్ 22248880) 145/150 మార్కులతో అత్యంత ప్రతిభ చూపారు. ఏపీ టెట్ ఫలితాలను ఈనెల 29వ తేదీ రాత్రి పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ ఫలితాల్లో విజయవాడ ప్రతిభ కోచింగ్ సెంటరుకు చెందిన విద్యార్థులు రాణించారు. ఇదే కోచింగ్ సెంటరుకు చెందిన మాధవికి 144 మార్కులు, విజయ 143 మార్కులు కైవసం చేసుకున్నారు. 140కిపైగా మరో 8 మంది, 130కిపైగా 12 మంది, 120కిపైగా 40 మంది అభ్యర్థులు మార్కులు సాధించారని ప్రతిభ కోచింగ్ సెంటరు జంపాన సుధాకర్ వివరించారు. ఈ మేరకు శు క్రవారం ప్రతిభ కోచింగ్ సెంటరు ఆవరణలో అభ్యర్థులకు అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో బయలాజికల్ సైన్స్ అధ్యాపకులు పెన్నింటి బాలకృష్ణ, అర్థశాస్త్రం అధ్యాపకులు ధరణి శ్రీనివాస్, మేథ్స్ అధ్యాపకులు రాంబాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి

- ఇద్దరు కుమార్తెలతో తల్లి ఆత్మహత్యాయత్నం
- క్షేమంగా బయటపడిన పెద్ద కుమార్తె



విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: భర్త, అత్తింటి వారి వేధింపులు భరించలేక ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విశాఖలో అందరినీ కలచివేసింది. నగరంలోని ఎంవీపీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కృష్ణా కాలేజ్ సమీపంలో ఈ ఘటన జరిగింది. అత్తంటి వేధింపులకు తల్లీకూతురు బలయ్యారు. ఇద్దరు కుమార్తెలతో కలిసి తల్లి శైలజ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా, తల్లి శైలజ, చిన్న కూతురు అక్షిత(1) మృతి చెందగా, పెద్ద కుమార్తె తుషిత (4) క్షేమంగా బయటపడింది. భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్టు బంధువులు ఆరోపించారు. తన చావుకు భర్త, అత్తింటి వేధింపులే కారణమని శైలజ సూసైడ్ నోట్ రాసింది. తన కూతురు, మనవరాలి చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తల్లి చిన్నారి ఆత్మహత్యకు కారణమైన భర్త, అత్తింటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కబ్జాలు తప్ప ఏం చేశారు? జీవీఎల్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వైసీపీ ప్రభుత్వం పై బీజేపీ నేత, ఎంపీ జీవీఎల్ నరసింహారావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. శు క్రవారం ఆయన విశాఖ పట్నంలో మీడియాతో మాట్లాడారు. విశాఖ అభివృద్ధిని కేంద్రం అడ్డుకుంటోందన్న బొత్స వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని జీవీఎల్ అన్నారు. విశాఖ అభివృద్ధికి ఏం చేశారో మంత్రి చెప్పాలని సవాల్ చేశారు. భూ కబ్జాలు తప్ప మీరేం చేశారంటూ మండిపడ్డారు. రుషికొండ రిసార్ట్స్ రహస్యమేంటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల భూములు నిషేధిత జాబితాలో పెట్టి అమ్మకాలు జరగకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలన్నారు. టూరిస్టు కేంద్రమైన విశాఖలో టూరిజం పడుకుందని, రుషికొండ రిసార్టు రహస్యం ఏమిటి? అక్కడ ఏం కడుతున్నారని ప్రశ్నించారు. ప్రజల భూములు ఎందుకు నిషేధిత జాబితాలో పెట్టి అమ్మకాలు జరగకుండా అడ్డుకుంటున్నారని, 30 వార్డులో దండు బజార్ ప్రాంతంలో నలభై ఏళ్లుగా ఉంటున్న బడుగు, బలహీన వర్గాల వారికి వక్ఫ్ పేరిట అనుమతులు నిరాకరిస్తున్నారని మండిపడ్డారు. నివాసం ఉంటున్న వారికి తక్షణమే అక్కడ పట్టాలిచ్చి ఇల్లు నిర్మించాలని, వక్ఫ్ బోర్డు కు మరొకచోట భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 30 వేల మందిది ఇదే సమస్య ఉన్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ఈ అంశాలపై తక్షణం సమీక్ష నిర్వహించి పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. కేంద్రం చేస్తున్న అభివృద్ధి తప్ప మీరు చేసేది ఏమిటో బొత్స, జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ముఖ్య మంత్రి లక్షలాది ఇళ్లు ఇస్తామంటున్నారని, కానీ ఇప్పటికే కట్టిన ఇళ్లు ఎందుకు అప్పగించరని, నాడు బాబూ, ఇప్పుడు మీరు కూడా పేదలకు ఇళ్లను చూపి ఆడుకుంటున్నారన్నారు. ఏపీలో వైసీపీ, టీడీపీ మధ్య బూతుల పోరు నడుస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి కనీసం బాధ్యత ఉంటే తాను చెప్పే అంశాలపై సమీక్ష నిర్వహించి సాధారణ ప్రజలకు న్యాయం చేయాలని జీవీఎల్ కోరారు. దసపల్లా భూకుంభకోణం రూ.2 వేల కోట్లు కాదని, రూ.4 వేల కోట్లని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు అన్నారు. ఈసీ వద్దని చెప్పినా ఓటర్ల నమోదులో గ్రామ వలంటీర్లు పాల్గొంటున్నారని తెలిపారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. రైల్వే జోన్ విషయంలో బీజేపీ అన్యాయం చేస్తోందని పిచ్చి కూతలు కూస్తున్నారని మండిపడ్డారు. కొన్ని మీడియా సంస్థలు కూడా అసత్య ప్రచారం చేస్తున్నాయని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. త్వరలోనే రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేస్తామని విష్ణుకుమార్ రాజు స్పష్టం చేశారు.

సంపాదకీయం

కాంగ్రెస్ అధిష్ఠానం తడబాటు

రెండు దశాబ్దాల తరవాత కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి జరుగుతున్న ఎన్నికలలో కనీస ప్రజాస్వామ్య ఛాయలు కనిపించడానికి కాంగ్రెస్ అధిష్ఠానం నానా యాతన పడవలసి వచ్చింది. ఎన్నికలు నిర్వహిస్తారని తెలిసిన వెంటనే సీనియర్ నాయకుడు శశీ థరూర్ రంగంలోకి దిగారు. సోనియా గాంధీ ఆయనను పోటీ చేయకూడదని చెప్పకపోయినా అధిష్ఠానం అభ్యర్థిని ఎంపిక చేసే పనిలో నిమగ్నమై పోయారు. అయినా శశీ థరూర్ పోటీ చేయాలన్న సంకల్పానికే కట్టుబడి ఉన్నారు. చివరకు నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి ఆఖరి రోజైన శుక్రవారం సీనియర్ నాయకుడు మల్లికార్జున ఖర్గేను అధిష్ఠానం అభ్యర్థిగా నిర్ణయించారు. రాష్ట్రపతి ఎన్నికలలో ప్రతిపక్షాలు అభ్యర్థిని నిలబెట్టాలనుకున్నప్పుడూ నాలుగో అభ్యర్థి అయిన మాజీ బీజేపీ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి యశ్వంత్ సిన్హాపై పోటీ చేసే భారం పడింది. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి కూడా అధిష్ఠానం తరపు అభ్యర్థిగా పోటీ చేస్తున్న మల్లికార్జున్ ఖర్గే మూడవ వారు. ఈ ఎన్నికలలో తాము తటస్థంగా ఉంటామని సోనియా గాంధీ చెప్పినప్పటికీ అధికారికంగా పోటీ చేసే అభ్యర్థిని ఎంపిక చేయడంలో అధిష్ఠానం నిర్ణాయక పాత్రనే పోషించింది. కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి సోనియా గాంధీ కుటుంబం తరఫున ఎవరూ పోటీ చేయకూడదు అని నిర్ణయించుకున్న తరవాత రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్‌ను అభ్యర్థిగా నిర్ణయించారు. కానీ ఆయన రాజస్థాన్ ముఖ్యమంత్రిగా కూడా కొనసాగాలనుకున్నారు. అక్కడితో కథ ఆగలేదు. సచిన్ పైలెట్‌ను ఎక్కడ ముఖ్య మంత్రిని చేస్తారోనని భయపడ్డ గెహ్లోత్ మద్దతుదార్లు అయిన 92 మంది శాసనసభ్యులు రాజీనామా చేయడానికి సిద్ధపడడమే కాక స్పీకర్‌కు రాజీనామా పత్రాలు అందించారు. వాటిని ఆమోదించలేదు కానీ ఇది రాజస్థాన్ కాంగ్రెస్ శిబిరంలో సంక్షోభానికి దారి తీసింది. చివరకు ముఖ్యమంత్రి గెహ్లోత్ దిల్లీ వెళ్లి సోనియా గాంధీని కలుసుకుని క్షమాపణ చెప్పవలసి వచ్చింది. తాను అధ్యక్ష స్థానానికి పోటీ చేయను అని కూడా ఆయన ప్రకటించవలసి వచ్చింది. ఇప్పుడు ఆయనను ముఖ్యమంత్రిగా కొనసాగిస్తారో లేదో కూడా అనుమానమే. గెహ్లోత్ రంగం నుంచి నిష్క్రమించిన తరవాత మరో సీనియర్, తల పండిన కాంగ్రెస్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ పోటీకి సిద్ధమయ్యారు. గురువారం ఆయన పది సెట్ల నామినేషన్ పత్రాలు పట్టుకెళ్లారు. ఏ కారణం చేతో ఆయనకు అధిష్ఠానం ఆశీస్సులు లభించినట్టు లేదు. అధిష్ఠానం మల్లికార్జున్ ఖర్గే వేపు మొగ్గుతున్నట్టు గ్రహించి ఆయనా పోటీ చేయాలన్న సంకల్పం విరమించుకున్నారు. మల్లికార్జున్ ఖర్గే కర్నాటకకు చెందిన నాయకుడైనప్పటికీ హిందీ ధారాళంగా మాట్లాడగలరు. ఆయన ఎన్నికైతే స్వాతంత్ర్యం తరవాత కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి చేరుకున్న దక్షిణాది నాయకులలో ఆరవ వారు అవుతారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య, నీలం సంజీవ రెడ్డి, కామరాజ్ నాడార్, ఎస్. నిజలింగప్ప, పీవీ నరసింహారావు కాంగ్రెస్ అధ్యక్షులయ్యారు. ఖర్గే సౌమ్యుడు, అనుభవజ్ఞుడు. అన్నింటికీ మించి దళితుడు. ఆయన ఇందిరాగాంధీ ఆధిపత్యానికి ముప్పు ఎదురైన 1969లో కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రవేశించారు. 1972లో మొదటి సారి శాసనసభకు పోటీ చేశారు. ఎనిమిది సార్లు గెలుస్తూనే వచ్చారు. 1980 నుంచి 1992 దాకా కర్నాటకలో కాంగ్రెస్ మంత్రివర్గంలో ఉన్నారు. 1996 నుంచి 99 వరకు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. 2005 నుంచి 2008 దాకా కర్నాటక కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆ తరవాత ఆయన లోకసభకు పోటీ చేస్తూ వచ్చారు. 2019లోనే మొట్ట మొదటి సారి ఓటమి పాలయ్యారు. మూడు సార్లు ఖర్గేకు ముఖ్యమంత్రి పదవి చేజారిపోయింది. ఆయన 2014 నుంచి 2019 దాకా లోకసభలో కాంగ్రెస్ పక్ష నాయకుడిగా ఉన్నారు. ఆ తరవాత ప్రస్తుతం రాజ్యసభలో కాంగ్రెస్ పక్ష నాయకుడిగా కొనసాగుతున్నారు. ఖర్గే సౌమ్యుడే కాక మర్యాదస్థుడు, మృదు స్వభావి. ఇంతవరకు ఆయన మీద వివాదాలూ తలెత్తలేదు.

సంస్థాగతంగా ప్రజాస్వామ్య విధానాలను అనుసరించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావించడం అభినందనీయమే. కానీ అధిష్ఠానం అభ్యర్థిని పోటీకి నిలపడం, అధిష్ఠానం ఆశీస్సులు లేనందువల్ల దిగ్విజయ సింగ్ పోటీ నుంచి విరమించడం ప్రజాస్వామ్య పద్ధతి అనిపించుకోదు. సోనీయా గాంధీని కలుసుకున్న తరవాత రాజస్థాన్ ముఖ్యమంత్రి గెహ్లోత్ "మేం శాసనసభా పక్ష సమావేశంలో కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేయడానికి ఏక వాక్య తీర్మానం ఆమోదింప చేయలేకపోయాం. నేను ముఖ్యమంత్రిని, శాసనసభా పక్షం నాయకుడిని కనక ఏకవాక్య తీర్మానం ఆమోదింప చేయలేకపోవడం నా వైఫల్యమే" అని గెహ్లోత్ విచారం వ్యక్తం చేశారు. ఆ విషయమే ఆయన సోనియాకు విన్నవించారట. ఇలా ఏకవాక్య తీర్మానం ఆమోదించడం అంటే ముఖ్యమంత్రి ఎవరో నిర్ణయించవలసిన బాధ్యతను కాంగ్రెస్ అధిష్ఠానానికి అప్పగించడం. ప్రజాస్వామ్య పద్ధతి ప్రకారం అయితే శాసనసభా పక్షం తమ నాయకుడిని ఎన్నుకోవాలి. ఆ నాయకుడినే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని గవర్నర్ ఆహ్వానించడం రివాజు. కానీ ఇందిరా గాంధీ హయాం నుంచి శాసనసభా పక్ష నేతను ఏ రాష్ట్రంలోనైనా అధిష్ఠానమే నిర్ణయిస్తోంది. దీనికే సీల్డ్ కవర్ రాజకీయాలు అన్న ముద్దు పేరు ఉంది. సచిన్ పైలెట్‌ను ముఖ్యమంత్రిగా నియమించడాన్ని అడ్డుకోవడానికి 92 మంది శాసనసభ్యులు రాజీనామాలకు సిద్ధ పడడం ఇప్పుడు అమలవుతున్న ముఖ్యమంత్రి ఎంపిక పద్ధతి ప్రకారం చాలా అసహజంగా కనిపించ వచ్చు. కానీ అది మెజారిటీ సభ్యుల ఆకాంక్ష. పైలెట్‌ను అడ్డుకోవడంలో రాజకీయాలు ఉండొచ్చు. గ్రూపు రాజకీయాలు కాంగ్రెస్‌లో కొత్తేమీ కాదు. ఇక్కడ సచిన్ పైలెట్ యోగ్యతాయోగ్యతల చర్చ అనవసరం. ఆయనను ముఖ్యమంత్రిగా ఎంపిక చేయనివ్వకుండా జరిగిన వ్యవహారంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో గెహ్లోత్ ప్రమేయం కూడా ఉండొచ్చు. ఏమైనా ఇది ఫక్తు ముఠా రాజకీయం తప్ప ప్రజాస్వామ్య విధానం అయితే కాదు. కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తారని తేలిపోయిన తరవాత శశీ థరూర్ పోటీ పడాలనుకున్నారు. అది ఆయన ప్రజాస్వామ్య హక్కు 23 మంది సభ్యులతో కూడిన బృందం కాంగ్రెస్‌లో సంస్థాగతంగా సంస్కరణలు జరగాలని కోరుతూ లేఖ రాసిన వారిలో శశీ థరూర్ కూడా ఉన్నారు. శశీ థరూరు ఆ 23 మందితో కూడిన బృందం తరఫున పోటీ చేయడం లేదు. తటస్థంగా ఉంటానని చెప్పిన సోనియా గాంధీ అధిష్ఠానం తరఫున ఒక అభ్యర్థిని రంగంలోకి దింపడంతో శశీ థరూర్‌కు ప్రమేయం లేదు. ఖర్గే లేదా శశీ థరూర్ ఈ ఇద్దరిలో ఎవరు గెలిచినా వారు ప్రస్తుతం ప్రత్యర్థులు కావచ్చు కానీ శత్రువులు కానక్కర్లేదు. అంతర్గత ప్రజాస్వామ్య సారం ఇదే. ఈ మొత్తం వ్యవహారంలో కాంగ్రెస్ అధిష్ఠానం తడబడిన మాట వాస్తవం.

మరోసారి కడుపు చించుకోవడం గురించి...

చక్రవాకం - ముక్కాము చక్రధర్

తెలతెలవారుతోంది. రాత్రి ఆలస్యంగా పడుకున్న సముద్రాల సూర్యారావు ఫోన్ ఒకటే మోగుతోంది. ఫోన్ తీయాలని ఉన్నా రాత్రి బాగా పొద్దు పోయాక పడుకున్న సూర్యారావుకి ఫోన్ తీయాలంటే చాలా బద్ధకంగా ఉంది. ఒకటి రెండుసార్లు ఫోన్ ఎవరు చేసారో కూడా చూడకుండానే సైలెంట్ మోడ్‌లో పెట్టేశాడు. అయినా ఇంకా పదే పదే మోగుతూండడంతో "బావే చేసాడేమో... ఇంత పొద్దున్నే మనకి ఇంకెవరు చేస్తారు. మంచి బేరమే తగిలి ఉండొచ్చు" అని మనసులో అనుకుని బద్ధకంగానే ఫోన్ తీసి "హలో" అన్నాడు నిద్ర గొంతుతో సూర్యారావు. "బావా నేను. ఫోన్ తీయవేం. అర్జంటుగా లేచి బయలుదేరు" అన్నాడు అవతలి వ్యక్తి. "ఇంత పొద్దున్నే ఏమిటి బావా. గిరాకీ తగిలిందా" అన్నాడు సూర్యారావు. "అవును. గిరాకే. పొద్దున్నే దొరికాడు. రాత్రి తెలిసిందిలే. పొద్దున్నే నేను వచ్చేశాను. నువ్వు రావడమే ఆలస్యం. మళ్లీ బండి కదిలిపోతుంది" అన్నాడు. అలా సూర్యారావుకు ఫోన్ చేసింది పూడికుడి సుబ్రహ్మణ్యం. వీళ్లిద్దరూ చాలా మంచి స్నేహితులు. ఇద్దరూ జర్నలిస్టులు. వీళ్లు పని చేస్తున్నామని చెబుతున్న "మంగళ సూత్రం", "మరి నాకేంటి" పత్రికలు వస్తున్నాయో... రావడం లేదో నర మానవుడికి తెలియదు. కాని వీళ్లిద్దరు మాత్రం అన్యాయం ఎక్కడ జరిగినా సహించరు. దాన్ని అడ్డుకునేందుకు చాలా ప్రయత్నాలు చేస్తారు. అడ్డుకోవడం కష్టం అని తేలిపోయాక ఈ లోకాన్ని మనిద్దరం మాత్రం ఏం మార్చగలంలే అని లోలోపల తీర్మానించుకుని సదరు అన్యాయం చేస్తున్నాడని భావించిన వ్యక్తితో సర్లేండి లోకమే ఇలా అన్యాయాల పుట్టలా మారింది. మీరు మాత్రం ఏం చేస్తారు. మేం ఇద్దరం మీ ఫొటోలు తీసి, ఆ అక్రమం గురించి రాస్తే ఆగిపోతుందా ఈ దారుణం. అందుకని ఓ పని చేయండి తృణమో, పణమో మా చేతుల్లో పెట్టి జాగ్రత్తగా మీ పనులు కానిచ్చుకోండి అని చాలా విశాల హృదయాన్ని చూపిస్తారు.

ఇంతకీ ఆ అక్రమాలు ఎలాంటివంటే పేదలకు అందాల్సిన బియ్యం దొడ్డిదారిన ఆటోల్లోనూ, చిన్న చిన్న వాహనాల్లోనూ తరలిపోయేవి. నిబంధనలకు విరుద్ధంగా, పర్యావరణాన్ని నాశనం చేసే చెరువుల తవ్వకాలు, ఇలాంటివే చీకట్లో జరిగే చీకటి పనులు. వాటిని ప్రపంచానికి తెలియజేయాల్సిన బాధ్యత జర్నలిస్టులది. కాని ఇలాంటి అక్రమాలను బయటపెట్టినా... ఆగేవి కాదనే సూక్ష్మం తెలిసినవారు నేడున్న జర్నలిస్టులు. పైన చెప్పిన ఇద్దరు అలాంటి జర్నలిస్టు లోకానికి ప్రతినిధులు. మెడలో మంగళసూత్రం వేసుకున్న పునిస్త్రీలా వీళ్లు తమ చేతుల్లో సెల్‌ఫోన్‌లు ఆన్ చేసుకుని ఉంటారు. మట్టితో నిండిన ట్రాక్టరో, బియ్యంతో నిండిన ఆటోనో, సగం తవ్విన చెరువులో, కొబ్బరి తోట్లో తమ మానాన తాము పేకాడుకుంటున్న వారో, హోల్‌సేల్‌గా మద్యం తెచ్చుకుని గుట్టుగా ఇంట్లో పెట్టుకుని చుట్టుపక్కల వారికి విక్రయిస్తున్న వారో కనిపించారా... ఇక ఈ టైపు జర్నలిస్టులకు అన్యాయం, అక్రమం, దారుణం, చేతులు కట్టుకున్న అధికారులు, పట్టించుకోని పోలీసులు వంటి హెడ్డింగులు గుర్తొస్తాయి. అప్పుడు వారి కళ్లలో దేశాన్ని ఎంత నాశనం చేస్తున్నారో అనే మాటలు స్ఫురణకు వస్తాయి.

మెరుగైన సమాజం కోసం అంటూ పని చేస్తున్న జర్నలిస్టులు కొందరుంటారు. వారు ఈ కోవకు కొంచెం అతీతులు. అంటే ఎక్కడైనా ఏదైనా జరిగిందని, కొంపలంటుకుపోయాయి అని కనీస పరిజ్ఞానం కూడా లేని వారు అందించిన ఉప్పుని నిప్పుగా రాజేస్తారు. అలా రాజేసే ముందు ఎవరి మీద నింద వేస్తున్నారో... వారెవరో... సమాజంలో వారికున్న గౌరవ ప్రతిష్టలు, గుర్తింపు ఇవేవీ పట్టించుకోరు. క్షణ క్షణం సమాజం పాడై పోతోందని, దాన్ని బాగు చేసే బాధ్యత తమదే అని మెరుగైన సమాజం కోసం శుభ్రంగా ఉన్న సమాజాన్ని పాడు చేస్తారన్నమాట. ఓ డాక్టర్ చేయని తప్పుని వీరు మహా ఘోరంగా నిరూపించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తారు. ఓ వ్యాపారి మీద అకారణపు కక్షని పెంచుకుని వారి నైతికత మీద కొడతారు. మరో రాజకీయ నాయకుడు వారిని ఆహ్వానించలేదనో, మరో చిన్న సాకుని చూపి అతని క్యారెక్టర్‌ని చంపేందుకు ప్రయత్నిస్తారు. ఇది కూడా మెరుగైన సమాజం కోసం వారు చేస్తున్న కృషిగా భావించాలి.

ఇదంతా మరోసారి కడుపు చించుకోవడం. కాళ్ల మీద పడిందని నిట్టూర్చడం. అవునూ... యుట్రిస్ అంటే గర్భసంచీయే కదా.... డాక్టర్లే కాదు అందరూ అవుననే అంటారు. మెరుగైన సమాజం కోరుకునే వారు మాత్రం యుట్రిస్ అంటే అర్థం మార్చేసి డాక్టర్ల జీవితాలతో ఆడుకుంటారు....

వ్యాస రచయిత సెల్ 912019929

క్యూబాలో సోషలిస్టు విలువలకు పట్టం

బెన్ బర్గిస్

క్యూబా తాజాగా కుటుంబ కోడ్‌ను ఆమోదించటం ద్వారా సోషలిస్టు విలువలకు పట్టం కట్టింది. కోడ్ పైన అనేక మిలియన్ల మంది తమ అభిప్రాయాలను తెలిపారు. మూడింట రెండు శాతం ఓటర్లు ఆమోదించగా కోడ్‌కు సాధికారత లభించింది. అలాగే దంపతులైన మహిళలు, పురుషులకు కుటుంబపరంగా సమాన హక్కులు, సమాన బాధ్యతలను కోడ్ కల్పిస్తుంది. ఈ అంశంపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో అర్హులైన ఓటర్లలో మూడు వంతుల మంది పాల్గొన్నారు, తద్వారా వచ్చిన ఫలితాన్ని వివిధ అంశాలను వ్యతిరేకించే చర్చి సైతం తప్పు పట్టలేదు. కేథలిక్, ఇవలాంజికల్ చర్చిలు మొదట కఠినంగా ఉన్నప్పటికీ మూడు వంతుల పౌరులు ఆమోదించడంతో అంగీకరించాయి. గతంలో గే ల హక్కుల పట్ల విముఖత ఉండేది. ప్రజాస్వామ్య సోషలిస్టు దృక్పథం కలిగిన ప్రభుత్వం విమర్శలను అనుమతిస్తుంది. అయితే అమెరికా లాంటి సామ్రాజ్య భావజాలంతో నిండి ఉన్న దేశాలు, సోషలిస్టు దేశాల్లో నియంతృత్వ పోకడలుంటాయని విమర్శించడం తెలుసు. దశాబ్దాలుగా క్యూబాను ఆక్రమించాలని, టెర్రరిజాన్ని ప్రోత్సహించడం క్రూరమైన ఆర్థిక ఆంక్షలను అమెరికా విధిస్తోన్న విషయం ప్రపంచానికి తెలుసు.

ఆరోగ్య భద్రత, విద్య తదితర రంగాలలో ఉత్తమ సేవలను అందిస్తూ, ప్రపంచంలోనే ముందంజలో క్యూబా నిలిచింది. దీర్ఘకాలంలో వివిధ దేశాలకు క్యూబా నిపుణులైన డాక్టర్ల బృందాలను, సిబ్బందిని పంపించి విలువైన సేవలు అందిస్తోంది. కోవిడ్-19 మహమ్మారి నియంత్రణ కోసం సొంతంగా వాక్సిన్ తయారుచేసి దేశ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయడమేగాక ఇతర దేశాలకు సైతం సరఫరా చేసి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన విషయం తెలిసిందే. ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో మలేరియా తదితర వ్యాధులకు చికిత్సను అందించడంలో క్యూబా ముందుంది. ఏ దేశం వైద్య సహాయం అడిగినా క్యూబా తిరస్కరించకుండా అందించి సోషలిస్టు వ్యవస్థ విశిష్టతను నిరూపించంది. సోషలిస్టు ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ వ్యతిరేకతను అనుమతించడం క్యూబా సోషలిస్టు పాలనలో ఉంది. కోడ్‌పై అనుకూలత, వ్యతిరేకతను పౌరులు తెలియజేశారు. స్వేచ్ఛగా మూడు వంతుల పౌరులు ఆమోదించడం ప్రజాస్వామ్యానికి గీటురాయి. కొందరు అసమ్మతివాదులు కోడ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ ఎన్నికల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఓడించడానికి ఇది మంచి అవకాశమని భావించారని బిబిసి తెలియజేసింది. దేశంలో తప్ప ఇంధన కొరత వల్ల ప్రజలు విసిగిపోయారని కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా ఓటు వేస్తారని మత భావజాలం గల ప్రతిపక్షం ఆశించిందని కూడా బిబిసి పేర్కొంది. వివాహం స్త్రీ పురుషుల మధ్యే ఉండాలని, తల్లిదండ్రులను కలిగి ఉండటం పిల్లల హక్కు అని కేథలిక్ బిషప్‌లు కొందరు వాదించారు. గే ల మధ్య వివాదమనేది కోడ్‌లో ఉన్నప్పటికీ స్త్రీ, పురుషుల మధ్యే అత్యధిక వివాహాలు జరుగుతాయి కదా అని కొందరు విశ్లేషకులు వ్యాఖ్యానించారు. గే లు కుటుంబాలు ఏర్పాటు చేసుకొని పిల్లలను దత్తత చేసుకొనే అవకాశం కోడ్ కల్పిస్తుంది. సంతోషంగా జీవించడానికి అందరికీ హక్కు ఉంటుందని, అందుకు కావలసిన స్వేచ్ఛ కూడా ఉండాలని 1859 లో లిబర్టి (స్వేచ్ఛ) పైన రాసిన పుస్తకంలో సుప్రసిద్ధ రచయిత జాన్ స్టువర్ట్‌మిల్ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో సోషలిస్టు వ్యవస్థ అందరికీ సమాజిక, భౌతిక జీవన అవకాశాలనివ్వడంలో భిన్న అభిప్రాయాలు రావచ్చు. సమ సమాజ నిర్మాణానికి అంకితమైనప్పుడు సోషలిస్టు రాజకీయాల్లో నిర్ణయాత్మక భావనకు పునాది వేయడం కష్టం కావచ్చునని కెనడా మార్క్సిస్టు తత్వవేత్త జిఎకొహెన్ తాను రచించిన 'వై నాట్ సోషలిజం' లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని విలువలకు అనుకూలమైన అభిప్రాయాన్ని కోడ్‌కు అనుకూలంగా ఓటు వేసి ప్రజలు వ్యక్తం చేశారు.

ఆరోగ్య భద్రత, విద్య తదితర రంగాలలో ఉత్తమ సేవలను అందిస్తూ, ప్రపంచంలోనే ముందంజలో క్యూబా నిలిచింది. దీర్ఘ కాలంలో వివిధ దేశాలకు క్యూబా నిపుణులైన డాక్టర్ల బృందాలను, సిబ్బందిని పంపించి విలువైన సేవలు అందిస్తోంది. కోవిడ్-19 మహమ్మారి నియంత్రణ కోసం సొంతంగా వాక్సిన్ తయారుచేసి దేశ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయడమేగాక ఇతర దేశాలకు సైతం సరఫరా చేసి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన విషయం తెలిసిందే. ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో మలేరియా తదితర వ్యాధులకు చికిత్సను అందించడంలో క్యూబా ముందుంది. ఏ దేశం వైద్య సహాయం అడిగినా క్యూబా తిరస్కరించకుండా అందించి సోషలిస్టు వ్యవస్థ విశిష్టతను నిరూపించంది. సోషలిస్టు ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ వ్యతిరేకతను అనుమతించడం క్యూబా సోషలిస్టు పాలనలో ఉంది. కోడ్‌పై అను కూలత, వ్యతిరేకతను పౌరులు తెలియజేశారు. స్వేచ్ఛగా మూడు వంతుల పౌరులు ఆమోదించడం ప్రజా స్వామ్యానికి గీటురాయి.

నేతాజీ చూస్తున్నారా? నేటి నీచ రాజకీయం!!

డా. ప్రేమ్ సింగ్

అసలు స్వాతంత్రోద్యమంలోనే పాల్గొనని బీజేపీ అసలైన దేశభక్తులం తామేనని తెగ నటించేస్తోంది. ఈ విషయాన్ని ప్రజల బుర్రల్లోకి ఎక్కించేందుకు పడరాని పాట్లు పాడుతోంది, పుంఖానుపుంఖాలుగా అబద్ధాలు చెబుతోంది. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ప్రముఖ నాయకులందరికి సంబంధించిన విషయాల మీద బురద చల్లే ప్రయత్నం చేస్తోంది. ఇందుకోసం ఏకంగా చరిత్రనే వక్రీకరిస్తున్న ఈ పార్టీ ఇంకేమైనా చేయగలదు కదా! ఇప్పుడు దేశంలో అదే జరుగుతోంది. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా! పెద్ద తలకాయల బాటలోనే ఇతర నాయకులూ నడుస్తున్నారు, ఆసువుగా అబద్ధాలు చెప్పేస్తున్నారు. నిజానిజాలేమిటో విశదీకరించి చెప్పేవారు లేకపోతే ఈ దేశ చరిత్ర మొత్తాన్ని వారు కళంకపరుస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు.

గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని నెత్తికెత్తుకున్న కాంగ్రెస్ పార్టీ నేతాజీ విలువను తగ్గించిందని ఆయన కుమార్తె అనితా బోస్ పాఫ్ ప్రధానమంత్రికి రాసిన లేఖలో ఆరోపించారట! ఈ పచ్చి అబద్ధాన్ని ఒక టీవీ ఛానల్ చర్చలో బీజేపీ ప్రతినిధి, వ్యాఖ్యాత చెప్పారు. దేశ స్వేచ్ఛ కోసం పోరాటానికి అజాద్ హింద్ ఫౌజ్ (ఐఎన్ఎ) ను ఏర్పాటు చేయడం ద్వారా నేతాజీ హింసా మార్గాన్ని ఎంచుకున్నందునే ఇలాంటి పరిస్థితి వచ్చిందని ఆమె లేఖలో రాసినట్లుగా పేర్కొన్నారు. హింసా మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం సాధించగలమని గట్టిగా చెప్పేందుకు 1946 బోంబే రాయల్ నావల్ తిరుగుబాటును ప్రస్తావించారు. కానీ, నేతాజీ కుమార్తె రాసిన లేఖను నేను చదివాను. అందులో అలాంటి ఆరోపణలు ఏమీ లేవు. అధికార మత్తులో ఘోరమైన అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు.

తన తండ్రి శిథిల అవశేషాలను జపాన్ నుండి భారతదేశానికి తిరిగి తీసుకురావాలని అనితా బోస్ ఇంతకుముందు కూడా ప్రధానమంత్రులను కోరారు. ఏ లేఖలోనూ ఆమె గాంధీ అహింసా పోరాటం వల్ల స్వాతంత్రోద్యమంలో తన తండ్రి పాత్రను తక్కువ చేయడం గురించి రాయలేదు. ఆమె ఎప్పుడు మాట్లాడినా నేతాజీ ఏర్పాటు చేసిన అజాద్ హింద్ ఫౌజ్‌తో సహా ఎన్నో సంస్థలు, ఎంతోమంది నాయకుల కృషి ఫలితంగానే భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతారు. అనితా బోస్ ఆర్థిక శాస్త్రంలో ప్రొఫెసర్. ఆమె గొప్ప మేధావి, రాజకీయ నాయకురాలు అనడానికి ఆమె ప్రకటనలే నిదర్శనం. జర్మనీ సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకురాలు కూడా అయిన అనితా బోస్ తన తండ్రి సోషలిస్టు భావాలతోనూ ప్రభావితమయ్యారు. ఆమె ప్రకటనలను వక్రీకరించే, తప్పుగా చూపించే భారతీయ జర్నలిస్టులకు కొదవ లేదు.

టోక్యోలోని రెంకోజి దేవాలయం నుండి తన తండ్రి అవశేషాలను భారత దేశానికి తీసుకురావాలని భారత్, జపాన్ నాయకులను ఆమె ఎప్పటికప్పుడు కోరుతూనే ఉన్నారు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖలో ఆమె ఈ విషయాన్ని ప్రస్తావించారు. దేశ రాజధాని దిల్లీలోని చరిత్రాత్మక ఇండియా గేట్ వద్ద నేతాజీ విగ్రహం ఏర్పాటు చేయడంపై కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ లేఖలో ఆమె ఎవరి మీదా ఎలాంటి ఆరోపణలూ చేయలేదు. భారతదేశానికి నేతాజీ అవశేషాలను తీసుకొచ్చేందుకు సహకరించాలని ప్రధానికి లేఖ రాయడానికి ముందు ఆమె ప్రతిపక్ష నాయకులు, పౌరులను కూడా ఆమె కోరారు. నేతాజీ మరణంపై నెలకొన్న ఊహాగానాలకు తెర దించేందుకు భద్రపరిచి ఉంచిన ఆయన బూడిదను డిఎన్ఎ పరీక్షకు పంపించాలని కూడా ఆమె కోరారు. నిజానికి 1945 ఆగస్టు 18వ తేదీన జరిగిన విమాన ప్రమాదంలో నేతాజీ మరణించినట్లుగా స్పష్టమైన ఆధారాలు ఉన్నందున ఆమె డిఎన్ఎ పరీక్షను కోరాల్సిన అవసరం లేదు. నేతాజీకి ఆస్ట్రియాలో ఉన్న భార్య ఎమిలీ షెంకెల్‌కు పుట్టిన బిడ్డే అనితా బోస్ పాఫ్. ఆమె వియన్నాలో జన్మించారు. ఆమె వయస్సు ఇప్పుడు 80. నేతాజీ చనిపోయినప్పుడు ఆమె వయస్సు మూడేళ్ళు. తన తండ్రి అవశేషాలపై ఆసక్తి, ప్రీతి ఉండడం సహజమే.

నేతాజీ అజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేయడం, బ్రిటిష్ ప్రభుత్వంపై సాయుధ మిలటరీ పోరాటం సాగించడం భారత స్వాతంత్రోద్యమంలో ఒక చిన్న భాగమే కావచ్చు. కానీ, నేతాజీది గొప్ప వ్యక్తిత్వం. ఇప్పుడు ఆర్ఎస్ఎస్, బీజేపీలు ఆయన ప్రతిష్ఠను మసకబార్చే ప్రయత్నం చేస్తున్నాయి. ఆయన పాత్రను అజాద్ హింద్ ఫౌజ్‌కే పరిమితం చేయడం ద్వారా ఆయనను హిందూ-మిలటరిస్టుగా చూపించాలనుకుంటున్నాయి. అంటే ఇక్కడ ఆర్ఎస్ఎస్/బీజేపీకి కావల్సింది హింసను ప్రేమించే 'హిందూ' నేతాజీ. ముస్లింల మద్దతును కూడగట్టుకునే విషయం మినహా మహాత్మాగాంధీతో బోస్ పెద్దగా విభేదించిందేమీ లేదని వి.డి.సావర్కర్ కూడా చెప్పారు. ఇక్కడ ప్రశ్నేమంటే దేశ స్వాతంత్ర్యం కోసం అజాద్ హింద్ ఫౌజ్ ద్వారా ఆయన పోరాడడం పూర్తిగా హింస కిందకు వస్తుందా? గాంధీ అహింసకు ఈ హింస సమాధానమా? అజాద్ హింద్ ఫౌజ్‌ని ఏర్పాటు చేసేటప్పుడు గానీ లేదా తర్వాత గానీ నేతాజీ ఇలాంటి ప్రకటన ఏమైనా చేశారా? నేతాజీ ఆర్మీ హిందూ ఆర్మీనా? వాస్తవాలు ఇలా లేవు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కేవలం సావర్కర్ చిత్రపటాన్ని ఉంచడంతోనే ఆర్ఎస్ఎస్/బీజేపీలు సంతృప్తిపడడం లేదు. గాంధీ అహింసపై సావర్కర్ హింసను ఘనంగా చూపించాలనేది వారి ఉద్దేశం. బూజు పట్టిన ఈ బుర్రలతోనే సావర్కర్ బ్రిటిష్ వారిని క్షమాపణలు కోరడంలోనూ, శత్రువులను చంపేందుకు యువతలో పరాక్రమాన్ని నింపేందుకు బ్రిటిష్ ఆర్మీలోకి భారతీయుల నియామకాల్లోనూ దేశభక్తిని చూస్తున్నారు. తద్వారా సావర్కర్ హింసకు తగిన ప్రాధాన్యతనివ్వాలనేది వారి ఉద్దేశం. ఆర్ఎస్ఎస్, బీజేపీ ఇప్పుడు ఆ పనిలోనే ఉన్నాయి.

హింస-అహింస ప్రశ్నలు భారత స్వాతంత్రోద్యమంలో 1857 నుండే తలెత్తాయి. 1857 తిరుగుబాటు అణచివేత సమయంలో, ఆ తర్వాత జరిగిన ఘోరమైన భయోత్పాత హింస ప్రభావం భారతీయ సమాజంపై మరో నాలుగు దశాబ్దాలు పడింది. పూనే జిల్లా మెజిస్ట్రేట్ వాల్టర్ చార్లెస్ రాండ్, అతని అసిస్టెంట ఓయెస్టర్ 1897, జూన్ 22వ తేదీన చాపేకర్ సోదరుల్లో పెద్దవాడైన దామోదర్ హరి చాపేకర్ కాల్చి చంపడంతో భారత స్వాతంత్రోద్యమంలో సాయుధ విప్లవోద్యమం ప్రారంభమైంది.

విప్లవోద్యమం సాగుతుండగానే హింస-అహింసల చర్చ కొత్త మలుపు తీసుకుంది. అహింసా సిద్ధాంతాన్ని తీసుకురావడం ద్వారా గాంధీ ఈ చర్చను నూతన దిశ వైపు మళ్ళించారు. గాంధీ అహింసా సిద్ధాంతానికి వ్యతిరేకంగా విప్లవకారులు 'బాంబు సిద్ధాంతాన్ని' ముందుకు తెచ్చారు. తమ సిద్ధాంతంపై విప్లవకారులకు స్పష్టత ఉంది. అయితే విప్లవోద్యమంలో హింస.. అబద్ధాలు, మోసం, కుట్రతో కూడిన హింసా సిద్ధాంతంలో సంబంధం లేనిది. విప్లవకారుల ధైర్యాన్ని, శౌర్యాన్ని గాంధీ కూడా ప్రశంసించారు. సరైన అహింసా మార్గంలోనే నడవాలని వారికి సలహానిచ్చారు. అహింస పిరికివారి ఆయుధం కారాదని కూడా ఆయన అన్నారు. మానవ జీవితంలోని గొప్ప లక్ష్యాలను అబద్ధాలు, హింస, కుట్రతో సాధించలేమని సావర్కర్‌ను ఒప్పించేందుకూ గాంధీ ప్రయత్నించారు. సావర్కర్, ఆయన అనుచరులుగా ఉన్న కొంతమంది యువతతో లండన్‌లోని ఇండియా హౌస్‌లో మాట్లాడిన గాంధీ... స్వాతంత్రంతో పాటుగా మానవత్వమనే గొప్ప లక్ష్యాన్ని భారత్ సాధించాల్సిన అవసరం ఉందనే నిర్ణయానికి వచ్చారు. లండన్ నుండి తిరిగొచ్చేటప్పుడు నౌకలో 'హింద్ స్వరాజ్' (భారత్ స్వయం పాలన) అనే ఆలోచనకు వచ్చారు.

1924లో సావర్కర్ జైలు నుండి విడుదలైనప్పుడు విప్లవోద్యమం ఒక కొత్త సిద్ధాంత దశకు చేరింది. భగత్ సింగ్, ఆయన కామ్రేడ్లు 1924లో హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ (హెచ్ఎస్ఆర్ఎ)ను ఏర్పాటు చేయగా 1926లో భారత్ నవజవాన్ సభ ఏర్పడింది. 1929లో ఈ భారత్ నవ జవాన్ సభ లాహోర్ సమావేశానికి నేతాజీ అధ్యక్షత వహించారు. సావర్కర్ హింసకు విప్లవకారుల హింసకు ఏ మాత్రం సంబంధం లేదు. భారత స్వాతంత్రోద్యమాన్ని వ్యతిరేకించడం, వలస శక్తులకు మద్దతునివ్వడమే అతని సహజ మార్గం. ఆ దారిలోనే అతను నడిచాడు. తుదివరకూ బ్రిటిష్ వారికి తొత్తుగానే వ్యవహరించాడు. స్వాతంత్ర్యానంతరం కూడా అతని 'కీర్తి' గాంధీ హత్య కేసుతో ముడిపడి ఉంది. 1966 వరకు జీవించి ఉన్న సావర్కర్ దేశం కోసం, సమాజం కోసం చేసిన మంచి పని ఒక్కటంటే ఒక్కటీ లేదు. సావర్కర్ క్షమాపణల వెనక నక్కిన కుహనా దేశభక్తిని గొప్పగా చెబుతున్నవారికి అసలు విప్లవోద్యమం గురించి లేదా భారత ప్రజల ప్రత్యక్ష ఉద్యమం గురించి తెలుసా? బ్రిటిష్ ఆర్మీలో భారతీయుల నియామకాన్ని సావర్కర్ కోణంలో చూస్తున్నవారికి బ్రిటిష్ ఆర్మీలో భారతీయులను అధికారులుగా తీసుకోలేదనే విషయం తెలీదా? దేశంలో అయినా, విదేశాల్లో అయినా మన సైనికులను వారు బలిపశువులనే చేశారు.

నేతాజీని తమదైన కోణంలో హింస 'ఉచ్చు'లోకి లాగేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు, వాటి పర్యవసానాలను అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. స్వాతంత్రోద్యమ చరిత్రలో నేతాజీకి గొప్ప పేరు ఉంది. ప్రజల్లో ఆయనకు గొప్ప కీర్తి ఉంది. భారత్‌లో గాంధీ తర్వాత అంత గొప్ప ప్రజా దరణ ఉన్న వ్యక్తి నేతాజీ అని కొంత మంది చెబుతారు. నేతాజీని తమదైన హింస కోణంలో చూపిస్తే తర్వాత ఇదే మాదిరిగా సావర్కర్ హింస కోణంలోకి భగత్ సింగ్, ఇతర 'హిందూ' విప్లవకారులనూ లాగడం సులువవు తుందని ఆర్ఎస్ఎస్, బీజేపీ భావిస్తున్నాయి. కానీ ఇది ఇంతటితో ఆగదు. గాంధీ, ఆయన అహింసా సిద్ధాంతాన్ని అగౌరవపర్చడం, దేశం పిరికిగా తయారవడానికి ఇదే కారణమని చూపించడమే ఆర్ఎస్ఎస్, బీజేపీ అసలు ఉద్దేశం. గాంధీ అహింసా సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్, బీజేపీలు 1857 తిరుగుబాటును చూపించలేవు. కారణం మెజారిటీవాదంతో మత రాజకీయాలు నడుపుతున్న వలసవాదులకు వ్యతిరేకంగా తలెత్తిన ప్రథమ స్వాతంత్ర్య పోరాటం హిందూ-ముస్లింల ఐక్యతతో జరిగింది.

బానిసత్వం, పిరికితనంతో స్వాతంత్రోద్యమంలో పాల్గొనని సంస్థల్లో ఆర్ఎస్ఎస్ కూడా ఉంది. ఈ వాస్తవాన్ని కప్పిపెట్టేందుకే ప్రధానమంత్రి మోదీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతకర్తలు నేతాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేటప్పుడు.. వలసవాద భావజాలం నుండి వారు దేశానికి విముక్తి కల్పించారని పదేపదే చెప్పారు. రాజకీయ అధికారంతో వ్యాప్తి చేస్తున్న ఇలాంటి భ్రమలు ఏదో ఒక రోజు తేలిపోతాయని వారు తెలుసుకోవడం లేదు. ఇలాంటి చర్యల ద్వారా స్వాతంత్రోద్యమ వాస్తవ స్ఫూర్తిని వారు వక్రీకరిస్తున్నారు. స్వార్థ, నీచ రాజకీయాల్లోకి లాగడం ద్వారా జాతీయ నాయకులను, జీవితాలను పణంగా పెట్టి పోరాడిన స్వాతంత్ర్య సమర యోధులను అవమానిస్తున్నారు. మ్యాజిక్కులు, జిమ్మిక్కులతో తమ బానిసత్వ భావజాలం, పిరికితనాన్ని కప్పిపెడుతున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ, వారి మద్దతుదారులు ఈ ధోరణిని మార్చుకోవాలి.

వ్యాస రచయిత సోషలిస్టు ఉద్యమకారుడు
దిల్లీ యూనివర్సిటీ మాజీ అధ్యాపకుడు

దుర్గా పూజ కళాకారులకు నిరాశే!

- బడ్జెట్ కోతలు... పెరిగిన ముడిసరుకు ఖర్చులు
- ఆర్డర్లు అంతంతమాత్రమే...
- కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేని దుస్థితి
- తమ బతుకు దుర్భరమేనంటూ ఆవేదన

గువహటి : దసరా వేళ దుర్గా విగ్రహ కళాకారుల పరిస్థితి దయనీయంగా మారింది. కోవిడ్-19 మహమ్మారి రెండేళ్ల తర్వాత ఈ ఏడాది ఉత్సవాలు తమ జీవనోపాధికి కొంతమేర ఊపిరి పోస్తాయని విగ్రహ తయారీ కళాకారులు భావించినప్పటికీ పరిస్థితి నిరాశజనకంగానే ఉంది. ఇక్కడి పాండు ప్రాంతంలోని తన వర్క్‌షాప్‌లో 67 ఏళ్ల చేతివృత్తిదారుడు తపస్ పాల్ మట్టిని అచ్చువేసేటప్పుడు... అతని చేతులు అత్యంత అద్భుతంగా కదులుతాయి. అయితే రెండేళ్ల కోవిడ్-19 సంక్షోభం తర్వాత బడ్జెట్‌లో కోతలు ఈ విగ్రహాలను తయారు చేసేవారిని నిరాశకు గురిచేశాయి. అనేక మంది నిర్వాహకులు తమ వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు ముడిసరుకుల ధరలు పెరగడం, కూలీల కొరత కారణంగా ఈ సంవత్సరం కూడా వ్యాపారం పుంజుకోకపోవచ్చని పాల్ ఆందోళన చెందుతున్నాడు. 'మహమ్మారి ప్రేరేపిత లాక్‌డౌన్ కారణంగా మేము గత రెండేళ్లలో చాలా కష్టాలను ఎదుర్కొన్నాము. గత సంవత్సరం చిన్న దుర్గా విగ్రహాల కారణంగా ఆదాయాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేసింది' అని పాల్ పీటీఐకి చెప్పారు. 'ముడి పదార్థాలయిన మట్టి, ఎండుగడ్డి, కలప, దుస్తులు, ఆభరణాల ధరలు కూడా మహమ్మారి తర్వాత విపరీతంగా పెరిగాయి. అయితే నిర్వాహక కమిటీలు ఎక్కువ చెల్లించడానికి సిద్ధంగా లేవు' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని పశ్చిమ ప్రాంతంలోని కుమ్మరుల కాలనీలోని కళాకారులు దుర్గామాత, ఆమె పరివారం విగ్రహాలను సమయానికి రూపొందించి, వివిధ పండాలకు పంపాలని ఇప్పటికీ అర్ధరాత్రి నూనెను కాల్చుతూనే ఉన్నారు. కొంతమంది నిర్వాహకులు చాలా ఆలస్యంగా ఆర్డర్లు ఇచ్చారు. 'మేము చివరి నిమిషంలో కొనుగోళ్లు చేయవలసి వచ్చింది. ఇది మా లాభాలను కూడా తగ్గించింది' అని పాల్ 37 ఏళ్ల కుమారుడు కంచన్ చెప్పారు. తండ్రీకొడుకులు ఈ సంవత్సరం 19 ఆర్డర్‌లను అందుకున్నారు. మహమ్మారి ముందు రోజులలో వారు సాధారణంగా చేసిన దానికంటే తక్కువ 'కరిగార్లు' (విగ్రహ తయారీ కళాకారులు) నిమగ్నమయ్యారు. 'మా సంపాదన గురించి మాకు కచ్చితంగా తెలియనప్పుడు కార్మికులకు వారి వేతనాలు ఎలా చెల్లించాలి? ముడిసరుకు ఖర్చులు, వేతనాలు చెల్లించిన తర్వాత, మాకు దాదాపు ఏమీ లేకుండా పోతుంది' అని 67 ఏళ్ల విగ్రహ తయారీదారు చెప్పారు. ఇంతకుముందు, కొన్ని ప్రత్యేకమైన విగ్రహాలు ఒక్కొక్కటి రూ.1 లక్ష వరకు పొందేవి. కానీ ఈ సంవత్సరం రూ.50 వేల పరిధిలో ఏదైనా లభిస్తే మేము అదృష్టవంతులమే' అని సీనియర్ పాల్ చెప్పారు. గత నెలలో కురిసిన అడపాదడపా వర్షాలు మా కష్టాలను మరింత పెంచాయని ఆయన చెప్పారు. పక్కనే ఉన్న వర్క్‌షాప్‌లో నగరంలోని ఏకైక మహిళా విగ్రహాల తయారీదారు 32 ఏళ్ల దీపికా పాల్, దేవత చేతులను చెక్కడం, ఇతర బొమ్మలపై పని చేస్తున్న నలుగురు కూలీలపై పర్యవేక్షణలో బిజీగా కనిపించింది. 'సాంప్రదాయకంగా, కుటుంబంలోని మహిళా సభ్యులు విగ్రహాల తయారీలో నిమగ్నమై ఉండరు. కానీ నా తండ్రి చనిపోయిన తర్వాత, నా తల్లి, సోదరీమణులకు మద్దతు ఇవ్వడానికి నేను దానిని చేపట్టవలసి వచ్చింది' అని ఆమె చెప్పింది. దీపిక తన తండ్రి ద్వారా కళలో శిక్షణ పొందలేదు. కానీ ఆమె భర్త దిలీప్ దాస్‌తో సహా ఇతర కళాకారుల నుంచి నేర్చుకుంది. అతనితో కలిసి ఆమె వర్క్‌షాప్ నిర్వహిస్తుంది. 'నేను నా కుటుంబం నుంచి ఎటువంటి వ్యతిరేకతను ఎదుర్కోలేదు. కానీ పొరుగువారి నుంచి చులకన వ్యాఖ్యలను భరించవలసి వచ్చింది. జీవనోపాధికి ఇదే ఏకైక మార్గం అని నాకు తెలుసు కాబట్టి నేను వాటిని పెద్దగా పట్టించుకోలేదు' అని ఆమె చెప్పింది. 'లాక్‌డౌన్ సమయంలో ఎటువంటి పని లేదు. చాలా మంది 'కరిగర్లు' (కళాకారులు) ప్రత్యామ్నాయ ఆదాయ వనరులను కనుగొనవలసి వచ్చింది. కొంతమంది కూరగాయల అమ్మకానికి కూడా వెళ్లారు' దీపిక తెలిపారు.

74వ సంవత్సరంలో జరుగుతున్న అతిపెద్ద రెస్ట్ క్యాంప్ కలిబారి పూజలో శిల్పులు విగ్రహాలకు తుది మెరుగులు దిద్దడంలో బిజీగా ఉన్నారు. 75వ వార్షికోత్సవం సందర్భంగా వచ్చే ఏడాది ఘనంగా వేడుకలు నిర్వహించాలని భావిస్తున్నందున ఈ ఏడాది మా బడ్జెట్ తక్కువగా ఉంది' అని నిర్వాహక కమిటీ సభ్యుడు తపస్ సహా తెలిపారు. ఇక శాంతిపూర్ పూజా కమిటీ అయితే సుదీర్ఘమైన కోవిడ్ ప్రశాంతత తర్వాత 'ప్రజల మానసిక స్థితిని మెరుగుపరిచేందుకు' ప్రయత్నిస్తున్నందున ఒక మినహాయింపు ఇస్తోందని తెలిపింది. ఈ కమిటీ బెంగాల్ నుంచి కళాకారులను రప్పించి పండల్ ఏర్పాటు చేసింది.

దేశాభివృద్ధిపై చిన్నచూపు: ధన్కర్

న్యూఢిల్లీ: భారతదేశ అభివృద్ధి కథలను పంచుకోవడానికి కొంతమంది బాధపడుతున్నారని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ వ్యాఖ్యానించారు. భారత్ సాధించిన విజయాలను వారు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారి భావజాలాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ధన్కర్ చెప్పారు. వందేళ్ల క్రితం భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో స్వదేశీ ఉద్యమాన్ని ప్రతిబింబించేలా ఆత్మనిర్భర్ భారత్‌ను ఇప్పుడు అమలు చేస్తున్నామని ఉపరాష్ట్రపతి తెలిపారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ అమలు చేస్తున్న స్వయం సమృద్ధి భిన్నమైనదని అన్నారు. పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ కార్యక్రమంలో శుక్రవారం ఆయన ప్రసంగించారు. ఇతర దేశాలు చెప్పిన దానికన్నా భారత్ చాలా భిన్నమైదని ధన్కర్ చెప్పారు. 1947కు ముందు ఇలాంటి పరిస్థితి దేశంలో ఏనాడు కనిపించలేదని వ్యాఖ్యానించారు. భారతదేశం ఇప్పుడు ఎంతో అభివృద్ధి సాధించిందని, దీని కొంతమంది చూడలేకపోతున్నారని ఆయన అన్నారు. కేవలం రంధ్రాన్వేషణకే వారు పరిమితమవుతున్నారని చెప్పారు. పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా, పాలనపరంగా మనం ముందంజలో ఉన్నామని తెలిపారు. గతం కన్నా భారత్ చాలా అభివృద్ధి చెందిన వాస్తవాన్ని వ్యతిరేకులు అంగీకరించలేకపోతున్నారన్నారు.

గాలి జనార్దనరెడ్డి అభ్యర్థనపై 10న నిర్ణయం: సుప్రీం

న్యూఢిల్లీ: తన సొంతూరు బళ్లారి వెళ్లడానికి అనుమతించాలని కోరుతూ మాజీమంత్రి గాలి జనార్దనరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై అక్టోబరు 10వ తేదీన సుప్రీంకోర్టు తన నిర్ణయం వెల్లడించనున్నది. తన కుమార్తె ఓ బిడ్డకు జన్మనిచ్చిందని, ఆమె బళ్లారిలో ఉందని, అక్కడ నాలుగు వారాలు ఉండేందుకు అనుమతించాలని జనార్దనరెడ్డి సుప్రీంకోర్టును అభ్యర్థించారు. కోట్లాది రూపాయల అక్రమ మైనింగ్ కేసులో గాలి జనార్దనరెడ్డి నిందితుడు. ఈ కేసులో ఆయన 2015 నుంచి అనేక షరతులతో బెయిల్‌పై ఉన్నారు. ప్రత్యేకించి కర్ణాటకలోని బళ్లారి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కడప వెళ్లరాదని సుప్రీం షరతు విధించింది. గాలి జనార్దనరెడ్డి కుమార్తె బెంగళూరు ఆసుపత్రిలో బిడ్డకు జన్మనిచ్చిందని, ఇప్పుడామె బళ్లారిలో ఉంటుందని సుప్రీంకోర్టుకు సీబీఐ నివేదించింది. గాలి జనార్దనరెడ్డి పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ కృష్ణ మురారితో కూడిన ధర్మాసనం..దీనిపై విచారణ జరిపి శుక్రవారం నివేదిక ఇవ్వాలని సీబీఐని ఆదేశించింది. బెంగళూరులో బిడ్డకు జన్మనిచ్చిన జనార్దనరెడ్డి కుమార్తె ప్రస్తుతం సొంతూరు బళ్లారిలో ఉన్నారని ఆయన తరపు న్యాయవాది మీనాక్షి అరోరా కోర్టుకు విన్నవించారు.

నవరాత్రి సందర్భంగా...ఆడపిల్ల పుడితే వెండి నాణెం

చంద్రపూర్: నవరాత్రుల సందర్భంగా జన్మించిన ఆడ శిశువుల తల్లిదండ్రులకు మహారాష్ట్రలోని చంద్రపూర్ నగరంలో వెండి నాణేలను బహుమతిగా ఇవ్వనున్నట్లు ఓ అధికారి శుక్రవారం తెలిపారు. చంద్రపూర్ ఎమ్మెల్యే కిశోర్ జోర్గేవార్ విలేకరులతో మాట్లాడుతూ.. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పుట్టిన ఆడపిల్లల తల్లిదండ్రులకు పండుగ సందర్భంగా శ్రీ మహంకాళి మాత సేవా సమితి వెండి నాణేలను బహుమతిగా అందజేస్తుందని తెలిపారు. ఉత్సవాల్లో తల్లిదండ్రులు నవజాత శిశువుల జనన ధృవీకరణ పత్రాలతో తమ పేర్లను మహంకాళి ఆలయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సమితి కన్వీనర్ జోర్గేవార్ తెలిపారు. కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించే లక్ష్యంతో చంద్రపూర్‌లో నాలుగు రోజుల పాటు మహంకాళి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాన్ని రాష్ట్ర మంత్రి సంజయ్ రాథోడ్ అక్టోబర్ 1న ప్రారంభిస్తారని తెలిపారు.

రక్షణమంత్రిని కలిసిన సీడీఎస్ జనరల్ చౌహాన్

న్యూఢిల్లీ: చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ శుక్రవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. భారత రక్షణ సిబ్బందికి కొత్త చీఫ్‌గా జనరల్ చౌహాన్ బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటల తర్వాత ఈ సమావేశం జరిగింది. గతేడాది డిసెంబర్‌లో తమిళనాడులో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో దేశంలోనే తొలి సీడీఎస్ జనరల్ రావత్ మరణించడంతో ఆ పదవి ఖాళీ అయింది. రాజనాథ్‌ను జనరల్ చౌహాన్ మర్యాదపూర్వకంగా కలిసినట్టు అధికారులు తెలిపారు. చైనాపై నిపుణుడిగా పేరుగాంచిన ఆయన, తూర్పు లడఖ్‌లో భారత్, చైనా దళాల మధ్య కొనసాగుతున్న సరిహద్దు వివాదం మధ్య అత్యున్నత పదవికి నియామకం జరిగింది.

బీసీఏ ఎన్నికల పిటిషన్‌పై జోక్యం చేసుకోం: సుప్రీం

న్యూఢిల్లీ: బీహార్ క్రికెట్ అసోసియేషన్ (బీసీఏ) ఎన్నికల నిమిత్తం ఎలక్టోరల్ కాలేజీని మార్చారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. సవరించిన రాజ్యాంగాన్ని అమలు చేయడం లేదన్న బీసీఏ తరపు సీనియర్ న్యాయవాది ఆత్మారామ్ నద్కర్ణీ వాదనను న్యాయమూర్తులు డీవై చంద్రచూడ్, హిమా కోహ్లీలతో కూడిన ధర్మాసనం గుర్తించింది. బీసీఏ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, కౌన్సిలర్ (జిల్లా ప్రతినిధి) స్థానాలకు ఆరుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయాన్ని కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది.'ఫలితాలను సవాలు చేసే ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి... మెరిట్‌ల ఆధారంగా మేము అలా చేయడం సరైనది కాదని అభిప్రాయపడుతున్నాం...చట్టానికి అనుగుణంగా నడుచుకునే విషయాన్ని మేము పిటిషనర్లకే వదిలివేస్తాం' అని ధర్మాసనం పేర్కొంది. పిటిషన్‌లోని మెరిట్‌లపై తాము ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంలేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రారంభంలో పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాది అనుపమ్ లాల్ దాస్ మాట్లాడుతూ... ఎన్నికలు కంటి తుడుపుగా ఉన్నాయని ఆరోపించారు. సుప్రీం కోర్టు అనుమతి లేకుండా ఎలక్టోరల్ కాలేజీని మార్చడం సాధ్యం కాదన్నారు. అయితే నిబంధనల ప్రకారమే ఎన్నికలు జరిగాయని, విధివిధానాలు పాటించామని నద్కర్ణీ ఆయన వాదనను తోసిపుచ్చారు. బీహార్ క్రికెట్ అసోసియేషన్ తన రాజ్యాంగాన్ని సవరించడానికి వీలులేదని, ఎన్నికల కోసం అనుసరిస్తున్న విధానాన్ని వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు గతంలో పేర్కొంది.

పీఎఫ్ఐ లింక్ అనుమానం...
కమ్యూనిటీ హాల్‌పై ఎన్ఐఏ దాడి

మంగళూరు: దక్షిణ కన్నడ జిల్లా బంట్వాల్ తాలూకా, మిట్టూరులోని స్వాతంత్ర్య కమ్యూనిటీ హాల్‌లో పీఎఫ్ఐ కార్యకర్తలు శిక్షణ పొందుతున్నారనే అనుమానంతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కి చెందిన అధికారులు శుక్రవారం దాడి చేశారు. హాలును నిర్వహిస్తున్న ట్రస్టీల్లో ఒకరైన అయూబ్ అగ్నాడిని ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేయగా, మరో ట్రస్టీ మసూద్ అగ్నాడి పరారీలో ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. నిషేధిత పీఎఫ్ఐ కార్యకర్తలకు బంట్వాల్, పుత్తూరు, సుల్లియాలోని ఏకాంత ప్రాంతాల్లో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించేందుకు శిక్షణ ఇచ్చినట్లు ఎన్ఐఏ అనుమానిస్తోంది. 2007లో ట్రస్ట్ ప్రారంభించిన మిట్టూరులోని స్వాతంత్ర్య కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది యువకులు శిక్షణ పొందినట్లు అనుమానిస్తున్నారు. పరారీలో ఉన్న ట్రస్టీ మసూద్ కోసం గాలింపుచర్యలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. భారతీయ జనతా యువమోర్చా నాయకుడు ప్రవీణ్ నెట్టార్ హత్య కేసు దర్యాప్తునకు సంబంధించి ఎన్ఐఏ గతంలో సెప్టెంబర్ 6న హాలుపై దాడి చేసిన విషయం తెలిసిందే.

బెంగళూరులో ఓఎన్‌డీసీ సేవలు

బెంగళూరు: ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఇ-కామర్స్ వేదికలకు అడ్డుకట్ట వేస్తూ చిన్న వ్యాపారులకు మేలు చేకూర్చే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) సేవలు బెంగళూరులో అందుబాటులోకి వచ్చాయి. బెంగళూరులోని 16 పిన్‌కోడ్స్‌లో ఈ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. బీటా టెస్టింగ్‌లో భాగంగా ప్రజలు ఈ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకునే సదుపాయాన్ని కల్పించారు. వారి నుంచి వచ్చిన స్పందన ఆధారంగా దేశవ్యాప్తంగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం ఓఎన్‌డీసీ ద్వారా నిత్యావసర సరుకులు, రెస్టారెంట్స్ విభాగాల్లో బెంగళూరు వాసులు సేవలను పొందొచ్చు. ఈ రెండు విభాగాల్లో తమకు నచ్చిన అప్లికేషన్‌ను వినియోగదారులు ఎంపిక చేసుకోవచ్చు.

ఓఎన్‌డీసీ అంటే?

దేశీయ ఇ-కామర్స్ విపణిలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌దే హవా. కోవిడ్ పరిణామాలతో నిత్యావసరాల కోసం కూడా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు పెరుగుతున్నాయి.

కొడగులో కొత్త యూనివర్సిటీ

మంగళూరు: కొడగులో కొత్త యూనివర్సిటీ ఏర్పాటుతో మంగళూరు యూనివర్సిటీ 24 అండర్ గ్రాడ్యుయేట్ కాలేజీలను కోల్పోయే అవకాశం ఉంది. కొడగు విశ్వవిద్యాలయం అధికార పరిధి నుంచి విభజించబడిన కొడగు విశ్వవిద్యాలయంతో సహా ఎనిమిది కొత్త విశ్వవిద్యాలయాల రాజ్యాంగానికి మార్గం సుగమం చేయడానికి కర్ణాటక రాష్ట్ర విశ్వవిద్యాలయాల చట్టం, 2000కు సవరణలు చేస్తూ, కర్ణాటక శాసనసభ గత వారం బిల్లును ఆమోదించడంతో కొడగు విశ్వవిద్యాలయానికి మార్గం సుగమమైంది. మంగళూరు విశ్వవిద్యాలయం దాని పరిధిలో దక్షిణ కన్నడ, కొడగు, ఉడిపిలలో కళాశాలలను కలిగి ఉంది. కొత్త కొడగు యూనివర్సిటీలో ప్రస్తుతం మైసూర్ విశ్వవిద్యాలయం పరిధిలోకి వచ్చే సుమారు 10 కళాశాలలు కూడా ఉన్నాయి. కొడగు జిల్లాలో అతిపెద్ద పురాతన కళాశాల మడికేరిలోని ఫీల్డ్ మార్షల్ కేఎం కరియప్ప కళాశాల. చిక్క అలువారలోని జ్ఞాన కావేరీ క్యాంపస్‌లో మంగళూరు విశ్వవిద్యాలయం పోస్ట్‌గ్రాడ్యుయేట్ కళాశాల, పరిశోధనా కేంద్రం కొడగు విశ్వవిద్యాలయానికి ప్రధాన కార్యాలయంగా ప్రతిపాదించబడింది. కొడగు యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం చిక్క అలువార క్యాంపస్‌లో ఉండే అవకాశం ఉందని సెంటర్ డైరెక్టర్ కేఎస్ చంద్రశేఖరయ్య ధృవీకరించారు. కొడగులోని విద్యార్థులు ప్రస్తుతం పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుల కోసం మైసూరు లేదా మంగళూరుకు వెళ్లాల్సి ఉందని, జ్ఞాన కావేరీ క్యాంపస్‌లో మరిన్ని ఉద్యోగ ఆధారిత కోర్సులను అందిస్తే బాగుంటుందని ఆయన అన్నారు. ప్రస్తుతం 70 ఎకరాలు ఉన్న చిక్క అలువార క్యాంపస్‌కు మరో 200 ఎకరాల భూమి ఇవ్వాలని మడికేరి ఎమ్మెల్యే ఎమ్‌పీ అప్పచ్చు రంజన్ ప్రభుత్వాన్ని కోరారు.

ఖర్గే 'రిమోట్ కంట్రోల్' అవుతారు
కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలపై బీజేపీ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికల్లో గెలుపొందడానికి ఇష్టమైన అభ్యర్థిగా అవతరించిన తర్వాత బీజేపీ శుక్రవారం కాంగ్రెస్‌ను ఎద్దేవా చేసింది. ఖర్గే ఒక 'ప్రతినిధి'..., 'రిమోట్ కంట్రోల్' అవుతాడని పేర్కొంది. '80 ఏళ్ల మల్లికార్జున్ ఖర్గే కాంగ్రెస్‌కు స్ఫూర్తిదాయకమైన ఎంపిక. ఆయన యువకుడు, శక్తివంతుడు, కాంగ్రెస్ పునర్జీవనానికి కావల్సింది మాత్రమే. ఆయన కేవలం డాక్టర్ మన్మోహన్ సింగ్ 'లివింగ్ బై ది రిమోట్ కంట్రోల్' మాన్యువల్‌ని ఎంచుకోవాలి. అదంతా క్రమబద్ధీకరించబడింది' అని బీజేపీ ఐటి విభాగం అధిపతి అమిత్ మాల్వియా ఒక ట్వీట్‌లో తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ ఎంపీని ప్రస్తావిస్తూ, శశి థరూర్ వేలాడుతూనే ఉన్నారని పేర్కొన్నారు. అయితే చాలా మంది కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖర్గే చుట్టూ చేరారు. వారు ఎన్నికల్లో తటస్థంగా ఉంటారని వారు తెలియజేసినప్పటికీ గాంధీల మద్దతు ఉన్నట్లు కనిపిస్తోంది. 'రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ పరివార్ (గాంధీలు) పట్ల అభిమానాన్ని కోల్పోయిన తర్వాత, అధికారిక అభ్యర్థిగా అంచనా వేయబడిన 80 ఏళ్ల మల్లికార్జున్ ఖర్గే 'రిమోట్ కంట్రోల్డ్'... 'ప్రతినిధి' అభ్యర్థిగా ఇప్పుడు ఎంపికయ్యారు. ఆయన నామినేషన్‌ను థరూర్ పేలవమైన నామినేషన్‌తో పోల్చండి. ఖర్గేకి మ్యాచ్ ఫిక్సయిపోయిందనేది స్పష్టం కాదా' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావల్లా ట్వీట్ చేశారు. గాంధీ కుటుంబం పై విమర్శలు చేస్తూ, 'పరివార్ తన అభ్యర్థిని ఎంపిక చేసుకోవాలనే ఒక ఉచిత, న్యాయమైన కసరత్తు అని ఎవరైనా నమ్ముతారా. డాక్టర్ మన్మోహన్ సింగ్ నామమాత్రపు ప్రధాన మంత్రి అయినట్లే, ఇప్పుడు ఇక్కడ కూడా అదే ఎస్‌పీవో అనుసరించబడుతుంది' అని పేర్కొన్నారు. గాంధీలు, గెహ్లోట్‌ను కొత్త కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎంపిక చేయాలని చూసినప్పుడు, ఒక వ్యక్తికి ఒక పదవి అనే ప్రాతిపదికన రాజస్థాన్ ముఖ్యమంత్రిగా గెహ్లోట్‌ను తొలగించాలని కోరుకున్నారు. 'కానీ ఖర్గే జీకి మినహాయింపు ఇవ్వబడింది. నామినేషన్ వేయకముందే రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడి పదవికి రాజీనామా చేశారా' అని పూనావాలా ప్రశ్నించారు.

సులభతర వాణిజ్య వృద్ధికి చర్యలు: గోయల్

న్యూఢిల్లీ: సులభతర వాణిజ్యాన్ని పెంపొందింప చేయడానికి కొన్ని నిబంధనలను నేరరహితం చేసే చట్టంపై మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం వెల్లడించారు. దీనికి సంబంధించిన బిల్లును వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌డి వాణిజ్య పరిశ్రమల సమాఖ్య వార్షిక సమావేశం-2022లో ఆయన మాట్లాడుతూ... అనుమతులను తగ్గించడం, అనవసర విభాగాలను నేరరహితం చేయడంపై త్వరగా అభిప్రాయాన్ని తెలియజేయాలని మంత్రి పరిశ్రమను కోరారు. 'మేము ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి సారించాము...వ్యాపారాలకు అనుమతుల ప్రక్రియను తగ్గించడం కొనసాగిస్తున్నాం. మాకు త్వరగా అభిప్రాయాన్ని తెలియజేయండి...ఎందుకంటే, శీతాకాల సెషన్‌లో సమగ్ర సవరణలతో ముందుకు రావాలని ప్రతిపాదిస్తున్నాం' అని గోయల్ అన్నారు. ప్రభుత్వం అనేక చట్టాలను నిర్వీర్యం చేసిందన్నారు. 'మనం ప్రస్తుతం అనేక ఇతర చట్టాలపై పని చేస్తున్నాము... డీపీఐఐటీ (పరిశ్రమలు అంతర్గత వాణిజ్యాన్ని పెపొందించే విభాగం)... ఇతర మంత్రిత్వ శాఖలతో సంప్రదించి దీనికి నాయకత్వం వహిస్తోంది' అన్నారాయన. ప్రపంచం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న సమయంలో భారతదేశం ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో విజయవంతమైందని తెలిపారు. ఆగస్టులో టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 11 నెలల కనిష్ఠస్థాయి (12.41 శాతం)కి తగ్గింది. అయితే రిటైల్ ద్రవ్యోల్బణం ఆహార ధరలు పెరగడంతో దాని మూడు నెలల క్షీణత స్థితి నుంచి మారి ఆగస్టులో 7 శాతానికి చేరుకుంది. కాగా 'ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చితే మన ద్రవ్యోల్బణ సంఖ్యలను నియంత్రణలో ఉంచగలిగాం... జర్మనీలో 11 శాతానికి చేరుకుంది' అని గోయల్ చెప్పుకొచ్చారు. ప్రపంచ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రస్తుతం భారతదేశం ఇప్పటికీ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోందని ఆయన అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై మంత్రి మాట్లాడుతూ... ఈ ఒప్పందాలు వ్యాపార భాగస్వాములు రెండింటికీ విజయాన్ని చేకూర్చాయని, దేశీయ పరిశ్రమలు రక్షణవాద మనస్తత్వం నుండి బయటపడాలని సూచించారు.

మేనిఫెస్టోలో దేశ పటంపై తప్పిదం
శశి థరూర్ బేషరతు క్షమాపణ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలకు తన మేనిఫెస్టోలో తప్పిదం జరిగినందుకు శశి థరూర్ బేషరతుగా క్షమాపణ చెప్పారు. మేనిఫెస్టోలో ప్రచురించిన భారతదేశ చిత్ర పటంలో జమ్ముకశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాలు లేకపోవడం పై వివాదం చెలరేగింది. సామాజిక మాధ్యమాల్లో దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో థరూర్ జరిగిన తప్పును గుర్తించి సరైన దేశ చిత్ర పటాన్ని ఉంచారు. అంతకుముందు, దేశ చిత్ర పటంలో జరిగిన తప్పుపై సామాజిక మాధ్యమాల్లో నెట్‌జెన్లు ఇది 'అవమానకర చర్య' అని వ్యాఖ్యానించారు. దీనిపై తక్షణం స్పందించిన శశిథరూర్ అందరికీ క్షమాపణలు చెప్పారు. ఉద్దేశపూర్వకంగా చేయలేదని, వలంటీర్ల బృందం పొరపాటు చేసిందని వివరణ ఇచ్చారు. వెంటనే దీనిని సవరించామని.. జరిగిన పొరపాటుకు క్షమించాలని కోరారు శశిథరూర్. ఈ మేరకు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో రూపొందించిన మేనిఫెస్టో కాపీలను ట్వీట్ చేశారు. అయితే శశిథరూర్ ఇండియా మ్యాప్‌కు సంబంధించి తప్పు చేయడం ఇదే తొలిసారి కాదు. గతంలో 2019 డిసెంబర్‌లో భారత పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆందోళనలు చేస్తున్న సమయంలోనూ ఓ ట్వీట్ చేసి అందులోనూ ఇలాంటి తప్పు చేశారు. దీనిపై బీజేపీ నేతలతోపాటు నెటిజన్లు విరుచుకుపడటంతో థరూర్ వెంటనే ట్వీట్‌ను డిలీట్ చేశారు.

అంబులెన్స్‌కు దారిచ్చిన మోదీ కాన్వాయ్

అహ్మదాబాద్: అహ్మదాబాద్ నుంచి గాంధీనగర్‌కు వెళుతుండగా అంబులెన్స్‌కు దారి ఇచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కాన్వాయ్ శుక్రవారం కొద్దిసేపు ఆగింది. గుజరాత్ బీజేపీ మీడియా సెల్ పంచుకున్న వీడియోలో ప్రధాని కాన్వాయ్‌లో భాగమైన రెండు ఎస్‌యూవీలు అంబులెన్స్‌కు దారి ఇవ్వడానికి అహ్మదాబాద్-గాంధీనగర్ రహదారిపై నెమ్మదిగా ఎడమ వైపుకు కదిలాయి. మధ్యాహ్నం స్థానిక దూరదర్శన్ సెంటర్ దగ్గర తన బహిరంగ ర్యాలీ ముగించుకుని గాంధీనగర్‌లోని రాజ్‌భవన్‌కు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. "అహ్మదాబాద్ నుంచి గాంధీనగర్‌కు వెళ్లే మార్గంలో, అంబులెన్స్‌కు దారి ఇవ్వడానికి ప్రధాని మోదీ కాన్వాయ్ ఆగింది' అని గుజరాత్ బీజేపీ ఒక ప్రకటనలో తెలిపింది. తన గుజరాత్ పర్యటనలో రెండో రోజు, మోదీ గాంధీనగర్-ముంబై వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు జెండా ఊపి ప్రారంభించారు. అహ్మదాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశను కూడా ప్రారంభించారు. సాయంత్రం బనస్కాంత జిల్లాకు వచ్చిన ప్రధాని బహిరంగ సభలో ప్రసంగించారు.

బారాముల్లా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు జైషే ఉగ్రవాదుల మృతి



శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో ఆర్మీకి చెందిన అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీని లక్ష్యంగా చేసుకున్న ఇద్దరు స్థానిక జైషే మహ్మద్ ఉగ్రవాదులు, శుక్రవారం భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారని పోలీసులు తెలిపారు. ఉత్తర కశ్మీర్ జిల్లా, బారాముల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రయీస్ భట్ విలేకరులతో మాట్లాడుతూ, శుక్రవారం తెల్లవారుజామున పట్టన్‌లోని యెడిపోరా ప్రాంతంలో నిఘా సంస్థల నుంచి ఉగ్రవాదులున్నారన్న సమాచారం అందుకున్న భద్రతా దళాలు గాలింపు చర్యలు ప్రారంభించాయని తెలిపారు. 'సోదాల సమయంలో, ఉగ్రవాదులు కాల్పులు జరిపారు మరియు ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఆపరేషన్ చాలా సేపు కొనసాగింది. తెల్లవారుజామున ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు' అని ఎస్ఎస్పీ తెలిపారు. గురువారం పట్టన్‌లోని హైదర్‌బేగ్‌లో ముగిసిన ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీని లక్ష్యంగా చేసుకోవడానికి ఉగ్రవాదులు పథకం రచించారని భట్ తెలిపారు. ఎన్‌కౌంటర్ స్థలం నుంచి భద్రతా దళాలు ఎకెఎస్-74యు రైఫిల్‌తో పాటు మూడు మ్యాగజైన్‌లు, పిస్టల్, పిస్టల్ మ్యాగజైన్, రెండు బుల్లెట్‌లను స్వాధీనం చేసుకున్నాయని ఆయన చెప్పారు. యువత హింసాత్మక మార్గాన్ని అనుసరించవద్దని భట్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా జమ్ముకశ్మీర్ పర్యటనకు ముందే ఉగ్రవాదులు తమ ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారా అని అడిగిన ప్రశ్నకు, భద్రతా దళాలు ఇప్పటికే జారీ చేసిన హెచ్చరిక, పర్యటనకు ముందు భద్రతను పెంచడం వల్ల ఆపరేషన్ విజయవంతమైందని ఎస్ఎస్పీ చెప్పారు.

తరగతి గదిలోనే బాలిక... ఏడుగురిపై సస్పెన్షన్ వేటు

బులంద్‌షహర్(ఉత్తర్‌ప్రదేశ్): స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న బాలిక తరగతి గదిలో బంధించి ఉంచినట్లు సీనియర్ అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, నలుగురు ఉపాధ్యాయులు, ఇద్దరు శిక్షా మిత్రలు, ఒక కార్యాలయ సహాయకుడిని సస్పెండ్ చేసినట్లు ప్రాథమిక శిక్షా అధికారి (బీఎస్ఏ) బీకే శర్మ తెలిపారు. క్లాస్‌రూమ్‌లో బాలిక ఏడుస్తూ సహాయం కోరుతున్నట్లుగా ఉన్న వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. గురువారం సెగ్గా పీర్ ప్రాంతంలో ఉన్న సాన్విలియన్ విద్యాలయ విద్యార్థిని పాఠశాలలో తాళం వేసి వదిలేసినట్లు శర్మ తెలిపారు. బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకగా, పాఠశాల నుంచి వస్తున్న ఆమె కేకలు విన్న స్థానికులు చూసే సరికి చిన్నారి కనిపించిందని తెలిపారు. తరగతి గదిని తెరిచేందుకు పాఠశాల సిబ్బందిని పిలిపించి చిన్నారిని బయటకు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇది పాఠశాల పట్ల తీవ్ర నిర్లక్ష్యానికి కారణమని, మొత్తం పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని శర్మ తెలిపారు.

విద్యార్థులు, సీనియర్ సిటిజన్లకు డిస్కౌంట్ తగ్గించిన ఎయిర్ ఇండియా

న్యూఢిల్లీ: సీనియర్ సిటిజన్లు, విద్యార్థులకు టాటాల యాజమాన్యంలోని ఎయిర్ ఇండియా షాకిచ్చింది. ఎకానమీ క్లాస్‌లో ప్రయాణించే వయోవృద్ధులు, విద్యార్థులకు అసలు చార్జీలో గతంలో 50 శాతం రాయితీ ప్రకటించింది. అయితే తాజాగా దానిని 25 శాతానికి పరిమితం చేసింది. ఈ మేరకు ఎయిర్ ఇండియా వెబ్‌సైట్‌లో వెల్లడించింది. ఇది సెప్టెంబర్ 29, ఆ తర్వాత కొనుగోలు చేసిన టికెట్లకు వర్తిస్తుందని ప్రకటించింది. కాగా, రాయితీ తగ్గించడాన్ని ఎయిర్ ఇండియా యాజమాన్యం సమర్థించుకున్నది. డిస్కౌంట్‌పై 25 శాతం కోత విధించినప్పటికీ ఇతర ప్రైవేటు ఎయిర్ లైన్స్‌లు అందిస్తున్న దానికి ఇది రెండు రెట్లు అధికంగా ఉందని స్పష్టం చేసింది. మార్కెట్లో పరిస్థితులకు అనుగుణంగా టికెట్ ధరలను క్రమబద్ధీకరణ చేయాలని నిర్ణయించామని తెలిపింది. నష్టాల్లో కూరుకుపోయిన ఎయిర్ ఇండియాను ఈ ఏడాది జనవరి 27న టాటాలు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.

సీపీఐ 24వ జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఆహ్వాన సంఘం అధ్యక్షులు కె.నారాయణ. వేదికపై కోబాడ్ గాంధీ, సీపీఐ జాతీయ కార్యదర్శి కాంగో, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శులు కె.రామకృష్ణ, చాడ వెంకటరెడ్డి, కోశాధికారి జల్లి విల్సన్, ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, ముప్పాళ్ల నాగేశ్వరరావు. మహాసభల ఏర్పాట్లను ఈ సమావేశంలో సమీక్షించారు. మహాసభల జయప్రదానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

పారదర్శకంగా అంగన్‌వాడీ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: అంగన్‌వాడీ సూపర్ వైజర్ల పరీక్షలు పారదర్శకంగా నిర్వహించామని, అదే విధంగా పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా చేపట్టామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఏఆర్ అనురాధ తెలిపారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోస్టుల భర్తీ విషయంలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అభ్యర్థుల అర్హత, యోగ్యతలకే ప్రాధాన్యత ఇచ్చేలా నియామక ప్రక్రియను రూపొందించామన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసిన నేపథ్యంలో ఫలితాలను ప్రకటించకుండా నిలుపుదల చేశామని, న్యాయ నిపుణుల సలహా మేరకు అవసరమైతే తిరిగి ఈ పరీక్షలను నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రంలో 55,607 అంగన్ వాడీలున్నాయని, 25 అంగన్ వాడీ కేంద్రాలకు ఒక సూపర్ వైజర్ ఉండాల్సి ఉండగా, ఎక్కువ సూపర్ వైజర్ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల, ఒక్కొక్క సూపర్ వైజర్ 60 అంగన్ వాడీ కేంద్రాల వరకూ పర్యవేక్షిస్తున్నారన్నారు. ఖాళీగానున్న 560 అంగన్‌వాడీ సూపర్ వైజర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసి, భర్తీ ప్రక్రియను ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా చేపట్టిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 21,098 అంగన్‌వాడీ వర్కర్లు, 82 కాంట్రాక్టు సూపర్ వైజర్లు ఈ పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా అంగన్ వాడీల్లో పీపీ–1, పీపీ–2 విధానం అమలు పర్చడం వల్ల పిల్లలకు ఇంగ్లీషు బోధిస్తున్నామన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు ఒంగోలు, ఏలూరు, విశాఖపట్నం, కర్నూలు జిల్లాల్లో నాలుగు ప్రాంతీయ కార్యాలయాలున్నాయని, ఆయా జిల్లాల కలెక్టర్ల అధ్యక్షతన నాలుగు జిల్లా ఎంపిక కమిటీలను (డీఎస్సీ) ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కమిటీల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సభ్యులుగా ఉన్నారన్నారు. అంగన్ వాడీ సూపర్ వైజర్ పోస్టులు జోనల్ స్థాయి పోస్టులని, వాటి భర్తీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు ఎ.శిరి పాల్గొన్నారు.

కాట్రగడ్డ బాబు కుటుంబం
రూ.5 లక్షల విరాళం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: సీపీఐ జాతీయ మహాసభలను పురస్కరించుకుని దివంగత కాట్రగడ్డ బాబు తరపున ఆయన కుటుంబం రూ.5లక్షల విరాళం అందజేసింది. విజయవాడ దాసరిభవన్‌లో శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనోహర్‌నాయుడు ద్వారా విరాళం చెక్కును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణకు కాట్రగడ్డ బాబు తనయుడు కాట్రగడ్డ మోహన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ ఏపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆహ్వాన సంఘం కోశాధికారి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఆహ్వానసంఘం ప్రతినిధులు, పార్టీ నేతలు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయం కాదు...ప్రజా ఉద్యమం

- 19వ రోజుకు మహాపాదయాత్ర
- అమరావతి రైతులకు అఖండ స్వాగతం

విశాలాంధ్ర–ద్వారకాతిరుమల: అమరావతినే ఏకైక రాజధానిగా ప్రకటించాలని కోరుతూ అమరావతి నుంచి అరసవల్లి సూర్యదేవాలయం వరకు రైతులు చేపట్టిన మహాపాదయాత్ర శుక్రవారానికి 19వరోజుకు చేరుకుంది. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం మెట్టపంగిడిగూడెం నుంచి పాదయాత్ర మొదలైంది. తొలుత అమరావతి రథం వద్ద జేఏసీ నాయకులు పూజలు చేసి యాత్రను ప్రారంభించారు. భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన, సీపీఐ నేతలు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. పాదయాత్ర పంగిడిగూడెం చేరుకోగా గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎంపీ మాగంటి బాబు పాదయాత్రకు స్వాగతం పలికారు. ప్రతిగ్రామంలో ప్రజల ఆశీర్వాదాలు, సంఘీభావాలు, హారతులతో అఖండ స్వాగతం లభించింది. సూర్యచంద్రరావుపేట, గొల్లగూడెం, తిమ్మాపురం, ద్వారకాతిరుమల వరకు పాదయాత్ర సాగింది. టీడీపీ సీనియర్ నాయకుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ అమరావతి రైతుల మహాపాదయాత్ర కేవలం కొన్ని గ్రామాల రైతులకోసం కాదని రాష్ట్రాభివృద్ధి కాంక్షిస్తూ భావితరాల బాగుకోసమని తెలిపారు. జవహర్ మాట్లాడుతూ పాదయాత్ర రాజకీయం కాదని ప్రజాఉద్యమం అని చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగారం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సీఎం జగన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పాదయాత్రలో టీడీపీ నాయకులు లంకా సత్తిపండు, సుంకవల్లి బ్రహ్మయ్య, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, ఘంటా నాని, పోలిన శ్రీనివాసరావు, తూంపాటి ప్రసాద్, ఇమ్మడి రత్నాజీ, వాసిరెడ్డి ప్రవీణ్, మటపర్తి రూపేష్ (బద్రి) పాల్గొన్నారు.

కర్ణాటకలోకి 'భారత్ జోడో'

గుండ్లుపేట్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో భారత్ జోడో యాత్ర శుక్రవారం కర్ణాటకలోకి ప్రవేశించింది. 21వరోజు తమిళనాడులోని గుడల్లూరు నుంచి కర్ణాటకలోని చమరాజనగర్ జిల్లాకు యాత్ర చేరుకుంది. మైసూరు, మాండ్యా, తుమకురు, చిత్రదుర్గ, బళ్లారి, రాయ్‌చూర్ జిల్లాల్లో యాత్ర సాగుతుంది. ఆపై తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. అంతకుముందు అంటే అక్టోబరు19న బళ్లారిలో భారీ బహిరంగ సభను కాంగ్రెస్ నిర్వహించనుంది. తమ రాష్ట్రానికి చేరుకున్న భారత్ జోడో యాత్రకు బందీపూర్‌లో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్దరామయ్య స్వాగతం పలికారు. ఈ యాత్ర దేశపు సామాజిక–ఆర్థిక, రాజకీయ వాతావరణాన్ని రక్షించడానికి వీలుగా ప్రతి భారతీయుడు ఏకతాటిపైకి తేవడానికి, ఒకే స్వరంలో మాట్లాడటానికి వీలు కల్పిస్తుందని ఆయన ట్వీట్ చేశారు. దాదాపు 40,000–45,000 మంది మార్చ్‌లో పాల్గొంటారని ఆశిస్తున్నట్లు సిద్ధ రామయ్య తెలిపారు. తాము సమైక్య ప్రతిజ్ఞను పునరుద్ధరిస్తున్నామని కాంగ్రెస్ కర్ణాటక అధ్యక్షుడు డీకే శివకుమార్ అన్నారు. మార్పు కోసం ఉద్యమంలో చేరండంటూ కర్ణాటక ప్రజలకు పిలుపునిచ్చారు. 1947లో స్వాతంత్ర్యం కోసం దేశాన్ని కాంగ్రెస్ ఏకం చేసిందని, ఇప్పుడు 75 ఏళ్ల తర్వాత మార్పు కోసం ఐక్యతా ప్రతిజ్ఞను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు.

భావ ప్రకటనకు ఇదొక్కటే మార్గం: రాహుల్

గుండ్లుపేట్: దేశ ప్రజలు తమ గళాన్ని వినిపించే అన్ని మార్గాలు మూసుకుపోయాయని, భావ ప్రకటనకు భారత్ జోడో యాత్ర మాత్రమే ఏకైక మాధ్యమం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం ఉద్ఘాటించారు. కర్ణాటకలోకి యాత్ర ప్రవేశించిన క్రమంలో ఆయన మాట్లాడారు. 'ప్రజాస్వామ్యంలో అనేక వ్యవస్థలు ఉన్నాయి. మీడియా, పార్లమెంటు కూడా ఇందులో భాగంగానే ఉన్నాగానీ విపక్షాల గళాన్ని ఎవ్వరూ వినిపించుకోవడం లేదు. అన్నింటిపై ప్రభుత్వ నియంత్రణ ఉంది. పార్లమెంటులో మా మైకులు మూగబోతాయి. అసెంబ్లీలను నిర్వహించనివ్వరు. ప్రతిపక్షాన్ని వేధిస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో మిగిలిన ఏకైక ప్రత్యామ్నాయం భారత్ జోడో యాత్ర అని బహిరంగ సభలో రాహుల్ అన్నారు. ఇది భారతదేశ మార్చ్ అని దీనిని ఎవ్వరూ ఆపలేరని చెప్పారు. భారత స్వరాన్ని మార్చ్ వింటుందని, దానిని ఎవ్వరూ అణచివేయలేరని అన్నారు. మరి కొన్నిరోజుల్లో 511కిమీల యాత్ర సాగబోతోందన్నారు. వేర్వేరు జిల్లాల్లో పర్యటించి కర్ణాటక బాధను ఆలకిస్తుందని అన్నారు. మరో 20–25 రోజుల్లో మీరంతా మా వెంట కదం తొక్కుతారు.. అవినీతి, నిరుద్యోగం, ధరల పెంపుదలపై కర్ణాటక ప్రజల ఆవేదనను వింటారని రాహుల్ గాంధీ అన్నారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడం, బీజేపీ–ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని, విద్వేషాన్ని, హింసను అరికట్టడమే తమ ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

స్కై బెలూన్లతో సీపీఐ మహాసభల ప్రచారం

విశాలాంధ్ర–విజయవాడ : సీపీఐ 24వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని మహాసభల ఆహ్వాన సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. మహాసభలను పురస్కరించుకుని విజయవాడ నగరంలో ప్రచార నిమిత్తం ఆయన ఇక్కడి చలసాని భవన్‌పై శుక్రవారం బెలూన్ ఎగురవేశారు. పాతబస్తీ లెనిన్‌భవన్ పై వినయిల్ స్కై బెలూన్‌ను సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఎగురవేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ప్రజాతంత్ర ఉద్యమాలకు నిలయం, కమ్యూనిస్టు ఉద్యమ కేంద్రం విజయవాడ నగరంలో జాతీయ మహాసభలు జరగటం గర్వకారణం అన్నారు. మహాసభల జయప్రదానికి ప్రతి కార్యకర్త పూనుకోవాలన్నారు. మహాసభల ప్రారంభం సందర్భంగా 14వ తేదీన మహాప్రదర్శన, సింగ్‌నగర్ ఎంబీ స్టేడియంలో బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. 14 నుంచి 18వ తేది వరకు ఎస్.ఎస్.కన్వెన్షన్ హాలులో జరిగే ప్రతినిధుల సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, నాయకులు సంగుల పేరయ్య, ఈమని దాము, మందలపు శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.సాయికుమార్, ఏఐవైఎఫ్ నాయకులు లంకే సాయి, పాశం ఆంజనేయులు, స్థానిక నాయకులు పీఎం శర్మ, పీవీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు. లెనిన్‌భవన్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వర్గసభ్యులు తాడిపైడియ్య, పంచదార్ల దుర్గాంబ, కార్యవర్గ సభ్యులు కొట్టు రమణారావు, మురుగేషన్ రాము, పగిడికత్తుల రాము, శీరం సోమేశ్వరరావు, పి.రాణి, తిప్పాబత్తుల వెంకటేశ్వరరావు, పెదాడి బాబ్జీ, మోకా దుర్గారావు, తుపాకుల నాగేశ్వరరావు, జిగ్ర లాజర్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా కథనాల్లో విశ్వసనీయత కరువు

జస్టిస్ సుదర్శన్ రెడ్డి

విశాలాంధ్ర – హైదరాబాద్: మీడియా కథనాల్లో విశ్వసనీయత సన్నగిల్లుతోందని, వాస్తవాలు రాయాలన్న తపన జర్నలిస్టుల్లో కనిపిస్తున్నా, మీడియా సంస్థల యాజమాన్యాల్లో మాత్రం ఆ చిత్తశుద్ధి లోపిస్తున్నదని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సరళీకృత నవీన ఆర్థిక వ్యవస్థలో నైతిక విలువలకు స్థానం లేకుండా పోవడం పై ఆయన విచారం వ్యక్తం చేశారు.

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) 10వ జాతీయ మహాసభల నేపథ్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఆవరణలో ఐజేయూ అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన 'ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా–నైతిక ప్రమాణాలు' అనే అంశంపై తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే), దాని అనుబంధ సంస్థలు, ప్రెస్ క్లబ్ హైదరాబాద్ సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నైతిక విలువలు–పాత్రికేయ వృత్తి ఒకదానితో ఒకటి పొసగని పరిస్థితి ఏర్పడిందన్నారు. వార్తలు, కథనాల ద్వారా పాలకులను మెప్పించడమే తమ బాధ్యత అన్నట్టుగా మీడియా సంస్థలు వ్యవహరిస్తున్నాయని, అలా వ్యవహరించడం తప్పుకాదన్న ధోరణి ప్రబలడం దురదృష్టకరమని జస్టిస్ సుదర్శన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతుల ఆత్మహత్యల వంటి ప్రధాన వార్తలకు మీడియా సరైన కవరేజి లేకుండా పోయిందని అన్నారు. ఎన్నికల సంవత్సరంలో గ్రామీణ వార్తలకు పత్రికల్లో మొదటి పేజీల్లో ఇస్తున్న కవరేజి 0.67 శాతం ఉన్నట్లు ఒక అధ్యయనంలో వెల్లడయిందని తెలిపారు. ఎన్నికల హడావుడి లేని కాలంలో అయితే ఇంకా తక్కువ ప్రాధాన్యత లభిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2020 సంవత్సరం ప్రథమార్థంలో మహారాష్ట్రలో 2 వేల మందికి పైగా ఆత్మహత్యలు చేసుకుంటే మీడియా ఆ వార్తలకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వకుండా నటుడు సుశాంత్ రాజ్‌పుత్ ఆత్మహత్యకు సంబంధించిన కథనాలను పుంఖానుపుంఖాలుగా ఇస్తూ పరస్పరం పోటీ పడ్డాయని జస్టిస్ సుదర్శన్ రెడ్డి విమర్శించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖ మాజీ అధిపతి పద్మజ షా మాట్లాడుతూ మీడియా నైతిక విలువల ఉల్లంఘన సర్వసాధారణమై పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా మీడియా రంగంలో రూపర్ట్ మర్డోక్ ప్రవేశించిన తర్వాత అన్ని ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చారని తెలిపారు. నేడు అన్ని టెలివిజన్ సంస్థలు మర్డోక్ ఫార్ములాను పాటిస్తున్నాయని అన్నారు. దేశంలో నేడు మీడియా సంస్థలు ఎన్ని ఉల్లంఘనలకు పాల్పడినా ప్రశ్నించే వారు, శిక్షించే వారే కరువయ్యారని ఆమె వ్యాఖ్యానించారు. సంచనాల కోసం పాకులాడే మీడియా సంస్థలు ఏనాటికీ ప్రజల విశ్వాసాన్ని చూరగొనలేవని పద్మజ షా స్పష్టం చేశారు. విమర్శనాత్మక కథనాల్లో వాస్తవికత, నిజాయితీ ఉంటేనే ప్రజల విశ్వాసం సాధ్యమవుతుందని ఐజేయూ అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇంకా ఈ సదస్సులో మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మెఫీ) మేనేజింగ్ ట్రస్టీ దేవులపల్లి అమర్, ఐజేయూ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ, ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.వేణుగోపాల నాయుడు, ఆర్.రవికాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎస్.విజయకుమార్ రెడ్డి, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికలు, మేగజైన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ యూసుఫ్ బాబు, బాలకృష్ణ, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) అధ్యక్ష, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, శిగా శంకర్ గౌడ్, తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కె.ఎన్.హరి, తెలంగాణా ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ఎ.మజీద్, గౌసుద్దీన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఫైసల్ అహ్మద్, ప్రెస్ క్లబ్ హైదరాబాద్ కోశాధికారి ఎ.రాజేష్, సహాయ కార్యదర్శి రమేష్ వైట్ల, టీయూడబ్ల్యూజే నాయకులు హబీబ్ జిలాని, బి.కిరణ్ కుమార్, మోతే వెంకట్ రెడ్డి, బాలరాజ్, వెంకట్రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షావోమీకి ఎదురుదెబ్బ
రూ.5,551 కోట్ల డిపాజిట్లు జప్తునకు ఆమోదం

న్యూదిల్లీ: చైనా మొబైల్ తయారీ కంపెనీ షావోమీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థకు చెందిన రూ.5,551 కోట్ల నిధులను సీజ్ చేసేందుకు విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) సమర్థ అధికార మండలి శుక్రవారం ఆమోదముద్ర వేసింది. షావోమీ సహా విదేశాల్లోని మూడు కంపెనీలకు ఆ సంస్థ భారత విభాగం రాయల్టీ ముసుగులో ఈ డబ్బును చెల్లించినట్లు నిర్ధరిస్తూ కొంతకాలం క్రితం ఈ డిపాజిట్ల జప్తునకు ఈడీ చర్యలు ప్రారంభించింది. చైనాకు చెందిన షావోమీ గ్రూప్ అనుబంధ సంస్థ అయిన షావోమీ ఇండియా భారత్‌లో 2014 నుంచి కార్యకలాపాలు సాగిస్తోంది. అయితే ఆ మరుసటి ఏడాది నుంచే ఈ కంపెనీ అక్రమంగా నిధులను ఇతర దేశాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఈ ఏడాది ఫిబ్రవరిలో కేసు నమోదు చేసిన ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఆ సంస్థకు చెందిన డిపాజిట్లు జప్తు చేసేందుకు ఏప్రిల్ 29న ఈడీ ఉత్తర్వులు జారీ చేసింది. 'కంపెనీ గత కొన్నేళ్లుగా రూ.5551.27 కోట్ల సమానమైన విదేశీ నిధులను మూడు విదేశాల్లో పని చేస్తున్న మూడు సంస్థలకు అక్రమంగా పంపించింది. షావోమీ గ్రూప్‌తో పాటు అమెరికాలో ఉన్న మరో రెండు సంస్థలకు ఈ నిధులు చేరాయి. మాతృక సంస్థ ఆదేశాలతోనే రాయల్టీల రూపంలో ఈ భారీ మొత్తాన్ని బదిలీ చేసింది. సదరు సంస్థల నుంచి ఎలాంటి సేవలను పొందకుండానే ఈ నగదును పంపించింది. ఇది ఫెమా చట్ట నిబంధనలకు విరుద్ధం. అంతేగాక, బ్యాంకులను తప్పుదోవ పట్టించి ఈ నిధులను విదేశాలకు చేరవేసింది' అని ఈడీ నాటి ప్రకటనలో వెల్లడించింది. దేశ చరిత్రలో జప్తు చేసిన అత్యధిక మొత్తం ఇదే. డిపాజిట్ల జప్తు ప్రతిపాదనలకు ఫెమా కంపీటెంట్ అథారిటీ అంగీకారం తప్పనిసరి. సంబంధిత దస్త్రాలను ఈడీ కొన్ని నెలల క్రితం కంపీటెంట్ అథారిటీకి సమర్పించగా... ఎట్టకేలకు శుక్రవారం ఆమోదం లభించింది. రూ.5551.27 కోట్ల డిపాజిట్ల జప్తునకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నగరాలతోనే దేశాభివృద్ధి సాధ్యం

- ప్రధాని నరేంద్రమోదీ
- గాంధీనగర్–ముంబై వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

అహ్మదాబాద్: నగరాలే భారతదేశ భవితవ్యాన్ని నిర్దేశిస్తాయని, రాబోయే 25 ఏళ్లలో అభివృద్ధి చెందిన దేశంగా రూపొందేలా చూస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ వ్యాపార డిమాండ్‌కు అనుగుణంగా దేశంలో కొత్త నగరాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గుజరాత్ పర్యటనలో ఉన్న మోదీ శుక్రవారం గాంధీనగర్–ముంబై వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జాతికి అంకితం చేశారు. అలాగే అహ్మదాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్–1ను ప్రారంభించారు. అనంతరం అహ్మదాబాద్‌లో జరిగిన సభలో ప్రసంగిస్తూ... '21వ శతాబ్దంలో భారదేశం నగరాల నుంచి కొత్త ఒరవడిని అందుకోనుంది... మారుతున్న కాలానికి అనుగుణంగా, మారుతున్న అవసరాలకు అనుగుణంగా మన నగరాలను నిరంతరం ఆధునీకరించడం అవసరం... దేశంలో నగరాల అభివృద్ధిపై దృష్టిపెట్టి పెట్టుబడులు పెట్టడం జరుగుతోంది... ఎందుకంటే అవి రాబోయే 25 ఏళ్లలో అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సృష్టిస్తాయి' అని ప్రధాని అన్నారు. అహ్మదాబాద్, సూరత్, వడోదర, భోపాల్, ఇండోర్, జైపూర్ – ఈ నగరాలు రాబోయే 25 ఏళ్లలో భారతదేశ భవిష్యత్తును రూపొందిస్తాయి. ఈ పెట్టుబడులతో కేవలం అనుసంధానతకు మాత్రమే పరిమితం కాకుండా డజన్ల కొద్దీ నగరాల్లో ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు, మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నామని, శివారు ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. జంట నగరాలపై ఆయన మాట్లాడుతూ.. 'జంట నగరాలు ఎలా అభివృద్ధి చెందుతాయో చెప్పడానికి గాంధీనగర్–అహ్మదాబాద్ అద్భుతమైన ఉదాహరణ. గుజరాత్‌లోని అనేక జంట నగరాల అభివృద్ధికి పునాది సిద్ధమవుతోంది. ఇప్పటివరకు న్యూయార్క్–న్యూజెర్సీ జంట నగరాల గురించి విన్నాం. మన భారతదేశం వెనుకబడి ఉండదు. ఆనంద్–నాడియాద్, బరూచ్–అంక్లేశ్వర్, వల్సాద్–వాపి, సూరత్–నవసారి, వడోదర–కలోల్, మోర్బి–వంకనేర్, మెహసానా–కాడి వంటి జంట నగరాలు గుజరాత్ గుర్తింపును బలోపేతం చేస్తాయి' అని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉన్న నగరాలను మెరుగుపరచడం, విస్తరించడంపై దృష్టి పెట్టడంతో పాటు, ప్రపంచ వ్యాపార డిమాండ్‌కు అనుగుణంగా కొత్త నగరాలు కూడా నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. నగరాల్లో రవాణా వ్యవస్థలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్‌ను నివారించడానికి, రైళ్ల వేగాన్ని పెంచడానికి ఇంతకు ముందు గట్టి ప్రయత్నాలు చేయలేదని, నేటి భారతదేశం వేగాన్ని ముఖ్యమైనదిగా, వేగవంత అభివృద్ధికి హామీగా భావిస్తోందన్నారు.

దేశంలో 75 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించనున్నట్లు మోదీ ప్రకటించారు. 'దీని ప్రత్యేకత ఏమిటంటే ఇది కేవలం 52 సెకన్లలోపు వేగాన్ని అందుకుంటుంది. అహ్మదాబాద్ నుంచి ముంబైకి ఐదున్నర గంటల్లో చేరుకుంటుంది... శతాబ్ది రైళ్లకు కూడా ఆరు, ఏడు గంటల సమయం పడుతుంది... ఈ వందే భారత్ రైలుకు క్రమంగా మరిన్ని మెరుగుదలలు తీసుకువస్తాము' అని ప్రధాని చెప్పారు.

కాశీలో రైల్వే సిబ్బందితో మాట్లాడినప్పుడు... పేద ప్రజలు వందేభారత్ రైళ్లను ఉపయోగిస్తున్నారని, అవి ఎక్కువ లగేజీ స్థలాన్ని అందించడం, టిక్కెట్ ధరను తిరిగి పొందడంలో సహాయపడేలా ప్రయాణ సమయాన్ని తగ్గిస్తున్నాయని తెలుసుకున్నానని ఆయన చెప్పారు. అహ్మదాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్–1ను ప్రధాని ప్రారంభించారు. అహ్మదాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు రూట్లను పేదలకు మేలు చేసే విధంగా ప్లాన్ చేసినట్లు తెలిపారు. ఇరుకైన రోడ్లు, మల్టీ మోడల్ కనెక్టివిటీకి నగరాన్ని కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో దీన్ని రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు.

తొలుత గుజరాత్ రాజధాని గాంధీనగర్–ముంబై మధ్య వందే భారత్ ఎక్స్ ప్రెస్ ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. గాంధీనగర్ రైల్వే స్టేషన్‌లో జెండా ఊపి ఈ రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా రైలు ఎక్కి ఇంజిన్ భాగాన్ని పరిశీలించి, పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత రైలు బోగి ఎక్కి అందులో ప్రయాణీకులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముచ్చటించారు. గాంధీనగర్ నుంచి కాలుపుర్ రైల్వే స్టేషన్ వరకు ప్రయాణించారు. రైల్వే సిబ్బంది, మహిళలు, యువకులతో సహా వివిధ రంగాలకు చెందిన ఈ సందర్భంగా ప్రధానమంత్రి ముచ్చటించారు. దీనికి సంబంధించిన చిత్రాలను ప్రధానమంత్రి కార్యాలయం ట్విట్టర్‌లో పోస్టు చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెంట గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ తదితరులు ఉన్నారు.



"అధికారికమైన, ఉదారవాద శాస్త్రాలన్నీ వేతనం తీసుకునే బానిసత్వాన్నే సమర్థిస్తాయి. మార్క్సిజం మాత్రమే నిరంతరం బానిసత్వంపై పోరాడుతుంది."
లెనిన్

CPI 24th PARTY CONGRESS 2022 October 14-18 VIJAYAWADA

సీపీఐ 24వ జాతీయ మహాసభలు

అక్టోబర్ 14 - 18, 2022 విజయవాడ

అరుణ తారలు

వామపక్ష ప్రభుత్వాల చుక్కాని

జ్యోతిబసు

బాల్యంలోనే ఆయన చిటగాంగ్ పోరాట వీరుడు సూర్యసేన్ నుంచి స్ఫూర్తి పొందారు. ఉన్నత చదవులకు లండన్ వెళ్లారు. అక్కడ మార్క్సిజం ఆయన పైన ప్రగాఢ ముద్ర వేసింది. భారతదేశ కమ్యూనిస్టు అగ్రనేతల్లో ఆయనొకరు. ఆయనే జ్యోతిబసు కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఏఏ పనులు చేయగలరో చేసి చూపిన గొప్ప పాలనాదక్షుడు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా 23 ఏళ్లు ఏకధాటి సమర్థంగా వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వాన్ని నిర్వహించి రాష్ట్ర ప్రజల ఆదరణ పొందారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన వివిధ రంగాలలో సంస్కరణలు దేశ వ్యాప్తంగా ప్రభావం చూపాయి. గ్రామీణ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి జ్యోతిబసు పాలన ఎంతగానో దోహదం చేసింది. రెండు దశాబ్దాలకు పైగా అధికారంలో కొనసాగడానికి గ్రామీణ ప్రజలు బలమైన కోటగా అండగా నిలిచారు.

బెంగాల్లో భూస్వామ్య వ్యవస్థ బలంగా ఉండేది. జ్యోతిబసు భూసంస్కరణల ద్వారా ప్రభుత్వం పేదలకు భూ పంపిణీ చేయడంతో ఆయన పలుకుబడి అపారంగా పెరిగింది. అయితే పట్టణ ప్రాంతాలలో అభివృద్ధి, పారిశ్రామీకీకరణపై శ్రద్ధ చూపలేదన్న ఆరోపణలున్నాయి. భూసంస్కరణలు, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాల లభ్యత, మూడంచెల పంచాయతీ వ్యవస్థను ప్రవేశపెట్టి పదిలపరచడం లాంటి నిర్ణయాత్మక చర్యలతో వామపక్ష ప్రభుత్వాన్ని ప్రజలు సుదీర్ఘ కాలం ఆదరించారు. ఎమర్జెన్సీ తర్వాత బెంగాల్లో వామపక్ష ప్రభుత్వం ఏర్పడింది. వామపక్ష ఫ్రంట్ జ్యోతి బసును ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. అప్పటి నుంచి 23 ఏళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగారు.

జ్యోతి బసు 1914 జులై 8వ తేదీ కలత్తాలో ఎగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు నిశికాంతబసు, హేమలతా దేవి. తండ్రి ప్రముఖ హోమియోపతి డాక్టరు. ప్రాథమిక విద్య ప్రయివేటు పాఠశాలల్లో జరిగింది. కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలో ఇంగ్లీషు ఆనర్సు డిగ్రీ పూర్తయ్యాక ఉన్నత చదువులకు లండన్ వెళ్లారు. బ్రిటన్ లేబర్ పార్టీ అధ్యక్షుడు హెరాల్డ్ లాస్కి మార్క్సిస్టు సిద్ధాంతం, ఆచరణపై చేసిన ప్రసంగాలను జ్యోతిబసు శ్రద్ధగా విని ఆకళింపు చేసుకున్నారు. ఇండియా లీగ్లో సభ్యుడయ్యారు. అక్కడి స్టడీ సర్కిల్స్ కార్యకలాపాలలో పాల్గొనేవారు.

ఆయన స్నేహితుడు ప్రముఖ కమ్యూనిస్టు భూపేష్ గుప్త బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీని బసుకు పరిచయం చేశారు. మార్క్సిస్టు మేధావులు బెన్బ్రాడ్లీ, రజనీ పామీదత్, హరిపొల్లిట్లు బసును అమితంగా ప్రభావితం చేశారు. మిడిల్ టెంపుల్లో బారిస్టరు చేసి భారత దేశం వచ్చిన తర్వాత క్రియాశీల రాజకీయాలలో పాల్గొన్నారు. వివిధ ట్రేడ్ యూనియన్లకు నాయకత్వ స్థానంలో ఉన్నారు. కలకత్తా హైకోర్టులో బారిస్టర్గా రిజిస్టరు అయినప్పటికీ ఏనాడు ఆయన న్యాయవాదిగా పనిచేయలేదు. బసు 1940 జనవరి 20 న బసంత్ ఘోష్ను వివాహం చేసుకున్నారు. అయితే రెండేళ్ల తర్వాత 1942 లో ఆమె మృతిచెందారు. దీంతో తీవ్ర షాక్ గురైన బసు తల్లి ఆకస్మిక మరణం చెందారు. 1948 డిసెంబరు 5 న కమలా బసును వివాహం చేసుకున్నారు. మొదట జన్మించిన ఆడశిశువు మరణించగా రెండో సంతానం చందన్ బసు జన్మించారు. కమలా బసు 2003 అక్టోబరు 1 న మరణించారు. బసుకు 1996 లో సంకీర్ణ ప్రభుత్వ ప్రధానమంత్రిగా అయ్యే అవకాశం వచ్చినప్పటికీ సీపీఎం తిరస్కరించింది. ఆయనే ప్రధానమంత్రిగా ఉంటే వామపక్ష పాలన ఎంతటి పురోగమన శీలంగా ఉండేదో దేశ వాసులందరికీ తెలిసే అవకాశం వచ్చేదేమో. 2000 సంవత్సరంలో క్రియాశీల రాజకీయాల నుండి వైదొలగిన జ్యోతిబసు కలకత్తాలో నిమోనియాకు చికిత్స పొందుతూ, 2010 జనవరి 17న అస్తమించారు.

- టీ.వి. సుబ్బయ్య

తెలంగాణ ధర్మతేజం ధర్మభిక్షం

ధర్మభిక్షం

తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్లో నిలువెత్తు కాంశ్య విగ్రహం ఒకటుంటుంది. ఒక్క రెండు నిమిషాల పాటు కన్నార్పకుండా ఆ విగ్రహాన్ని చూస్తే... అభేద్యమైన పోరాటం, ఆదర్శప్రాయమైన ఒక గొప్ప జీవితం మన కళ్లముందు నుంచి కదిలి వెళ్తున్నట్లు అన్పిస్తుంది. నిలువెల్లా నిజాయితీని నింపుకున్న ఓ మహామనీషి మన హృదయాన్ని తట్టి లేప్పినట్లు అనిపిస్తుంది. ఆయనెవరో కాదు... అజరామరమైన ఓ జీవితంలో అజేయమైన ఎన్నో పోరాటాలతో రూపుదిద్దుకున్న ఆరున్నరడుగుల తెలంగాణ ధర్మతేజం ధర్మభిక్షం. ఆయన అసలు పేరు బొమ్మగాని భిక్షం. ధర్మాన్ని కోరిన విద్యార్థి నాయకుడిగా నాటి హైదరాబాద్ కొత్వాల్ రాజ్‌బహద్దూర్ వెంకటరామారెడ్డి భిక్షంకు పెట్టిన పేరు ధర్మభిక్షం.."భిక్షం మాంగా ధర్మ్.. కియా ఇన్‌కా నామ్ ధర్మ్‌భిక్షు హై.."! అన్న నాటి నుంచి ఆయన ధర్మభిక్షంగానే ప్రాచుర్యం పొందారు. విద్యార్థి నాయకుడిగా, హాకీ జట్టు కెప్టెన్‌గా, ఆర్యసమాజ్ సారథిగా, ఆంధ్ర మహాసభ ఆర్గనైజర్‌గా, కార్మిక సంఘాల నాయకునిగా, ముఖ్యంగా గీతకార్మికుల ఆరాధ్య నేతగా, అన్నింటికీ మించి తెలంగాణ సాయుధ పోరాట యోధునిగా, నిఖార్సయిన కమ్యూనిస్టుగా ఆయన తెలుగు ప్రజలందరికీ సుపరిచితుడే. 'దున్నేవానికి భూమి-గీసేవానికి చెట్టు' నినాదంతో గీతపనివారలను ఒకతాటిపైకి తీసుకువచ్చిన ఘనత ఆయనదే. ఇక ఎమ్మెల్యేగా, ఎంపీగా, ప్రజా జీవితమే పరమావధిగా గడిపి ఆజన్మ బ్రహ్మచారిగా నిలిచిన ఆదర్శ నేత ధర్మభిక్షం గురించి ఎంత చెప్పినా తక్కువే. ధర్మభిక్షం తల్లిదండ్రులు నల్లగొండ జిల్లా మునుగోడు తాలూకా 'ఊకొండి' గ్రామం నుంచి సూర్యాపేట పట్టణానికి తరలివచ్చి స్థిరపడ్డారు. 1922 ఫిబ్రవరి 15న ధర్మభిక్షం సూర్యాపేటలో జన్మించారు. గీతవృత్తితోపాటు ప్రాథమిక విద్య అక్కడే గడిచిపోగా, 1938లో మెట్రిక్యులేషన్ చదువు కోసం నల్లగొండ పట్టణం వెళ్లిన ధర్మభిక్షం అక్కడ రెడ్డి వసతి గృహంలో చేరి తన ఆలోచనలకు అనుగుణంగా 'డిబేట్స్ సొసైటీ'ని ఏర్పాటు చేశారు. దాంతో అక్కడి విద్యార్థులు ఆయనను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. మెస్‌లోనే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయించి, నిత్యం చర్చలు జరిపించి, విద్యార్థులలో చైతన్యాన్ని రగిల్చే వేదికగా దానిని ఉపయోగించారు. తెలుగు తోపాటు ఉర్దూ, ఆంగ్ల భాషలో అనర్గళంగా మాట్లాడటం నేర్చుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో వందేమాతరం ఉద్యమం ఆరంభమై, అది నైజాం సంస్థానం అంతటా వ్యాపించింది. ఆ ఉద్యమం నల్లగొండ జిల్లాకు వ్యాపించిన పుడు నిజాం సర్కారు పోలీసుల నిర్బంధాలను, లాఠీదెబ్బ లను ఎదుర్కొని ఉద్యమం ఉధృతి చేశారు. నిజాం నవాబు మతోన్మాద రాజకీయాలు సంస్థానాన్ని మండుతున్న కుంపటిలా మార్చిన నేపథ్యంలో ధర్మభిక్షం ఆర్యసమాజ్ ఉద్యమంలో చేరారు. జీవహింస వ్యతిరేక ఉద్యమంతోపాటు నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేశారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని కలగచేసే సాహిత్యాన్ని ప్రజలకు పంచేందుకు గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా సూర్యపేట పట్టణంలో "అర్జున పుస్తక బండారు" పేరిట పుస్తకశాలను స్థాపించారు. దానికి విశ్వసాహితిమాల, గురజాడ సాహిత్యం, నిషిద్ధ సాహిత్యం సైతం తెప్పించి ప్రజలకు అందించారు.

ధర్మభిక్షం 1942లో దేవులపల్లి వెంకటేశ్వరరావు సూచన మేరకు భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అనతి కాలంలోనే సూర్యాపేటలో కమ్యూనిస్టు పార్టీ శాఖ ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లాలో ఇది ప్రథమ కమ్యూనిస్టు పార్టీ శాఖ. జిల్లా కమిటీలోనూ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. మల్కాపురం బిల్కారు ఆంధ్రమహాసభలో పాల్గొన్న ధర్మభిక్షంకు రావి నారాయణరెడ్డి, తదితరులతో పరిచయాలు ఏర్పడ్డాయి. నిజాంపై సాయుధ పోరాటం మొదలైన తర్వాత తుపాకీ చేతబట్టి యుద్ధరంగంలోకి దిగారు. సాయుధ పోరాటాన్ని విస్తరింపజేశారు. ఈ క్రమంలో అరెస్టయ్యి.. ఔరంగాబాద్, జాల్నా జైల్లో ఉన్నారు. మొత్తంగా అయిదేళ్లకుపైగా జైలుశిక్షను అనుభవించారు. జాల్నా జైల్లో ఏకంగా పదివేల మంది ఖైదీలతో సమ్మె చేయించిన ఘనత కూడా ఆయనదే. గీత పనివారల సంఘం నేతృత్వంలో గౌడ కులస్తుల హక్కుల కోసం ఆయన చివరి వరకు పోరాడారు. పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మభిక్షం ప్రధాన పాత్ర వహించి 'కార్మిక పక్షపాతి'గా గుర్తింపు తెచ్చుకున్నారు. సాయుధ పోరాట యోధుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి కంటే సీనియర్ అయిన ధర్మభిక్షం, సాయుధ పోరాటంలో మాత్రం ఇద్దరూ కలిసి ఒకేసారి పాల్గొన్నారు. బీఎన్ అజ్ఞాత జీవితం గడపగా, ధర్మభిక్షం జైలు జీవితం ఎక్కువ కాలం గడిపారు.

స్వాతంత్ర్యం అనంతరం 1952లో తొలిసారిగా హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు సూర్యాపేట నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. తరువాత ఆంధ్రప్రదేశ్ శాసనసభకు 1957లో నకిరేకల్ నుంచి, 1962లో నల్లగొండ నుంచి ప్రాతినిధ్యం వహించారు. 1991లో, 1996లోనూ ఆయన ఎంపీగా నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. భారత ప్రభుత్వం నుంచి తామ్ర పత్ర పురస్కారం అందుకున్నారు. గ్రామీణ పేదల హక్కుల కోసం యువత, విద్యార్థులు, అసంఘటిత కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు నడిపారు. స్వాతంత్ర్య సమరయోధునిగానూ ఆయనది అసమాన పాత్ర. నల్లగొండలో పలు కార్మిక సంఘాలను స్థాపించారు. 1991-1996 మధ్య పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ (గ్రామీణాభివృద్ధి శాఖ) సభ్యులుగా పనిచేశారు. 2011 మార్చి 26న ఆయన తుదిశ్వాస విడిచారు.

-ఎ.బి.కూన

త్యాగధనుల చరిత్ర లాహోర్ కుట్రకేసు

జలియన్‌వాలాబాగ్‌లో 1919 ఏప్రియల్ 13న జనరల్ మైఖేల్ ఓ డయ్యర్ కర్కోటకంగా ఘోరాతిఘోరంగా జనహననానికి పాల్పడ్డారు. ఈ ఘటన 12ఏళ్ల భగత్‌సింగ్‌పై తీవ్ర ప్రభావాన్ని కలిగించింది. అమృత్‌సర్ వెళ్లాడు. నెత్తురుతో తడిసిన మట్టిని సీసాలో ఇంటికి తెచ్చి రోజూ పూలతో నివాళి అర్పించాడు. ఆ తర్వాత కర్తార్‌సింగ్ శరభా మార్గాన్ని ఎంచుకున్నాడు. 1926లో లాహోర్‌లో నౌజవాన్‌భారత్ సభను ఏర్పాటుచేసి కార్మికకర్షక రాజ్యం నిర్మాణంలో యువకులను విప్లవోద్యమంలోకి చేర్చాలని సంకల్పించాడు. 1928 డిసెంబరు 17న సైకిల్‌పై వెళుతున్న ఐ.పి.శాండర్స్ అనే పోలీసు ఆఫీసరును పోలీసు గేటు వద్ద మొదట రాజగురు కాల్చాడు. తరువాత భగత్‌సింగ్ పిస్టలుతో శాండర్సు తలను ముక్కలు ముక్కలు చేశాడు. వృద్ధుడు, దేశ భక్తుడు, ప్రియతముడు అయిన లాలాలజపతి రాయ్‌ను సైమన్ బహిష్కార ఉద్యమ సందర్భంగా ఈ శాండర్సు తలపైన, ఛాతిమీద తీవ్రంగా లాఠీచార్జి చేసి లజపతిరాయ్ మరణానికి కారణమయ్యాడు. దానికి ప్రతీకారంగా భగత్‌సింగ్ దళం శాండర్సును తుద ముట్టించారు. ఐదురోజులకు ముందుగానే లాహోర్ గోడలపై హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్‌పార్టీ నోటీసులు అంటించారు.

1929 ఏప్రియల్ 8న న్యూఢిల్లీలో కేంద్ర అసెంబ్లీ జరుగుతుండగా భగత్‌సింగ్, బటు కేశ్వర్ దత్తు పొగ బాంబులు వేశారు. పిస్తోలుతో గాలిలోకి కాల్పులు జరిపారు. అంతకుముందు బాంబులు తయారుచేసే రసాయనాలకోసం కలకత్తా వెళ్లారు. అక్కడ జతిన్ దాసు, ఫణీంద్రనాథ్ ఘోష్‌లుతో పరిచయమైంది. ఆగ్రాలో జతిన్‌దాసు బాంబులు తయారుచచేయడం నేర్పాడు. అక్కడ తయారుచేసిన స్వల్ప ప్రమాదం గల బాంబులను సెంట్రల్ అసెంబ్లీలో వీరు ప్రయోగించారు. దీనితో విప్లవ కార్యకలాపాలపై నిఘా పెరిగింది. కేంద్ర అసెంబ్లీలో భగత్‌సింగ్ అరెస్టు అయినప్పుడు చేతిలో దొరికిన ఆటోమేటిక్ రైఫిల్ సాండర్సును చంపిన రైఫిల్ ఒకటేనని తేలింది. శాండర్సు హత్య తర్వాత లాహోర్ గోడలపై నినాదాలు రాసిన రాత భగత్‌సింగ్‌దని తేలింది. లాహోరులో ఒకచోట బాంబులు తయారుచేసే సామగ్రి దొరికింది. దీనితో లాహోరు కుట్రకేసు పేరుతో ఒక కేసు విప్లవకారులపై బనాయించారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయిగా సుఖదేవ్‌ని పేర్కొన్నారు. ఇంకా ఈ కేసులో కిశోరీలాల్, శివ వర్మ, గయాప్రసాద్, జయదేవ్‌కపూర్, జతిన్‌దాసు, భగత్‌సింగ్, కమల్‌నాథ్ తివారి, బికె.దత్తు, జితేంద్ర సన్యాల్, అయ్యరామ్ దేశరాజ్, ప్రేమ్‌దత్, యస్.పాండే, మహాబీర్‌సింగ్, అజయ్‌కుమార్ ఘోష్, విజయ కుమార్ సిన్హా, చంద్రశేఖర అజాద్, భగవతీ చరణ్ యశ్‌పాల్, బికె.సభా, రఘునాథ్(రాజగురు) ఉన్నారు. చంద్రశేఖర అజాద్, యశ్‌పాల్ తప్ప తక్కినవారంతా అరెస్టు అయ్యారు. జయగోపాల్, హంసరాజ్ అప్రూవర్లుగా మారిపోయారు.

లాహోర్ కుట్రకేసు విచారణ 1929 జులై 10న లాహోర్‌లో ప్రారంభమైంది. లాహోర్ కుట్రకేసులో రాజకీయఖైదీల సౌకర్యాలన్నీ తమకూ వర్తించాలని డిమాండ్‌చేస్తు భగత్‌సింగ్, బటుకేశ్వర దత్తులు నిరాహార దీక్షలు ప్రారంభించారు. విచారణ ఖైదీలుగా ఉన్న 19 మంది జులై మధ్యలో నిరాహారదీక్షలో చేరారు. వారిలో జితిన్‌దాసు కూడా ఉన్నాడు. 63రోజుల దీక్ష తరువాత కఠోరనియమంతో దీక్ష కొనసాగించిన జితిన్‌దాస్ వీర మరణం చెందాడు. భగత్‌సింగ్, బటుకేశ్వరదత్తుల దీక్ష 114 రోజులు కొనసాగి పాక్షికంగా కోర్కెల ఆమెదంతో విరమించారు. నిరాహారదీక్షల కాలంలో ఖైదీలను విచారణ నిమిత్తం స్ట్రెచర్లపై కోర్టుకు తీసుకువచ్చారు. జైలులో దీక్ష చేస్తున్న ఖైదీల పట్లఅధికారులు అమానుషంగా వ్యవహరించారు. మంచినీళ్లకు బదులు పాలు పాత్రలతో పెట్టారు. బలవంతాన ఆహారం ఎక్కిస్తే ఈగలను మింగి వాంతులు చేసుకున్న సందర్భాలున్నాయి. శారీరకంగా ఖైదీలను తీవ్రంగా హింసించారు. ముక్కులతోను, నోటితోను గొట్టాల ద్వారా ఆహారాన్ని ఎక్కించే ప్రయత్నాన్ని జితిన్‌దాస్ తీవ్రంగా ప్రతిఘటించాడు. దానితో జితిన్‌దాస్‌అవయవాలు స్పర్శజ్ఞానం కోల్పోయాయి. కొందరు ఖైదీలు తీవ్ర జర్వరంతో ఉన్నా, కొందరు రక్తం కక్కుకున్నా దీక్షను మాత్రం విరమించలేదు. జీవకళను కోల్పోయిన జితిన్‌దాస్ చివరకు 1929 సెప్టెంబరు 13న మరణించారు. ఆ దృశ్యం చూసిన జైలు అధికారులు సైతం కళ్లనీళ్లు పెట్టుకున్నారు. కలకత్తాలో జితేంద్రదాసు అంతిమయాత్రకు లక్షలమంది ప్రజలువచ్చి నివాళులు అర్పించారు. చంద్రశేఖర్‌అజాద్, భగవతీ చరణ్‌లు కలకత్తాకు జితిన్‌దాస్ శవాన్ని తీసుకువెళ్లిన రైలులోనే రహస్యంగా ప్రయాణించారు. 1931 ఫిబ్రవరి 27న పోలీసులు చంద్రశేఖర్ అజాద్ మధ్య అలహాబాద్ పార్కులో జరిగిన హోరాహోరీపోరుతో తుపాకీతూటాలు అయిపోయి చివరి తూటాలతో తనకుతాను కాల్చుకుని చనిపోయాడు.

లాహోర్ కుట్రకేసులో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు ఉరిశిక్ష విధించారు. విజయకుమార్ సిన్హా, శివవర్మ, కిశోరిలాల్, జయదేవ్‌కపూర్,మహావీర్‌సింగ్, డా.గయాప్రసాద్ నిగమ్, కమల్‌నాథ్ తివారీలకు యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్ష, కుందన్‌లాల్‌కు 7ఏళ్లు, ప్రేమదత్తుకు 5ఏళ్లు శిక్ష విధించారు. బి.కె.దత్తు, అజయ్‌ఘోష్ విడుదల అయ్యారు. గాంధీ-ఇర్విన్ ఒడంబడికలో షరతుగా చేర్చనందున 1931 మార్చి 23న భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరితీశారు. హుస్సేనివాలాలో వీరికి సమాధులు నిర్మించారు. దేశంకోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి ఉరితాళ్లను ముద్దాడిన భారతజాతి వీర పుత్రులకు సీపీఐ 24వ జాతీయ మహాసభల సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిద్దాం.

- (సి.వె.ర)



1931 ఫిబ్రవరి 27న అలహాబాదులోని ఆల్ఫ్రెడ్ పార్కులో బ్రిటీష్ కిరాయి సైనికుల ఎన్‌కౌంటర్‌లో ఒళ్లంతా తూటాల గాయాలో మరణించారు.

1931 మార్చి 23న రాజగురు, సుఖదేవ్‌లతో బాటు భగత్‌సింగ్‌నూ ఉరితీసి, మృతదేహాలను ముక్కలుగా నరికి, కిరోసిన్ పోసి తగులబెట్టారు.

పోరుబాట

జనాగ్రహం ఉబికొస్తోందీ

కాలం విసిరిన సవాళ్లూ
కలకాలం నిలబడవన్నీ
కాలం ముందడుగేసిందంటే
సవాళ్ళ సందడి ఉండవూ
కళ్ళకింక కనిపించవూ

ధైర్యం స్థైర్యం రెండు కాళ్ళతో
ముందుకె నడవాలీ సవాళ్ళకు
జవాబులిసరాలీ మెదళ్ళ
పొరలను విప్పాలీ ॥

నిత్యసమస్యల వలలో చిక్కీ
విలవిలలాడే ప్రజకూ
తోడున్నామని వెంటొస్తామని
ధైర్యం నింపాలీ - వాళ్ళ
వెన్నంటుండాలీ ॥

ఉదయరాగాల ఊపిరి పీల్చీ
త్యాగరంజితం కావాలీ
జనం బతుకులో
వెలుగు నింపుతూ
దివిటీలవ్వాలీ - నీళ్ళలో
చేపలమవ్వాలీ ॥

గత చరిత్రలను మలిపేస్తుంటే
ఎదురొడ్డుండాలీ - వాళ్ళ
పనిబట్టుండాలీ - జనతకు
తెలివిడిచెయ్యాలీ ॥

భక్తి కులాల మాటున వంకర
కథలను చెప్తారూ
మనసుకు చీకాకౌతారూ - ఆ
కుట్రల తెరలను చించేస్తూ
ప్రజకళ్ళను తెరవాలీ
ఉద్యమ బాటను చూపాలీ ॥

కాషాయం తలకెక్కి మత్తుతో
కుప్పిగంతులేస్తోందీ
రాజకీయాల రాజవీధిలో జన
స్వామ్యాన్నురి తీస్తోందీ
జనాగ్రహానికి బాటలు చూపే
చేతలే చేసి చూపాలీ పోరు
బాట పట్టించాలీ ॥

కాదన్నవాడి ఇంటింట ఈ.డి.
సోదాల జాలామేస్తాయీ
కష్టాల కొలిమి పెడ్తాయీ
పైకి పటారం లోన లొటారం
పైపై ఆర్భాటం! నిలవదు ఏకాలం ॥

పేక ముక్కలా సీటులూడగా
బీటలు పడ్తున్నాయీ
మతాల కోటలో తత్తరపాటుతొ
చిటపటమంటూన్నాయీ
సహనం చచ్చీ అరుపులు హెచ్చీ
అదుపులు వస్తున్నాయీ ప్రభుతకు
కుదుపులు వస్తున్నాయి ॥

ప్రభుతరంగు తెలిసొస్తోందీ
జనాగ్రహం ఉబికొస్తోందీ
నలుగురూ కలిసి ఒక్కటై ప్రజా
శక్తిగా దూసుకొస్తోందీ
చరితనే తిరగరాస్తుందీ - ఇక
కాలమే కథ ముగిస్తుందీ ॥

- ఏటుకూరి ప్రసాద్

ఎదిగీ ఎదగక ముందే ఎర్రజెండా

అనుబంధం

రాయాలంటే ఇతరులకు స్ఫూర్తినిచ్చే జీవితం ఉండాలి. ఇతరుల నుండి స్ఫూర్తి పొందిన విషయం కూడా పరిశీలనార్హమే. 1954 లో నేను పుట్టిన వెంటనే మా కుటుంబం ప్రస్తుతం పల్నాడు జిల్లా వినుకొండ సమీపంలోని శావల్యాపురం నుండి గుంటూరుకు వలస వచ్చింది. విజయవాడ రోడ్డులోని మా ఇంటి సమీపంలో వేలాది మంది కార్మికులు పని చేసే డజన్ల సంఖ్యలో పొగాకు కంపెనీలుండేవి. నూరు శాతం కార్మికులూ ఏ.ఐ.టి.యుసిలోనే ఉండేవారు. మేడే రోజు ఎరుపు రంగు కమ్మిన ఊరేగింపు సుమారు 50 ప్రభలు 50 వేల పైచిలుకు కార్మికులతో పట్టణ ప్రజల్ని అలరించేది.

మా నాన్నకు వంట చెరుకు వ్యాపారం. ప్రతి కంపెనీ గేటు పక్క ఒక క్యాంటిన్ ఉండేది. వీళ్లంతా మా కస్టమర్లే. రోజూ వెళ్లి వాళ్ల దగ్గర డబ్బు వసూలు చేసుకొచ్చే వాళ్లు. ఈ క్రమంలో చాలా కంపెనీల కార్మికుల్తో పరిచయాలు వచ్చాయి. నేను ఎలిమెంటరీ స్కూల్లో ఉండగా మా ఇంటి ఎదురు బి.ఐ.టి (బ్రిటీషు ఇండియా టుబేకో కంపెనీ) కార్మిక సంఘ కార్యాలయం నిర్మించారు. ఆనాటి కార్మిక నాయకులు మల్లయలింగం, కనపర్తి నాగయ్య, కే.ఎల్. నర్సింహారావు, సూర్యం తదితరులు రోజూ కలుస్తుండేవారు. అప్పుడే 62 ఎన్నికలొచ్చాయి. కనపర్తి నాగయ్య పార్టీ అభ్యర్థిగా గెల్చిన ఆ ఎన్నికల్లో 10 మంది పిల్లల్ని పోగేసి రెండు రేకు బూరల్తో "కంకీ- కొడవలి" గుర్తుకే మన ఓటు అని నెహ్రూనగర్ వీధులన్నీ తిరిగే వాళ్లం. మా గల్లాపెట్టె కళకళలు నా జేబు గలగలలకు తోడ్పడేది. కనుక పిల్లల్ని పోగేయటం నాకు కష్టం అయ్యేది కాదు.

హైస్కూలు కొచ్చేసరికి రోజూ పార్టీ ఆఫీసు కెళ్లి కూర్చునే వాళ్లం. పట్టణ పార్టీ కార్యాలయం ఇప్పటి గౌరిశంకర్ థియేటర్‌పక్కన, జిల్లా పార్టీ కార్యాయం లీలామహల్ ఎదురు ఉండేది. ఎస్.ఎఫ్‌జిల్లా కమిటీ సమావేశంలోకి కూడా వెళ్లి కూర్చొనేవాణ్ణి.స్టాలిన్ బాబు, మాదల రంగారావు, టి.కృష్ణ, డా॥కె.నారాయణ తదితరులంతా అందులో ఉండేవారు. నా వయసు కారణంగా అందరూ నన్ను అభిమానంగా చూస్తూ బయటకెళ్లమనేవారు కాదు. అయినా వాళ్లు మాట్లాడుకునే విషయాలేమిటో నాకు అర్థమయ్యేవి కావు.

నేను హైస్కూలులో ఉన్న కాలంలోనే హోటల్ రేట్లకు వ్యతిరేకంగా రెండు సార్లు, విశాఖ ఉక్కు కోసం ఒకసారి పెద్ద ఉద్యమాలు జరిగాయి. లోతుపాతులు తెలయకపోయినా వాటన్నిటిలోనూ పాల్గొనేవాణ్ణి. 1967 ఎన్నికల్లో కనపర్తి నాగయ్యకు 1971 ఎన్నికల్లో శ్రీకృష్ణకు ఎన్నికల ప్రచారం చేయటంలో పాల్గొన్నాను. పట్టణంలో జరిగిన ఇళ్ల స్థలాల ఆక్రమణలు అన్నిటికీ (సంజీవయ్య నగర్, సంజీవరెడ్డి నగర్) నేను ప్రత్యక్ష సాక్షిని. "కమ్యూనిస్టులు మా కాలేజీలో ఉండే వీలులేదు" అని ఇంటర్ చదువుతుండగా నన్నూ, నవులూరి ప్రసాద్‌ని జె.కే.సి కాలేజీ నుండి పంపించారు. ప్రసాద్‌ని మళ్లీ చేర్చుకున్నారు కాని ఎన్ని ప్రయత్నాలు చేసినా నన్ను తిరిగి చేర్చుకోలేదు. దాంతో హిందూ కాలేజీలో చేరి ఆ కాలేజి విద్యార్థి యూనియన్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యాను. ఆ తర్వాత తరిమెల నాగిరెడ్డి అనుచరునిగా మారి చాలాకాలం ఆయనతో పనిచేశాను. ప్రస్తుతం ఏ పార్టీ నిర్మాణంలో లేకపోయినా జిల్లాలోని అన్ని కమ్యూనిస్టు పార్టీల భాగస్వామ్యంలో ఏర్పడిన "అమర వీరుల స్మారక ట్రస్టు" కార్యదర్శిగా ఉంటూ గత పాతిక సంవత్సరాలుగా స్మారక సభలు నిర్వహిస్తూ, న్యాయవాదిగా అన్ని కమ్యూనిస్టు పార్టీలకు సహకరిస్తూ, స్నేహంగా ఉంటున్నాను.

-చెరుకూరి సత్యనారాయణ

మూడు క్వింటాళ్ల ఉల్లి అమ్మితే

రెండు రూపాయలు వచ్చాయ్

- నోట మాటరాక ఏడ్చిన రైతు
- మధ్యప్రదేశ్‌లో ఉల్లి రైతు ఘోష
- డబుల్ ఇంజిన్ పాలనలో దుస్థితి

భోపాల్: మాటలు కోటలు దాటతాయంటారు. ఇది ముమ్మాటికీ బీజేపీకి వర్తిస్తుంది. ఏ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చినా డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్రానికి మేలు జరుగుతుంది...బీజేపీని గెలిపించండి అంటూ ప్రచారాన్ని ఊదరగొడతారు. ఇప్పుడు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది. మధ్యప్రదేశ్‌లోనూ బీజేపీయే అధికారంలో ఉంది. అయినా ఇక్కడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. గిట్టుబాటు ధర లేదు. దళారులు, వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు. దీనికి సంబంధించి మధ్యప్రదేశ్‌లో ఓ రైతుకు జరిగిన అనుభవాన్ని చూద్దాం....మూడు క్వింటాళ్ల ఉల్లిగడ్డ పండిస్తే వచ్చింది రెండు రూపాయలే! ఇది మధ్యప్రదేశ్‌లోని డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో రైతుల దుస్థితి. మూడు క్వింటాళ్ల ఉల్లిగడ్డను పండించిన రైతు జయరాం ఇటీవల అమ్మడానికి షాజాపూర్ పట్టణంలోని మార్కెట్ యార్డుకు తీసుకెళ్లాడు. ఒక్కో బస్తాలో 50 కిలోల చొప్పున మొత్తం ఆరు బస్తాల్లో సరుకును మార్కెట్‌కు తెచ్చాడు. ఇది చూసిన ఓ వ్యాపారి రైతు వద్దకు వచ్చాడు. బేరం చేయడం మొదలుపెట్టాడు. ప్రస్తుతం ధర లేదంటూ మాయమాటలు చెప్పి ఒక్కో బస్తాకు ఒక్కో రేటు చొప్పున కొనుగోలు చేయడం ప్రారంభించాడు.

తొలుత ఒక బస్తాకు రూ.60, తర్వాత రెండు బస్తాలకు రూ.75 చొప్పున రూ.150, చివరికి మిగిలిన మూడు బస్తాలకు రూ.40 చొప్పున రూ.120 ఇచ్చి కొనుగోలు చేశాడు. దీంతో రైతుకు రూ.330 వచ్చాయి. అయితే ఉల్లిగడ్డలను మార్కెట్ యార్డుకు తీసుకురావడానికి రవాణా కింద రూ.280 ఖర్చు అయింది. మార్కెట్ యార్డులో హమాలి ఖర్చులకు రూ.48 పోయాయి. ఈ రెండింటిని కలిపితే ఖర్చుల కింద రూ.328 పోగా రైతుకు మిగిలింది రెండు రూపాయలే. దీంతో ఆ రైతు హతాశుడయ్యాడు. ఎంతో కష్టపడి పంట పండించి మార్కెట్ యార్డుకు తీసుకొస్తే వచ్చేది రెండు రూపాయలా అంటూ బోరున ఏడ్చాడు. వాస్తవానికి మార్కెట్ యార్డులు ఏర్పాటు చేసింది రైతుల కోసమే. ఇవి ప్రభుత్వ కనుసన్నల్లోనే నడుస్తుంటాయి. కాబట్టి దళారులు, వ్యాపారులు రైతులను దోచుకోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంటుంది. కానీ బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో రైతు ఏ విధంగా నిలువుదోపిడీకి గురవుతున్నాడో చెప్పడానికి ఈ ఘటన ఓ నిదర్శనం.

వ్యాపం కేసులో ఐదుగురికి జైలు

భోపాల్: దేశంలో సంచలనం సృష్టించిన వ్యాపం కుంభకోణం కేసులో సుదీర్ఘ కాలం తర్వాత ఐదుగురు నిందితులకు సీబీఐ ప్రత్యేకకోర్టు గురువారం ఏడేళ్ల శిక్ష విధించింది. వ్యాపంగా గుర్తింపు పొందిన మధ్యప్రదేశ్‌లోని వ్యవసాయిక పరీక్ష మండల్ నియామకాల్లో పెద్దఎత్తున అక్రమాలు, అవినీతి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. 2013లో జరిగిన ఈ కేసులో కమల్ కిశోర్, అమర్‌సింగ్, నాగేంద్రసింగ్, సురేశ్ సింగ్, రవి కుమార్ రాజ్‌పుత్‌లకు ప్రత్యేకకోర్టు జడ్జి నితిరాజ్ సింగ్ సిసోడియా శిక్ష విధించారు. దీనితోపాటు రూ.10 వేల చొప్పున కోర్టు జరిమానా విధించింది. 32 మంది సాక్షులను విచారించిన తర్వాత నిందితులకు శిక్ష విధించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మనుజి ఉపాధ్యాయ చెప్పారు. 2013 ఏప్రిల్ 7న జరిగిన మధ్యప్రదేశ్ పోలీసు కానిస్టేబుల్ నియామక పరీక్ష రాయడానికి కమల్, అమర్, నాగేంద్ర, సురేశ్ కొంతమందిని ఏర్పాటు చేసుకున్నారని, నాగేంద్ర పరీక్షను రవి రాజ్‌పుత్ రాశారని ఉపాధ్యాయ తెలిపారు. అంతేకాకుండా వ్యాపం కుంభకోణం కేసులో పెద్దఎత్తున డబ్బు చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి.

కొత్త సీడీఎస్‌కు ఐదు సవాళ్లు

న్యూఢిల్లీ: నూతన సీడీఎస్ అనిల్ చౌహాన్ ముందర ప్రధానంగా ఐదు సవాళ్లు ఉన్నాయి. లడఖ్ సరిహద్దు సంక్షోభం, ఆధునికీకరణ పేలవమైన స్థితిలో ఉండటం, ఇంటిగ్రేటెడ్ థియేటర్ కమాండ్ల ఏర్పాటు కోసం మాజీ సీడీఎస్ రావత్ ఆదేశాల అమలు; పాకిస్తాన్ ఫంట్; సైనిక వ్యవహారాల శాఖ పటిష్ఠత వంటివి తక్షణమే పరిష్కరించాల్సిన అంశాలు. కాగా, తొలి సవాల్‌గా లడఖ్ సరిహద్దు సంక్షోభాన్ని పరిష్కరించాల్సి ఉంది. సరిహద్దు వెంబడి భారత భూభాగాలను చైనా ఆక్రమించి.. సాధారణ పరిస్థితులు ఉన్నాయని చెబుతుండటంతో ఈ సమస్య పరిష్కారం ఎలా అన్నది భారత్‌కు తోచడం లేదు. రెండవది, ఆధునీకరణ పేలవంగా ఉండ టం. కాలం చెల్లిన ఆయుధాలు - మాధ్యమాలు, పరికరాల కొరతతో త్రివిధ దళాలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. పాతవి తొలగించి వాటి స్థానంలో కొత్త ఆధునిక పరికరాలను తక్షణమే భర్తీ చేయాలి కానీ ఆర్థిక మాంద్యం వల్ల అవసరమైన వనరులను అందజేయడంలో ప్రభుత్వం విఫలమైంది. సామర్థ్యాలు, సాంకేతిక నైపుణ్యం పెంచుకోవడం సమస్యగా మారింది. ఆత్మనిర్భర్ భారత్ - మేకిన్ ఇండియా కోసం పట్టు పట్టడంతో ఈ సమస్య సంక్లిష్టమైంది. పర్యవసానంగా యుద్ధ సంబంధిత క్షేత్రాల్లో అవసరమైన కొత్త మార్పులు మరింత జాప్యం కానున్నాయి. మూడవది, మాజీ సీడీఎస్ రావత్ ఇచ్చిన ఇంటిగ్రేటెడ్ థియేటర్ కమాండ్‌ల ఏర్పాటు ఆదేశాల అమలు... త్రివిధ దళాలలో పిరమిడ్ స్ట్రక్చర్‌లో సీనియర్ అధికారుల ఆకాంక్షలు; రాజకీయబద్ధ మార్గదర్శకాల కోసం రావత్ ఈ వ్యవస్థను ఏర్పాటు చేయాలనుకున్నారు. ఇది కొత్త సీడీఎస్‌కు సవాల్‌గా ఉంది. ఆయన ఓర్పుతో జాగ్రత్తగా దీనిని రూపుదిద్దాల్సి ఉంటుంది. నాల్గో సవాల్ పాకిస్తాన్ ఫ్రంట్. చైనా సరిహద్దు వద్ద బలగాల సమతుల్య క్రమంలో పాకిస్తాన్ ఫ్రంట్ సవాల్‌గా మారింది. కశ్మీర్‌లోని రాష్ట్రీయ రైఫిళ్లు, అసోం రైఫిళ్ల కమాండ్ భవితవ్యం దీనిపై ఆధారపడి ఉంది. ఇవన్నీ సాయుధ సిబ్బందిలో రెండు లక్షల మందిని తగ్గించే దిశగా సాగే రాజకీయ మార్గదర్శకాలతో ముడిపడి ఉన్నాయి. అంతమందిని ఏక కాలంలో తొలగించడం కష్టసాధ్యమైనది. చివరగా ఐదవ సవాల్‌గా రక్షణశాఖ పరిధిలోని సైనిక వ్యవహారాల శాఖను పటిష్టపర్చడం... తన కంటే ముందు నాలుగు నక్షత్రాలు ధరించిన త్రివిధ దళాధిపతులతో స్నేహంగా ఉండటం, కలిసి పనిచేయడం కొత్త సీడీఎస్‌కు ఒక సవాల్ గానే చెపాల్సి ఉంటుంది. ప్రోటోకాల్ ప్రకారం త్రివిధ దళాధిపతులతో సీడీఎస్‌కు సమాన హోదా ఉంది. అయితే రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్‌ను ఆ పదవిలో నియమించడం వల్ల హోదా పరంగా సమస్యలు వస్తేగనుక అనేక కొత్త సమస్యలు తెరపైకి రావడం ఖాయమవుతుంది. ఏదిఏమైనా రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ అనిల్ చౌహాన్‌ను నూతన సీడీఎస్‌గా నియమించడం ఆసక్తికర పరిణామంగానే చెప్పాల్సి ఉంటుంది. ఇదిలావుంటే, తొలి సీడీఎస్... జనరల్ బిపిన్ రావత్ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన దాదాపు 10 నెలలకు ఆ స్థానాన్ని కేంద్రం భర్తీ చేసింది.

ఫాల్కే అవార్డు అందుకున్న ఆశా పరేఖ్

సూర్య, అజయ్ దేవ్‌గన్‌కు ఉత్తమ నటుల అవార్డు

న్యూఢిల్లీ: సీనియర్ నటి ఆశా పరేఖ్ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్నారు. భారతీయ చిత్రసీమలో అత్యున్నత పురస్కారాన్ని 79ఏళ్ల పరేఖ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. శుక్రవారం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 68వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ అవార్డును అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు ఆశా పరేఖ్ తెలిపారు. తన 80వ జన్మదినానికి ఒక రోజు ముందు ఈ గుర్తింపు లభించినందుకు చాలా కృతజ్ఞురాలినని ఆమె చెప్పారు. భారత ప్రభుత్వం తనకు అత్యున్నత గౌరవాన్ని ఇచ్చిందని అన్నారు. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు కమిటీలోని ఐదుగురు సభ్యులు అశా భోంస్లే, హేమా మాలిని, పూనమ్ ధిల్లన్, ఉదిత్ నారాయణ్, టీఎస్ నాగభరణ కలిసి పరేఖ్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఆశా పరేఖ్ 95 చిత్రాలకుపైగా నటించారు. 1952 బాలనటిగా ఆమె వెండి తెరకు పరిచయమయ్యారు. ఆమెకు 1992లో పద్మశ్రీతో సన్మానించారు. అదే విధంగా జాతీయ ఉత్తమ నటులుగా సూర్య, అజయ్ దేవ్‌గన్ పురస్కారాలు అందుకున్నారు.

అవార్డులు అందుకున్న ఇతర నటులు

ఉత్తమ నటులుగా సూర్య (సూరారై పోట్రు), అజయ్ దేవ్‌గన్ (తానాజీ) ఉత్తమ నటిగా అపర్ణ బాలమురళి (సూరారై పోట్రు), ఉత్తమ చిత్రంగా సూరారై పోట్రు (సుధాకొంగర)ఉత్తమ దర్శకుడిగా దివంగత సచ్చిదానందన్ (అయ్యప్పనుమ్ కోషియుం) ఉత్తమ సహాయ నటిగా లక్ష్మీ ప్రియ చంద్రమౌళి (శివ రంజనీయుం ఇన్నుమ్ సిలా పెంగళం) అవార్డులు అందుకున్నారు. ఉత్తమ సహాయ నటుడు: బిజూ మేనన్ (అయ్యప్పనుమ్ కోషియుం) ఉత్తమ యాక్షన్ డైరక్షన్: అయ్యప్పనుమ్ కోషియుమ్ (మలయాళం) రాజశేఖర్, మాఫియా శశి, సుప్రీం సుందర్, ఉత్తమ కొరియోగ్రఫీ: నాట్యం (తెలుగు) సంధ్యారాజు, ఉత్తమ గీత రచన: సైనా (హిందీ) మనోజ్ ముంతిశిర్, ఉత్తమ సంగీతం (పాటలు): అల వైకుంఠపురములో (తెలుగు) తమన్, ఉత్తమ సంగీతం(నేపథ్య): సూరారై పోట్రు (తమిళం) జీవీ ప్రకాశ్‌కుమార్, ఉత్తమ మేకప్: నాట్యం (తెలుగు) టి.వి. రాంబాబుఉత్తమ కాస్ట్యూమ్స్: తానాజీ (హిందీ) నచికేత్ బార్వే, మహేశ్ శర్మా, ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: కప్పెలా (మలయాళం) అనీష్ నడో, ఉత్తమ ఎడిటింగ్: శివరంజనీయుం ఇన్నుమ్ సిలా పెంగళం(తమిళం) శ్రీకర్ ప్రసాద్, ఉత్తమ ఆడియోగ్రఫీ(లొకేషన్ సౌండ్): డోలు (కన్నడ) జాబిన్ జయాన్, ఉత్తమ సౌండ్ డిజైనర్: మి వసంతరావు(మరాఠీ) అనుమోల్ భవే, ఉత్తమ సౌండ్ డిజైన్(ఫైనల్ మిక్స్) : మాలిక్(మలయాళం) విష్ణు గోవింద్, శ్రీ శంకర్, ఉత్తమ స్క్రీన్‌ప్లే: సూరారైపోట్రు (తమిళం) షాలిని ఉషా నయ్యర్, సుధా కొంగర, ఉత్తమ సంభాషణలు: మండేలా (తమిళం) మడోన్నే అశ్విన్, ఉత్తమ సినిమాటోగ్రఫీ: అవిజాత్రిక్ (బెంగాలీ) సుప్రతిమ్ భోల్, ఉత్తమ నేపథ్య గాయని: నన్‌చ్చమ్మ (మలయాళం) అయ్యప్పనుమ్ కోషియుమ్), ఉత్తమ నేపథ్య గాయకుడు: మి వసంతరావు(మరాఠీ) రాహుల్ దేశ్ పాండే, ఉత్తమ బాల నటుడు: అనీశ్ మంగేశ్ గోస్వామి(టక్‌టక్), ఆకాంక్ష పింగ్లే, దివ్వేష్ తెండుల్కర్(సుమీ)(మరాఠీ చిత్రాలు) అవార్డులు పొందారు.

జాతీయ లాంగ్ జంప్ పోటీలకు నాగేంద్ర

విశాలాంధ్ర-బెలగాం: రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్ (లాంగ్ జంప్) పోటీలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సెప్టెంబర్ 27-29వ తేదీ వరకు జరిగాయి. ఆర్మీ, పోలీసు మినహా మిగిలిన 50-60 సంవత్సరాల మధ్య వారికి జరిగిన పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లా, సీతానగరం మండలం మరిపివలస జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు గేదెల నాగేంద్రరావు నాయుడు(59) రజత పతకాన్ని సాధించారు. లాంగ్ జంప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈయన ఎంపికపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.సుధాకర్, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు సిబ్బంది అభినందనలు తెలిపారు. త్వరలో దిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఐఏఎస్ అధికారి తీరును ఖండించిన బీహార్ ప్రభుత్వం

పాట్నా: సీనియర్ ఐఏఎస్ అధికారిణి హర్జోత్ కౌర్ బమ్రాహ్ అనుచిత ప్రవర్తనను బీహార్ ప్రభుత్వం శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించింది. ఈ వారం మొదట్లో ఇక్కడ విద్యార్థినులతో సమావేశం సమయంలో ఐఏఎస్ అధికారిణి అనుచితంగా వ్యవహరించడం నిరసనకు దారి తీసింది. రాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి సంస్థకు నేతృత్వం వహిస్తున్న బమ్రాహ్ ప్రవర్తన 'రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో సరైనది కాదు' అని ప్రకటన పేర్కొంది. యునిసెఫ్‌తో సంయుక్తంగా నిర్వహించిన వర్క్ షాప్‌లో అదనపు ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారి అయిన బమ్రాహ్... బాలిక విద్యార్థులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్‌లను అందించడాన్ని ప్రభుత్వం పరిగణించాలని సూచించినం దుకు కార్యక్రమంలో పాల్గొన్న ఒకరిని అవహేళన చేశారు. అదే సమయంలో సెప్టెంబర్ 27 ఫంక్షన్‌కు సంబంధించిన వీడియో ఫుటేజ్ సామాజిక మాధ్య మాల్లో వైరల్ కావడంతో తలెత్తిన వివాదంపై విచారం వ్యక్తం చేస్తూ అధికారి సంతకం చేసిన ప్రకటనను విడుదల చేశారు. కాగా ఇక్కడ కమల నెహ్రూ నగర్ మురికివాడలో నివసిస్తున్న రియా కుమారి, మహిళా పరిశుభ్రత ఉత్పత్తుల ప్రముఖ తయారీదారు దృష్టిని ఆకర్షించింది. విద్యార్థిని అయిన రియా కుమారికి 'ఆమె ధైర్యానికి ప్రశంసలకు చిహ్నంగా' ఏడాది పాటు శానిటరీ ప్యాడ్‌లను సరఫరా చేస్తామని తెలిపింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.